TELUGU CLASSICS - POPULAR EDITION SERIES.

శతకసంపుటము

[ద్వితీయభాగము]

AS2010114

సంపాదకుడు :
స్వామి శివశంకర స్వామి

ప్రచురణ :
ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి
కళాభవనము - హైదరాబాదు - 4.

TELUGU CLASSICS - POPULAR EDITION SERIES.

శతకసంపుటము

[ద్వితీయభాగము]

సంపాదకుడు :
స్వామి శివశంకర స్వామి



ప్రచురణ :
ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ
కళాభవనం - హైదరాబాదు - 4.

ప్రథమ ముద్రణ
కీలక - 1968
ప్రతులు - 4000

వెల రు. 1-50

ముద్రణ :
కమల్ ప్రింటర్స్,
బాకారం, హైదరాబాదు - 20.

తొలిపలుకు

ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రివర్యులు శ్రీ యం. ఆర్. అప్పారావుగారు చేసిన సూచన ననుసరించి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, తెలుగు భాష లోని ప్రాచీన సాహిత్యము అందరికి అందుబాటులో నుండునట్లుగా ముద్రించి ప్రకటించవలె నని నిశ్చయించినది. తెలుగుభాషలోని పూర్వ గ్రంథ సముదాయ మీనాడు పాఠకునికి సక్రమముగా సరసమైన ధరకు లభ్య మగుట లేదు. ఈ లోటును తీర్చి ప్రాచీన గ్రంథ సంచయమును విడి విడిగా ప్రకటించుటకు సాహిత్య అకాడమీ, ఒక ప్రణాళిక ప్రకారము యీ కార్యక్రమము మూడు తరగతులుగా విభజించ నైనది. మొదటిది ప్రాచీన ప్రబంధాల ప్రకటన. రెండవది మహాభారతము, భాగవతము, హరివంశము, భాస్కరరామాయణము, బసవపురాణము, భోజ రాజీయములను సంగ్రహించి ప్రకటించుట; మూడవది భారత భాగవతాలనుండియు నాచన సోమన, కంకంటి పాపరాజు, కూచిమంచి తిమ్మకవి రచనలనుండియు భాగాలను ఏర్చికూర్చి ప్రకటించుట. మొదటి తరగతిలో 27 ప్రబంధాలను 27 సంపుటాలుగా, రెండవ తరగతిలోని గ్రంథములను 15 సంపుటాలుగా, మూడవ తరగతిలోని గ్రంథాలను 8 సంపుటాలుగా మొత్తము 50 సంపుటాలను ప్రకటించు కార్యక్రమము స్వీకరించవలె నని అకాడమీ తీర్మానించినది.

ఈ ప్రణాళిక ప్రకారము ప్రతి సంపుటము $\frac{1}{8}$ డెమ్మైజులో క్యాలికో బైండుతో 200 పేజీల గ్రంథముగా నుండవలె నని నిర్ణయించ నైనది. ప్రతి గ్రంథములో గ్రంథకర్తనుగూర్చి, గ్రంథ ప్రాశస్త్యమునుగూర్చి వివరించు సుమారు 40 పేజీల పీఠికను చేర్చవలెనని నిశ్చయించనైనది. ఈ విధముగా యీ సంపుటాలన్నిటిని సుమారు 5 సంవత్సరముల కాలములో ముద్రించి ప్రకటించవలెనని అకాడమీ కార్యవర్గము తీర్మానించినది.

మేము కోరినంతనే ఈ సంపుటము సిద్ధముచేయు బాధ్యతను స్వీకరించి, నిర్ణయించిన గడువులోపల ప్రాతప్రతిని కార్యాలయానికి అందజేసిన ప్రసిద్ధ పరిశోధకులు శ్రీ శివశంకరస్వామిగారికి అకాడమీ పక్షాన కృతజ్ఞతలు.

పైన పేర్కొనిన 50 సంపుటాల ద్వితీయ ముద్రణలను సిద్ధముచేసి ముద్రించుటకు, అవసరమైన డబ్బును పూర్తిగా అకాడమీకి యిచ్చుటకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వాగ్దానము గావించి యిందులో కొంతడబ్బును విడుదలకూడ చేసినవి, ఇందుకు అకాడమీ పక్షాన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ధన్యవాదాలు. అనుకొనిన వ్యవధిలో సంపుటాలను సిద్ధము చేసి, ఆంధ్రపాఠక లోకానికి అంద జేయుట జరుగగల దని విశ్వసించుచున్నాము.

హైదరాబాదు
30-7-1968

దేవులపల్లి రామానుజరావు

విషయసూచిక

1. నారాయణ శతకము

2. నరసింహ శతకము

3. భాస్కర శతకము

4. ఆంధ్రనాయక శతకము

5. కుక్కుటేశ్వర శతకము

ప్రస్తావన

భూషాభోగి ఫణారత్న రోచి శ్చయ చారవే
నమః ప్రలీన ముక్తాయ హర కల్ప మహీరుహే !

I

ఎవరైనను ఏదైన వార్త విన్నప్పుడు గాని, దృశ్యమును చూచినప్పుడు కాని సామాన్యముగా సతోద్రేకము కలుగక పోవచ్చును. ఒకవేళ కలిగిన పక్షమున తోడనే విక్షేపము చెందవచ్చును. స్థాయి కుదిరిన యెడల కవితాత్మ కలవారినోట పద్యమో, పాటో బయలు వెడల వచ్చును, అనగా తగిన కవిశిక్ష పొంది పద్య రచనా సామర్థ్యము అలవడ్డ వారికే ఈయది సంభవించును. ఏదో సందర్భమున పద్యము పలుకవచ్చును. అట్లు చెప్పినదానికి ప్రాస్తావిక మని నామము. ఒక్కొక్కప్పుడు ఒకటికన్న ఎక్కువ పద్యములు కాని, పంక్తులు కాని అప్రయత్నముగనో, ప్రయత్న పూర్వకముగనో, ఈషత్ ప్రయత్నముననో సంభవము కావచ్చును,

ఒక పద్యమైన ముక్తకము రెండును, మూఁడు
ద్వికమును త్రిక్తమునై విస్తరిల్లు
పంచరత్నము లైదు పరగ నెన్మిది గజా
వళికి నామావళి ద్వాదశంబు
ఎన్నంగ నిరువదియేడు తారావళి
యెనయ ముప్పదిరెండు నేఁబదియును
మూఁడు నూఱెనుమది నుతి కెక్కి ద్వాత్రింశ
దభిధాన పంచాద శాఖ్య నాగ
వెలయు శతకమున వెండి యష్టోత్తర
శతక మనగ నిట్లు సకల సుకవి

---

* కవుల దేశకాల గ్రంథ నిర్ణయముల పట్ల వంగూరి సుబ్బారావు, కాశీనాధుని నాగేశ్వరరావు, అనుముల సుబ్రహ్మణ్య శాస్త్రి, నిడదవోలు వేంకటరావు, ఆరుద్ర ప్రభృతుల వాదముల ననుసరించినాను,

సమ్మతముగ నెగడు చాటుప్రబంధము
లభిమతార్థ రచన నబ్జనాభ;

అని యిట్లు అనంతామాత్యుడు ఛందో గ్రంథములో చాటుప్రబంధ లక్షణమును పై పద్యమున వివరించినాడు, కాకునూరి అప్పకవి ఇంతకంటెను ఎక్కువ భేదములను తెలిపినాడు.

ఇన్ని పద్యములు చెప్పితిని, అన్ని పద్యములు చెప్పితిని, అని కవి అనుటకన్న అష్టకమునో శతకమునో చెప్పినా ననుట క్లుప్తీకరణ మగును. పట్టు మని పద్యకావ్యము రచించినపుడు పద్యముల సంఖ్యను పేర్కొన నవసరము కానరాదు. కొలది కొలదిగా రచించినపుడే సంఖ్యా ప్రసక్తి. అనిబద్ధ కావ్యముగా, అనగా ఖండకృతిగా రచించి పేరుపెట్టినచో చిక్కు లేదు. అట్లు కాక విడివిడిగా, అనగా క్రమబద్ధము కాకుండా పద్యములు చెప్పినపుడు సంఖ్యా నియతి కావలసి వచ్చును. ఎవరైనను తమ పద్యములు మాలికవలె గుది గూర్చినచో కంఠస్థము చేయుటకు వీలగును.

మన దేశమున శత శబ్దము ప్రీతిపాత్రము. గణిత శాస్త్రమున కూడ శత శబ్దమును సామాన్యముగా ఆధారముగా గైకొనుట పరిపాటి. వేదములో కూడ శతశబ్దము విశేషముగా అను అర్థమున కానవచ్చును. "అశ్వావంతం శతగ్వినమ్" ఇత్యాది పంక్తులు కానబడుచుండును. ఒకటి రెండు పద్యముల కన్న నూరుపద్యములు గుది గూర్చినచో కొంత సంతృప్తి. శతము అనుటకు బదులు శతకము అని వాడుకలోనికి వచ్చినది. ఇందలి కన్ ప్రత్యయము స్వార్థమున కావున అర్థభేదము లేదు.

అతి ప్రాచీన కాలము నుండియు ముక్తకములు మొదలగునవి వ్యాప్తిలో నున్నవి. కొన్ని స్వతంత్ర రూపము నొందియుండును. కొన్ని కొన్ని గ్రంథాంతర్గతము లగుచుండును. గీర్వాణ వాణిలో విడిగా దొరకు పద్య సందోహము సామాన్యముగా స్తోత్రరూప మైనది. ఉషస్సు, మరుత్తులు, అశ్వినీదేవతలు, రుద్రుడు, అగ్ని, ఇంద్రుడు ఇత్యాదుల స్తుతులు ఋగ్వేదమున కానవచ్చుచుండును. ఋగ్వేద బాష్కల సంహిత ప్రపంచమున లభించు గ్రంథము లన్నిటిలో మిగుల ప్రాచీనము. సంహితలలోనే గాక బ్రాహ్మణములలో, ఉషని

షత్తులలో కూడ కొలదిగా ఇట్టివి గోచరించును. పురాణములు పరిశీలించినచో స్తోత్ర రూపములైన చిన్న పద్యసందోహములు తరచుగా తగులుచుండును. కొన్ని తావుల ఉత్తమపురుషుల ప్రశస్తులు కూడ ఈ రూపముననే గోచరించును. ఆవల సంస్కృత వాఙ్మయమున అపార మైన స్తుతిసముచ్చయము స్ఫుటముగా గానవచ్చును. సంస్కృత కవులు కొలదిమంది మాత్రము శతక రూపమున పద్యములను సంతరించి పేరుకూడ పెట్టినారు. మయూరుని "సూర్య శతకము", బాణుని "చండీ శతకము", ఇత్యాదులు ప్రసిద్ధములు. అనేకులు స్తుతులు వివిధగతుల చేసినారు, కాశ్మీరక మాహేశ్వరుడగు జగద్ధర భట్టు రచించిన "స్తుతి కుసుమాంజలి" ఇట్టివానిలో మకుటాయమాన మని చెప్పవచ్చును. ఇందు రమారమి నలుబది స్తోత్రములు కలవు.

ఏకారణముననో సంస్కృత కవులు శతకములు హెచ్చుగా రచింపలేదు. జగద్విఖ్యాతుడగు భర్తృహరి "సుభాషిత త్రిశతి" అని మూడు వందల పద్యములు సంతరించినాడు – నీతి, శృంగార, వైరాగ్య శతకములను గోవర్ధనాచార్యుడు "ఆర్యా సప్తశతి" అను పేర ఏడువందల పద్యములు సమకూర్చుకొన్నాడు. ఈ సందోహమం దంతటను ఆర్యా వృత్తమే యుండుటచే దీనికి ఆర్యాసప్తశతి అని పేరు, శ్రీమద్వేదాంత దేశికాచార్యులు "పాదుకా సహస్రమ్" అను పేర పది శతముల పద్యములు రచించినారు.

పాదుక లన్నప్పుడు భరతుడు పూజించిన శ్రీరామ పాదుకలు అని తాత్పర్యము. కేవల రామావతారమే కాక నారాయణుని వివిధావతారముల విషయములు కూడ ఇందు పొందుపరుప బడినవి, దీనిలో విష్ణుభక్తి ప్రస్ఫుటము. మహా ప్రౌఢకవి వేంకటాధ్వరి "లక్ష్మీ సహస్ర" మను పేరు గల దశశతకముల మహాకావ్యము రచించినాడు. అందలి పద్యములను ఆయన దశకములుగా విభజింప లేదు. దానిలో స్తబకములు నియత సంఖ్యాకములు కావు. కటాక్ష, కారుణ్య, శృంగార ఇత్యాది స్తబకములు వందలకొలది పద్యములతో కూడియున్నవి.* ఈ శతాబ్దిలోనే వాశిష్ఠ గణపతి ముని "ఉమా సహస్రమ్" అను పేర వేయి పద్యముల గ్రంథము చేసినారు, ఇందు జగదంబను వివిధ విధముల నుతించినారు, దీనిలో వివిధ వృత్తము లుపయోగించినారు. సంస్కృతమున ఇట్లు శతకములు, త్రిశతులు, సప్తశతులు. సహస్రములు కలవు.

---

* లీలాశుకుని శ్రీకృష్ణకర్ణామృతము త్రిశతి.

3

ప్రాకృత భాషలో కొన్ని స్తవములు, దశకములు, శతకములు కూడ కలవు. జగద్విఖ్యాత మైన గాథా సప్తశతిలో ఏడు శతక గాథలు కలవు. ప్రాకృతమున సీసకమును ఆంధ్రములో సీసము అన్నారు. సేతుబంధ కావ్యములో ఉన్న ఆశ్వాసక శబ్దమును నన్నయ భట్టారకుడు ఆశ్వాసముగా స్వీకరించినాడు. నాటినుండి నేటివరకు ప్రాచీన మార్గావలంబు లగు ఆంధ్రకవులు నిజకావ్య భాగములకు ఆశ్వాసము లనియే పేర్కొనుచున్నారు. ప్రాకృతభాషా సారస్వతముల ప్రభావము ఆంధ్ర సారస్వతము మీదను, ఆంధ్రుల నామధేయముల మీదను ముద్ర వేసి యున్నది. కొందరి వాదన ప్రకారము ఆంధ్రభాష పైశాచీ ప్రాకృత జన్యము. చిన్నయ సూరి బాలవ్యాకరణమున ఆంధ్రమునకు సంస్కృతము ఆద్య ప్రకృతి యనియు, ప్రాకృతము ద్వితీయ ప్రకృతియనియు నిర్ణయించినాడు.

4

క్రీ. శ. 12 శతాబ్దికి ముందు ఆంధ్రములో శతకము లేదు. ఆ శతాబ్దిలో ఉన్నది వృషాధిప శతకమే. పండితారాధ్యుల శివతత్త్వసారము అను గ్రంథము శతకస్వభావము కలది తత్పూర్వమే కలదు. శివతత్త్వసారములోని శివా అను మకుటము కొన్ని తావుల మారుచు, కొన్నియెడల పాదమధ్యమునకు చనును. శతకరూపము సుస్పష్టముగా కలది, తొలి వృషాధిప శతకమే.

13 వ. శతాబ్ది మధ్యమున అన్నమయ్య రచించిన సర్వేశ్వరశతకము సుప్రసిద్ధము. వృషాధిప శతకము జానుదెనుగు నుపయోగించినది. కవిత్రయ ప్రయోగములకు భిన్నముగా వీనియందు భాషావిశేషము లున్నవి. ప్రాకృతములలో జైన వాఙ్మయ మందలి శతకాదులు శైవులవలన ఆంధ్రములోనికి వచ్చినట్లు స్ఫురించును. ఎన్నో జైనారామములను, ఆయతనములను శైవు లాక్రమించుకొన్నట్లు చరిత్రవలన తెలియవచ్చు చున్నది, ప్రాకృత వాఙ్మయవ్యాప్తి గాంచి శైవులు నిజమతవ్యాప్తికై జానుదెనుగు వాడి రనుటకు పాలకురికి సోమనాథుని ద్విపద సాహిత్యము తార్కాణము.

మొదటి రెండు శతకములు శైవమత ప్రతిపాదకములు. 13వ శతాబ్దిలో తిక్కన సోమయాజి కృష్ణశతకము రచించె నని ఒకానొక రన్నారు; కాని అది విశ్వసనీయము కాదు. కృష్ణశతకములోని పద్యము దేవకీనందన శతకములో నున్నది, దానిని వెన్నెలకంటి జన్నయ్య రచించి యుండును. ఈ దేవకీనందన శతకము అప్పకవి లక్ష్య శతకముగా ఆదరము బడసినది. అప్పటికే శతకము లెన్నో రచింపబడినట్లు తెలియవచ్చును.

"కొండల్‌వంటి కవీశ్వరుల్ శతకముల్ గూర్పంగ, గోటాన, గో
ట్లుండన్ నీవును జెప్పబూనితి వ దేమో యంటివా వింటివా
వండే నేర్పుల, బెక్కురీతుల రుచు ల్వ్యక్తింపవే శాకముల్
చండా వామన వాలకింపు మది, గృష్ణా దేవకీ నందనా!"

దీనినిబట్టి విద్వత్కవులు శతకములు రచించు చున్నట్లును అవి పండితాదరము కూడ పొందు చున్నట్లును గ్రహింప వచ్చును,

కాలక్రమమున విద్వాంసులు కానివారు కవితోద్రేకములో గాని, పట్టుమని కూర్చుండి కాని శతకములు రచించినట్లు చాల నిదర్శనములు కలవు, క్రమముగా విద్వల్లోకములో శతకముల మీద ఆదరము తగ్గిపోయినది. జనసామాన్యమే వానిని ప్రీతితో పఠించు చున్నట్లు తెలియ నగును. ఈ కాలమున కూడ కొలదిమంది విద్వత్కవులు శతకములు రచించు చున్నారు,

సామాన్యులు చాలమంది రకరకముల శతకములు వ్రాయుచున్నారు, ఆంధ్ర సాహిత్యమున శతకధోరణి ఆగిపోలేదు.

చింతపల్లి వీరరాఘవ కవి:

"జాములో శతకంబు సంధించి కంకణా
దులు గొంటి వలరాయ దుర్గమునను"

అన్నాడు. కొందరు శతకములు ఆశువుగా చెప్పినవారున్నారు.

వైష్ణవ భక్తులలో తాళ్ళపాకవారు ఎన్నో శతకములు చెప్పినారు. పదునేడవ శతాబ్ద్యనంతరము శతకరచన హెచ్చిపోయినది. వృత్తసాధనకై తొలుదొల్త ప్రతికవియు ఒక్కొక్క వృత్తములో శతకము రచించినాడు. మదిన సుభద్రయ్యమ్మ ఆరు శతకములు రచించినది. మండపాక పార్వతీశ్వర శాస్త్రి

శతకముల వంటి చిన్న గ్రంధములు రమారమి డెబ్బది రచించినాడు, సత్య వోలు భగవత్కవి.

"ధీరత శత శతకంబులు, దారావళులున్, దశావతారావళులున్
చారూదాహరణంబులు, శ్రీరాజిత దండకములు చెప్పినవాడన్"

అన్నాడు.

దీనినిబట్టి 17, 18, 19 శతాబ్దులలో బయలు వెడలిన శతకములు లెక్కకు మీరినవి. పద్యలక్షణమే లేని శతకములు, ముఖ్యముగా విచిత్ర వేదాంతము ప్రతిపాదించువారు ఇట్టివి విరివిగా వ్రాసినారట.

ఇప్పుడు లభించిన శతకములకన్న తాళపత్రములలో నుండి క్రమముగా లుప్తమై పోయిన శతకము లెన్నో యుండును. నేటి కచ్చుపడిన శతకములు వేయి యుండవచ్చును.

శతకములకు కొన్ని నియమము లున్నట్లు గోచరించును. శతకము శ్రీకారముతో ప్రారంభ మగును. ఇది ఆంధ్ర సంప్రదాయము గీర్వాణ వాణిలో స్తోత్రములు కాని, శతకములు కాని, మహా కావ్యములు గాని. శ్రీకారముతో ప్రారంభము కా నక్కరలేదు. శతకము ఒకేవృత్తములో సామాన్యముగా నుండును. మకుటమునుబట్టి ఉత్పలమాల గాని, చంపకమాల గాని పర్యాయముగా కవి వాడుచుండును. ఇట్లే మకుటవిశేషముచే శార్దూల మత్తేభములు ఒక శతకము లోనే వాడుచుండుట కలదు. సీసపద్య శతకమున ఎత్తుగీతి తేటగీతిగనో, ఆట వెలది గనో యుండును. ఇంకొకటి మకుటము: సాధారణముగా మకుటము పద్యాంతమున నుండుట పరిపాటి, ఒక్కొకప్పుడు అర్ధపాదము కాని, సంపూర్ణ పాదముకాని మకుటము కావచ్చును. కొన్నియెడల పూర్వపాదములోని అంత్యాక్షరము తరువాత మకుట చరణములోనికి అనుప్రవిష్టము కావచ్చును. సంబోధన దైవ పరముగనో, గురుపరముగనో, ప్రభుపరముగనో, మిత్ర పరముగనో, ఉండుట ఆచారము.

ఒక్కొకప్పుడు తన్ను దాను సంబోధించు కొనుట కూడ కలదు, "విశ్వ దాభిరామ, వినుర వేమ" అని వేమన శతకములో మకుటము. ఇందలి

వేమనకవికి అన్నయు, ప్రభువు అగు వేమన యని ఒకానొకరు పలికినారు. కాని సమస్తము త్యజించి అవధూత స్థితిలో నున్న వేమన అన్నగారిని సంబోధించుచు పద్యములు చెప్పె ననుట సుసంగతము కాదు. ఆతడు జ్ఞాని కావున తనలోని వేమనను సంబోధించి నట్లు భావించుట సముచితము.

6

విషయ విభాగములో ఆంధ్రశతకము పదునెనిమిది విధములుగా గాన వచ్చుచున్న దని వేంకటరావు గారు లిఖించినారు, ఈ విభజననుబట్టి ఎన్నో విషయములు శతకములలో నిబద్ధము లైన వని గ్రహింపవచ్చును, ధార్మిక, నైతిక, సామాజిక, సాంస్కృతిక. రాజకీయ, సారస్వత, లలితకళావిశేషములు ప్రతిపాదితము లగుచుండును.

విశేషముగా భక్తిప్రధాన మైన శతకములు జనాదరము పొందినవి. భక్తిలో శివభక్తి, విష్ణుభక్తి, దేవీభక్తి, గణపతి, ఆంజనేయ, రామకృష్ణాదుల స్తుతులు, వర్ణనలు కలవు. అవతారములలో కూర్మ, నరసింహ అవతారములు విరివిగా ప్రశస్తి కన్నవి. బ్రహ్మస్తుతి ఏశతకములోనూ కానవచ్చుట లేదు. త్రిమూర్తుల దేవేరుల నుతి పూర్వక మైనవి కలవు. పరాశక్తి పర మైన శతకములు కూడ కలవు. సూర్య, శనులను గూర్చిన శతకము లున్నవి.

ఈ సంపుటిలోని అయిదు శతకములలో నారాయణ, నరసింహ, ఆంధ్ర నాయక శతకములు విష్ణుభక్తి పరములు. కుక్కుటేశ్వరశతకము శివభక్తి యుక్తము. భాస్కరశతకము లౌకికవృత్తమును వర్ణించునది.

భక్తినిగూర్చి యోచింప దగును. భక్తి యన నేమి? "సా కస్మైచిత్ పరమా ప్రేమరూపా" అని నారద భక్తిసూత్రము. "సా పరా అనురక్తి రీశ్వరే" అని శాండిల్య భక్తిసూత్రము. ఎవరిపై నైనను శ్రేష్ఠ మగు ప్రేమ భావము ఉండుట భక్తి. ఇంతకన్నను భగవానునిపై అనంత మైనఅనురాగము కలిగి యుండుట శ్రేష్ఠభక్తి. రాగాత్మిక భక్తి, అహేతుక భక్తి, ముఖ్య భక్తి అని భక్తి మూడు విధములు. అభిలషిత మైన వస్తువుమీద హృదయము రసపరిపూర్ణమై గాఢవేగముతో నుండుటయే రాగము. "నదులు, సముద్రముపైపున

కరుగునట్లును, పుష్పములు సుగంధములను వెదజల్లునట్లును నీయెడ అనురాగము కలవాని హృదయము ఎల్లప్పుడు నిన్నే వాంఛించు చుండును" అని వంగ భాషలోని కీర్తన. ఎట్టి ప్రయత్నములు లేక తనంతట తాను భగవానునికై వ్యాకులత చెందు ప్రాణీది రాగాత్మిక భక్తి.

కోరిక లేవియు లేక ఏవియో కారణములను తలపెట్టక, భగవానుని కైంకర్యమే ప్రధానముగా వాంఛించు భక్తి అహేతుక భక్తి, రామప్రసాదుడు ఇట్లు పలికినాడు "భక్తి అన్నింటికి మూలము. ముక్తి భక్తికి దాసి."

"యది భవతి ముకుందే భక్తి రానందసాంద్రా
విలుఠతి చరణాబ్జే మోక్షసామ్రాజ్య లక్ష్మీః"

భక్తుడు ముక్తికొరకు తాపత్రయము చెందడు. ముక్తి భక్తునే ఆశ్రయించి యుండును. ఉత్తమ భక్తునకు మోక్షాపేక్ష కూడ నుండదు అని దాని భావము. భగవానుని వలన లాభము కలుగు పక్షమున కృతజ్ఞతాదులు చూపుట సహజము. అది సహేతుక భక్తి యగును. "ప్రేమించుటయే నాస్వభావము. నిన్నుతప్ప అన్య మెరుగను" అని ఒకానొక రన్నారు, ఈవాక్కులు అహేతుక భక్తికి మూలము లనవచ్చును. అహేతుక భక్తినే ముఖ్య భక్తి యని కొందరందురు. దీనికన్న శ్రేష్ఠతర మగు భక్తి లే దనిపించును,

భక్తిసూత్రముల ననుగ్రహించిన దేవర్షి నారదుడును, మహర్షి శాండిల్యుడును, అహేతుక భక్తికి లక్ష్యభూతులు.

అధికారిభేదము ననుసరించి భక్తిని రెండు విధముల విభాగింప వచ్చును. రాగాత్మిక భక్తి, అహేతుక భక్తి, ముఖ్య భక్తి, ఈ మూడును ప్రథమ శ్రేణిలోనివి. వైధీ భక్తి, సహేతుక భక్తి, గౌణ భక్తి ద్వితీయ శ్రేణిలోనివి. ఈ ద్వితీయ శ్రేణిలోనిభక్తి ఉత్తమము కాకపోయినను సాధన కుపయుక్తమై శ్రేష్ఠభక్తిని పొందుట కను వగును.

"వైధీ భక్త్యధికారీ తు భావా విర్భావనావధీ
తత్ర శాస్త్రం తదా తర్క మనుకూల మపేక్షతే"

అని భక్తిరసామృత సింధువు వక్కాణించుచున్నది. వైధీభక్తి శాస్త్రములమీదను అనుకూల తర్కములమీదను, ఆధారపడి యుండును. అందుచే భావోదయ

మగునంతవరకు ఆధారము భావోదయ మైనంతనే వైధీభక్తి నాశ్రయింప వల యును. భావోదయ మైనంతనే రాగ ముదయించును. రాగమువలన రాగాత్మిక భక్తి జనియించును. శాస్త్రాధ్యయనముల వలనను, భగవత్ స్వరూప స్వభావ ప్రతిపాదక విషయచర్చ వలనను భగవానుని యెడ భక్తి స్థిర మగును. భావో దయ మయి మధురవిషయములను విచారణ చేయునపుడు లోలుపత్వము జన్మిం చును. అందువలన ప్రాణాకర్షణము కలుగును. ఆకర్షణము కలిగినంతనే రాగా త్మిక భక్తి ఉద్భవించును. భగవన్నామామృతము నాస్వాదించునరుడు మహా భక్తు డగును.

సహేతుక భక్తి :- సామాన్యముగా మా న వు ల కు సత్కార్యములమీద దృష్టి యుండుట సహజము. కావున వారికి సత్సంతానము, సౌభాగ్యము, విద్య, ప్రాభవము ఇత్యాదులు వాంఛితములు, భగవదనుగ్రహము వలన వీనిలో ఒకటి గాని, కొన్ని గాని, లభ్య మైనపుడు జనులు సంతుష్టచిత్తులై భగవానుని వలన అయ్యవి లభ్య మైనట్లు భావింతురు. అందులకు హేతువు భగవాను డగుటచే భక్తితో అట్టివారు వర్తించుచుందురు. ఒక్కొకప్పుడు ఉన్నసౌభాగ్యము తొలగిపోవ కుండునట్లు ప్రార్థనలు సల్పుచుందురు. ఇది ఉత్తమ మైనది గాదు. అయినను కాలక్రమమున ఈ భక్తికూడ శ్రేష్ఠభక్తిగా పరిణమించును.

ఒకానొక భక్తునకు జగన్మాత ప్రత్యక్షమై నీ కేమి వరము కావలె నని యడిగెను. ఆతడు—

"మాతః కిం వర మపరం యాచే
సర్వం సంపాదిత మితి సత్యమ్
యత్ త్వచ్చరణాంబుజ మతి గుహ్యం
దృష్టం విధి హర మురజుష్టమ్."

అని ప్రత్యుత్తర మిచ్చినాడు. "అమ్మా! నేనేవరము కోరుదును? బ్రహ్మ, విష్ణు. మహేశ్వరులు పూజించు నీపాదములు దర్శించిన పిదప అన్నియు నాకు లభ్యములే" అని తాత్పర్యము.

సహేతుక భక్తితో ప్రారంభ మైనహృదయము భగవద్విషయానుసంధా నము వలన క్రమముగా ఆనందమును, చవి చూచి అన్యపదార్థములపై ఆసక్తి విడుచును. తుదకు భగవానునియెడ పరినిష్ఠితబుద్ధి యేర్పడును.

గుణభేదముల విధములవలన గౌణభక్తి మూడువిధములు. సాత్త్విక, రాజస, తామసములు గుణభేదము వలన నేర్పడినవి. ఆర్తాదిభేదమువలన ఆర్తభక్తి, జిజ్ఞాసుభక్తి, అర్థార్థిభక్తి అని మరల మూడువిధములు.

చోరులు, దుర్మార్గులు, మొదలగువారు తమకృత్యములలో విజయము కొరకు భగవత్ప్రార్థన, పూజాదికము చేయుచుండుట పరిపాటి. అందు భక్తి యిమిడి యున్నను అధమ మగుటచే ఉపాదేయము కాదు.

రాజసభక్తిలో భోగాభిలాషవలన తనకు కావలయు నని కోరుకొనుటయే కాక, తనకు విరుద్ధులైన వారికి లాభము రాగూడ దనుప్రార్థన రాజసముతో కూడినది; కావున ఉత్తమము కాదు.

సాత్త్విక భక్తిలో భోగముల మీద అభిలాష లేకున్నను మోక్షాపేక్షతో భగవత్ప్రార్థన చేయుచుండుట సంభవించును. ఇందు కూడ ఇచ్ఛ ప్రస్ఫుట మగును. క్రమముగా ఈస్థితి ముఖ్యభక్తిగా పరిణమించును. ముఖ్యభక్తిలో ముక్తివాంఛ కూడ నుండదు. తుదకు ఉత్తమ భక్తుడు మోక్షము కూడ అపేక్షింపడు.

ఆర్తభక్తి అందరికిని విదితమే, కష్టము కలిగినప్పుడు భగవత్ప్రార్థన చేయుట స్వభావసిద్ధము. ఇది కొంత మెరుగు.

ఇక జిజ్ఞాసుభక్తి అనునది భగవానునియెడ భక్తి లేకున్ననూ, భగవత్తత్త్వమును పరిశీలించుటకై కలుగుభక్తి జిజ్ఞాసుభక్తి. జిజ్ఞాస అన్నప్పుడు జ్ఞాతుం ఇచ్ఛా జిజ్ఞాసా, అందు తెలిసికొనుటయే ప్రధానము. కాని ఆచరణము వరకును బుద్ధి పోవడు. మిగిలినది అర్థార్థిభక్తి ఈభక్తి యెంతమాత్రము విచారణలో యుక్తము కాదనిపించును. వివేచనలో భక్తియందలి ఈభేదములను గ్రహింపవచ్చును.

ఈసముచ్చయములోని శతకములలో భక్తి యేవిధముగా ప్రతిపాదితమైనదో పరిశీలించుట అప్రస్తుతము కాదు.

7

లక్ష్యప్రాయముగా భక్తిని బహుభంగుల వివరించు తీరు వేరు. దాని ననుభవ పూర్వకముగా ప్రత్యేక సన్నివేశములలో వర్ణించుట వేరు. నారాయణ

శతకమున భక్తి వివరణములో కొంత ప్రౌఢిమ కానవచ్చుచున్నది. నిర్గుణ మగు పరతత్త్వమును ఉపాసనాక్రమములో ఊహనము చేసి నారాయణుడు గనో, శివుడు గనో, వర్ణింపక తప్పదు. ఈశతకమున కవి నారాయణ పారమ్యమును ప్రతిపాదింప దలచినవా డగుటచే వైష్ణవు డయినను, కాకపోయినను, విష్ణు భక్తుడు మాత్ర మగును. కొన్నికొన్ని ఉపపత్తులు స్థూలముగా కానవచ్చుచున్నను ఈకవి పోతనామాత్యుడు కా డనిపించును. అవతార దశకము, దివ్యరూపదశ కము, వర్ణనములో వన్నె కెక్కినవి. భగవన్నామము జపించుటకు చేత గాని, సమర్థించుట చేత గాని మానవుడు ప్రభాన్వితు డగుచున్నాడు. నామసంకీర్తనము నలుగురు నంగీకరించినది. ఇందరి నామ ప్రభావదశకములో తత్ప్రభావ మెట్టిదో ఎవ్వ రెవ్వరిని తరింపజేసిరో అరయ వచ్చును. కృష్ణావతారవింశతి మిక్కిలి లలిత మైనది. కృష్ణునిలీలలు, క్రీడలు, గోపికల వలపులు, వ్రేపల్లెలోని కదుపులు మొదలగునవి కన్నులకు కట్టిన ట్లున్నవి. నిత్యగోచరము లగు సామాన్య విషయములలో నిత్యనూతనత్వము, నిభృత నిత్యత్వము నిపుణముగా నిరూపింపబడినవి.

జ్ఞానవింశతి సామాన్య కర్మాదులను నిరసించి జ్ఞానస్వరూపమును స్వల్పముగా నిరూపించి భక్తి విమలీకృత మై జ్ఞానముగా పరిణతి చెందు నని ప్రస్ఫుటము చేసినది.

సుత దారాప్తజనాది విత్తములపై
శూన్యాభిలాషుండు నై
యతనోద్రేకయుతంబు లై పొదలు న
య్యై యింద్రియ వ్రాతమున్
మృతిఁ బొందించి దమంబునన్ శమమునన్
మీఱంగ వ రించు ని
ర్గత సంసారి భవత్కృపం బొరయు నో
కంజాక్ష నారాయణా !

ఎన్ని చెప్పినను తుదకు మోక్షము వాంఛించని భక్తు డుండడు. నారాయణ శతకములో మోక్షవింశతి మకుటాయ మాన మైనది. తుదిపద్యములో కవి సుజ్ఞానమును మోక్షమును సూచించి తన గ్రంథమును నారాయణ పదాబ్జముల కడ సమర్పించితి ననినాడు. దీనినిబట్టి కవికి యశస్సుమీద దృష్టి లే

దనియు, చేసిన సత్కృతి భగవత్పాదారవింద సన్నిధానములో సమర్పించుటయే సముచిత మనియు, అట్టిదియే సత్కృతి యగు ననియు చెప్పకయే చెప్పినాడు.

తుదిపద్య తాత్పర్యము తలపోసినపుడు "తత్. సత్ బ్రహ్మార్పణ మస్తు" అను వాక్కులు జ్ఞప్తికి వచ్చి కవిబుద్ధి మోక్షమునే ఈక్షించిన దని గోచరించును.

* * *

కుక్కుటేశ్వర శతకకర్త శివభక్తుడు, విద్వాంసుడు. గ్రంథము సంపూర్ణముగా లభింపక పోవుటచే తుదివాక్కు లెట్టివో తోచుట లేదు. అయినను ఈకవి శివపారమ్యము భావించినట్లు స్పష్టము, భక్తితత్త్వమును నిరూపించుట కన్న శివభక్తులైనవార లెట్లు ప్రవర్తించిరో, శివానుగ్రహమువలన వారి కెట్టి సత్ఫలములు సంక్రమించినవో చక్కగా వర్ణించినాడు. కొన్నికొన్ని సమయములలో మూర్ఖులను, దుర్మార్గులను, వంచకులను అన్యాయవర్తనులను, కవి ఖండించినాడు. కొన్ని సందర్భములలో గ్రామములలోని మోటుమానసుల మాటలనే యథాతథముగా పద్యములలో అనుప్రవిష్టము చేసినాడు. అన్వయ వ్యతిరేకముల ద్వారమున భక్తిని ప్రబోధించినాడు. ఈ శతకములోని వాతావరణము భక్తిభరితము కాక లోకమందలి లోపములను విలోకించుటతోడనే తృప్తి గన్నట్టు తోచును. ఇది వ్యతిరేకమార్గము. ఈయది కూడ కొంతవర కవసరమే ఇది కాదు, ఇది కాదు, ఇది కూడదు, ఇది కూడదు, ఇది గమ్యము, ఇది గమ్యము అని తెల్పిన ట్లగును. నిందకన్న నిస్తులస్తుతియే మదికి హత్తుకొనును. తిమ్మకవి ధైర్యస్థైర్యములు కలవానివలె కానబడును. తమ ప్రాభవమును తలపోసి మురిసిపోవు మూర్ఖ ప్రభువులను ముఖ్యముగా దూయబట్టినాడు.

మరుమరీచికలు తామరస పత్రాంతర
సలిలబిందువులు చంచలలు హ సి
కర్ణాంతములు దీపకళికాశిఖలు బుద్బు
దములు మంగలిచేతి దర్పణములు
మిణుగురుబురువుల మెఱుపు లభ్రచ్ఛాయ
లైంద్రజాలికునాట లంబురాసి
వీచులు చలదశవృక్షి పలాశముల్
తృణహుతాశనముల తెఱగు లిట్టి

సిరులు నిలకడు లని నమ్మి చెనఁటులురక
చెడుదు రెన్నడు ధర్మంబు సేయలేక
భూనుతవిలాస ! ఫీఠికాపురనివాస !
కుముదహితకోటిసంకాశ ! కుక్కుటేశ !

బాహ్యవిషయములు పనికి రా వనియు. ఆంతరంగిక శుద్ధి అతి ముఖ్యమైన దనియు, ఈ శ్వర ప్ర ణీ ధా న ము ప్రధాన మనియు, తద్భక్తి వలననే మోక్షము చేకూరు ననియు తిమ్మకవి నమ్మినట్లు స్పష్టము.

* * *

నరసింహ శతక కవి వినయ సంపద విశేషముగా కలవాడు. జీవితములో దైన్యమును బాగుగా గమనించినవాడు. జీవికి దైన్యము సహజసిద్ధమే కదా ! తాను అవిద్వాంసుడ ననియు, కేవలము భగవత్కటాక్షము చేతనే పద్యములు చెప్పగలిగితి ననియు ఒప్పుకొన్నాడు. ఈతడు అధికముగా ఆ ర్తభ క్తిని నిరూపించినాడు.

భగవన్నామము సమ స్త భనరోగములకును ఔషధ మనియు భగవదనుగ్రహమే ప్రాణికి ప్రధాన మనియు, భగవత్సేవాదికము వలన మోక్షప్రా ప్తి యనియు, విస్పష్టముగా వివరించినాడు.

ఈతడు సద్గుణసంపన్ను డగుటచే అచ్చటచ్చట ఆ త్మ గ ర్హ ణ ము కావించుకొన్నాడు. అరిషడ్వర్గములోని మదమా త్సర్యాదులు మడియుటకై ఆత్మ నింద కూడ తోడు పడును. తాను సమ స్తలోపములతో కూడిన వాడనియు, అన్యులే అధికులనియు భావించు వానిని దేవిరింపువా డనరాదు, నిజముగా మనోరుజలను తొలగ ద్రోసి, అమలిన భక్తితో ఆత్మశోధనము కావించుకొన్నవా డని గ్రహించవలయును.

ఈకవి నిజశతకములో భగవానుని వ్యాజనింద చేసినాఁడు. వ్యాజనింద అన్ని దేశములవార లంగీకరింపక పోవచ్చును. కాని భరతభూమిలో భగవానుని ప్రణయముతో గాని, వై రముతో కాని, సేవించినచో సత్ఫల మొదవు నని భూరి విధముల పురాణాదు లుద్ఘాటన చేసినవి.

నరసింహ శతకము ఇంత జనరంజక మగుటకు కారణములు కలవు. ఈతడు సామాన్యజను డగుటచే జనసామాన్యమునకు గల కష్ట నిష్ఠురములను

గ్రహించినవాడు. వినయమువలన వివేకి యగుటచే అవూర్వ విషయముల నందుకొనక, సామాన్య భావములనే సరసముగా, హృదయంగమముగా, నొదుగునట్లు మనోజ్ఞ సీసపద్యములు చెప్పినాడు. శతకఫలశ్రుతిలో—

ఇద్ది పుణ్యాకరం బని యెపుడు జనులు
కష్ట మనక పఠించిన గలుగు ముక్తి -

అన్నాడు దీనినిబట్టి ఎట్టి భక్తున కైనను మోక్షమే ముఖ్య మని స్పష్టము.

* * *

ఆంధ్రనాయక శతక ధోరణి కొంత వింతగా నుండును. ఏతత్కర్త పురుషోత్తమ కవి రాజసముతో కూడినవాడు. భట్రాజగుటచే లోకమున త్రోసి కొనుపోవు గుణము కలవాడు, వైష్ణవగురువుకడ విద్యాభ్యాసము చేసి, కొంత విద్వత్తు సంపాదించినవాడు. వీనికి తోడు జమీందారు నండ కూడ మెండుగా కలిగినట్లు తోచును, ఇట్టిగుణములు కలవాడు భక్తు డైనను రజోగుణముపాలు హెచ్చుగా నుండును, పైన కొంతయపజ్ఞ కూడ నుండుటచే ఈతడు నూతన మార మవలంబించినాడు, ఈయది కేవలము నూతనమార మనుటకు కూడ వీలు లేదు. ఇతఃపూర్వము శతకకవులు ఎడనెడ నీపద్ధతి ఇంతో అంతో ప్రదర్శించినారు, ఈతడు ఆదినుండి తుదివరకును, భగవత్పరముగా పలుకునపుడు కూడ వ్యాజ నిందపై మోజు చూపినాడు. అచ్చటచ్చట ఇట్టి చమత్కారములు ఆనందదాయక మగు నేమో; కాని శతకమున నఖశిఖపర్యంతము వ్యాజనింద నవలంబించుట అందమా ? కొందరు ఈవిధానమును ప్రౌఢిమగా భావించి కాసుల పురుషోత్తముని ఆంధ్ర నాయక శతకమును ఆంధ్రసరస్వతి కంఠము లోని కాసులపేరుగా భావించుచున్నారు. దీనియందు సమత యను కావ్యదోషము కలదు.

ఏ మైనను ఐదో విధముగా భగవన్మహిమానువర్ణనము, భగవన్నుతియు నుండుటచే శతక ముపాదేయమే అనవచ్చును. ఈతడు భగవానుని మహిమలు గురుతించినవా డైనను, వ్యాజనిందలో మానవునివలెను కాక మానవునకు సమీపవర్తి వలెను వర్ణించినాడు,

శతకములోని ఇరువది ఎనిమిదవ పద్యమునను, 30 వ పద్యమునను నింకొంచెము హద్దు మీరినది,

42 వ పద్యమున—

ఇట్ట నీసంప్రదాయంబుగుట్టు బెట్టు
రట్టు సేయుదు, గనుము నాభట్టుతనము !

తామసత్వము ఈదబాయింపులో గుబాళించుచున్నది. నలుబదియారవ పద్యమున శృంగారము మితి మీరినది. భక్తి చూపు పట్టులం దిట్టి విధానము సముచితమా ? ఎ ట్లైనను ఈతడు దాస్యభక్తిని వివిధవిధముల వివరించినాడు.

గుహుడు పాదములు గట్టుట కుబ్బు నెనరును
నుడుత దాస్యమునకు, బొడము ప్రేమ
శతక మంగీకరింపుము జగతి జనకు,
డర్భకావ్యక్త భాషల నలరినట్లు

ఈవిధమున భగవన్నుతి చేసినవానిని స్వీకరింప వచ్చును.

కొందరు కవులు సాత్త్వికులు; కొందరు రజోగుణ ప్రధానులు. చిత్త వృత్తులను బట్టి కొందరు ఆక్షేపించుచున్నట్లు కానబడుదురు. ఒకానొక సంస్కృతకవి నీలాచలములోని జగన్నాథాలయమునకు వెడలి, స్వామిని సందర్శించి స్తుతించిననూ విగ్రహములోనుండి వాక్కు వెలువడలేదట. మానధనుడును, మహానైయాయికుడును అగుకవి ఉద్రిక్తుడై భగవానుద్దేశించి—

"ఐశ్వర్యమద మత్తోసి మా మవజ్ఞాయసే పునః
ఉపస్థితేషు బౌద్ధేషు మదధీనా గతి స్తవ :

అన్నట్లు ఐతిహ్యము. ఐశ్వర్యమద మత్తోసి అన్నప్పుడు భగవానుడు షడ్గుణైశ్వర్యసంపన్నుడని భావము. ఉపస్థితేషు బౌద్ధేషు అన్నప్పుడు బౌద్ధులు నిరీశ్వరవాదు లగుటచే భగవంతుడు లేడందురు. కావున నీయస్తిత్వమును తర్కశాస్త్ర ప్రకారముగా నిర్ధారణ చేయుటకు నేనే రావలసి యుండును. నీగతి నాచేతనున్నది. అనగా నీవు కలవని నిరూపించుటకు నైయాయికుడనైన నేనే కావలసి యుండును అను చమత్కారమును కవి వ్యాజనిందా రూపమున నిబద్ధము చేసినాడు.

అలం కిల లలజ్జిరే సపది చిత్రగుప్తాదయః.
స ఏష పురుషాగ్రణీ మవతు దేవ, దక్షోసి చేత్; అని నిందాగర్భముగానున్న ఈస్తుతిలో ఎంతో వినయ మణిగి యున్నది. మానవుల పాపకార్యముల

లెక్కలు వ్రాయుచుండు చిత్రగుప్తులు నాపాపముల పట్టికను గట్టిగా లిఖింప జాలక సిగ్గుపడినారు. నేను అంతటి మొనగాడను. దక్షుడ వగుచో వీడీ, నన్ను రక్షింపుము ! అని తాత్పర్యము. ఇందు తా నెన్నోపాపములు చేసినట్లును, పాపులలో అగ్రగణ్యు డైనట్లును, సర్వశక్తిమంతుడ వగు నీవే రక్షింప దక్షుడ వైనట్లును స్వారస్యము కలదు. వ్యాజనిందలో ఈవాక్కు లగ్రస్థానము నందు కొన్నవి. మానవు డెంతయోగ్యుడ నని తా ననుకొన్నను తప్పు చేయకుండ నుండడు. కావుననే పరమ కారుణీకు లైన భక్త శ్రేష్ఠులు ఈ సూక్తి ననుగ్ర హించినారు.

పాపో హం పాపకర్మా హం పాపాత్మా పాపసంభవః
త్రాహి మాం కృపయా దేవ, శరణాగత వత్సల !

ఇట్టి స్థితి స్వాంతమునకు సమకూరినపుడు శరణాగతి సహజసిద్ధ మగును. అప్పుడు భక్తు డెట్లు పలికినను భగవానుడు సవ్యముగనే స్వీకరించి వానిని సంరక్షించును. పతితపావను డగు జగన్నాథునకన్న పరిత్రాణమున సమర్థు లిం కెవరు కలరు !

8

భాస్కర శతక విషయమై విశేషించి చెప్పవలసినది లేదు. గ్రంథ మంతటను దృష్టాంతములు. నిదర్శనలు గోచరించును. లోకవృత్తము నందలి లోపముల నెత్తి చూపుటయే ఈకవి ప్రధానోద్దేశ్యము. జనసామాన్యమునకు బహుశః విద్యార్థిలోకమునకు ఈకవి నిజశతకము నుద్దేశించె ననిపించును. అందలి సత్యములు ఆ కాలమునకే కాక ఈకాలమునకు గూడ బాగుగా వర్తించును. ఇట్టిలోపములు సవరించుకొని చిత్తశుద్ధి పొంది హృదయము భగవత్పరము కావలె నను సూచన భాస్కర శతకమున రేఖామాత్రముగా సాగుచుండును. భాస్కరా యని కవి త్రిమూర్త్యాత్మకు డగు సూర్యభగవానుని సంబోధించు చుండుటచే శతకము కొలదిగా భక్తిప్రతిపాదక మనవచ్చును. కవులు సామాన్యముగా భక్తులు. అందుచే తమ యిష్టదైవతమును ఆరాధించుచు కొన్ని యెడల స్పష్టముగా నుగ్గడింతురు. ఇష్టసిద్ధికై ఇష్టదేవతారాధనము దూష్యము కాదు. క్రమముగా ఇష్టదేవత బ్రహ్మాండవ్యాపియై విరాట్ స్వరూపము ధరించును,

9

శతక వాఙ్మయము విశేషముగా జనసామాన్యాదరము చెందుచున్నది. విద్వల్లోకము దీనిని సంపూర్ణముగా సమ్మతించి సమాదరించుచున్నట్లు తోపదు. శతకములలో సామాన్యముగా లోకములోని వాడుకమాటలు తరుచుగా తగులు చుండును. కవిత్రయమువారి ప్రయోగములకంటెను, ప్రౌఢు లైనకవుల ప్రయోగముల కంటెను, కొంత విరుద్ధముగా గోచరించు పదజాలము వీనియందు ప్రయుక్తమైనది.

వ్యాకరణ విరుద్ధముగా తోచు ప్రకియలు వీనియందు విరివి. అన్నిటికన్న గీర్వాణభాషలో నున్న భగవన్నుతులకు, స్తుతులకు, స్తోత్రములకు ఆంధ్ర వాణిలో నున్న ఈ శతకములు సరిరావు. కొన్నిటిలో ఏకవాక్యత లభింపదు. మొత్తమున సర్వాంగీణస్ఫూర్తి స్పష్టముగా కానరాకుండుట గమనింప దగినది. ఈకారణములచే విద్వాంసులు శతకములను సమాదరింప రేమో అనిపించును.

కవిత్రయ ప్రయోగములనే వాడవలె ననుట కేవల సంకుచిత దృష్టిని చూపును. వ్యాకరణ విరుద్ధపదములు, అన్వయములు మొద లగునవి యున్న వనుట కూడ యుక్తముకాదు. సందర్భమును బట్టి కవి సజీవ పదము లను సంతరించు కొను చుండును. ఆశబ్దములు పూర్వకవిప్రయుక్తములు కాక పోవచ్చును. వ్యాకరణము కూడ మారుచుండు ననుమాట నేటికాలమువారు బాగుగా గమనింపవలెను, ఆంధ్రములో విద్వత్కవీశ్వరు లగువారే అపాణినీయ ప్రయోగము లెన్నో చేసియున్నారు. న్యాయతః వ్యాకరణ శాస్త్రము కేవలము కాల్పనికము. కావున మారుచున్న మాటల రూపములను, అన్యవిధముల పరి ణామము గాంచుచున్న అన్వయములను గ్రహించి వ్యాకరణ శాస్త్రమున కూడ మార్పులు చేర్పవలెను. ఇంతకును కావ్యము సరస మైనచో రసపక్షపాతముచే అంగీకరింప వచ్చును.

కొందరు విద్వాంసు లగువారే వేకువన లేచి ఆంధ్రశతకములను ఆహ్లాద ముతో పఠించువా రున్నా రని వినికిడి. పఠించు చున్న కొలదిని శతకములు చిత్తశాంతి నొసగి హృదయాహ్లాదము నుత్పాదించు ననుటలో సందియము లేదు.

10

పూర్వము నాకు శతకములయెడ ప్రీతి తక్కువ. పరిష్కృతమై, ప్రౌఢమై, పరమ రమణీయ మగు గీర్వాణవాణిలోని స్తోత్రములు ఆనాడు నాకు నుతి పాత్రములు. కాలక్రమమున ఆంధ్రభాషా శతకములను పఠించుచుండ ఆదరాభిమానములు నెలకొన్నవి.

మన శతకములలో చాల వైవిధ్యము కలదు. అభిరుచినిబట్టి, మనఃస్థాయిని బట్టి ఆయాశతకమును పఠించుచో ప్రమోదము కలుగును. మానసికస్థితిని బట్టి శతకమును ఆద్యంతములు ఏకధాటిలో నేకరువు పెట్టవచ్చును. కాదా అక్కడక్కడి పద్యరత్నములను పఠించి పరితుష్టి నొందవచ్చును.

మా ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమీ అధ్యక్షులు, కార్య నిర్వాహక వర్గమువారు. ఆమోదించుట చేతనూ, విశేషించి ఆప్తులు శ్రీ దేవులపల్లి రామానుజరావుగారు ప్రోత్సహించుట చేతనూ ఈ ద్వితీయ శతక సంపుటిని ఈవిధముగా సంతరించి నిర్వహింప గలిగినాను.

ఇతి శివమ్ !

ఆంధ్ర ప్రదేశ సాహిత్య అకాడమీ.
"కలాభవనము": హైదరాబాద్-4

స్వామీ శివ శంకర స్వామీ

నారాయణ శతకము

నారాయణ శతకమును బమ్మెర పోతన రచించె నని ప్రతీతి. చిన్న తనమున గురుని అనురోధమున వీరభద్రవిజయ కావ్యమును రచించె నట. ఆవల సింగమ నాయని పేర భోగినీదండకము రచించినా డట. తుదకు భాగవతము నాంధ్రీకరించి జగత్ప్రసిద్ధు డయ్యెను. నారాయణ శతకము దండక రచనానంతరము చెప్పె నని కొందరి యభిప్రాయము.

సింగమనాయడు వెంకటగిరి సంస్థానాధిపతి యని కొందరు భ్రమపడినారు. భోగినీదండకము నాయనిపేర చెప్పుటచే పోతన వెంకటగిరికి కొంతసమీపములో నున్న ఒంటిమెట్ట వా డైయుండు నని పురాణం హయగ్రీవ శాస్త్రి భాగవత ప్రథమముద్రణమున పీఠికలో వ్రాసినాడు. ఒంటిమెట్ట కడప మండలములోని దనియు, అచ్చట కోదండరామస్వామి దేవాలయ ముండుటచేతను ఏకశిల అను నది ఒంటిమెట్టకు సంస్కృతీకరణ మనియు ఆయన భావించియుండును. ఆవల కవులచరిత్ర రచించినవారు ఒంటిమెట్ట ఓరుగల్లు అని నమ్మినట్లు లేదు. అనం తరము కొందరు విద్వాంసులును, ఆంధ్రసాహిత్య పరిషత్తు వారును విచారణ చేసి, ఓరుగల్లుప్రాంతములలో బమ్మెర గ్రామ మున్న దనియు, అచ్చట పోతన వంశీయులు కల రనియు, ఏకశిలానగరము ఒంటిమెట్టకు పర్యాయపదము కా దనియు తేల్చిరి. నెల్లుట్లవారు పోతనవంశములోని వార మనియు ఆయన ఓరు గల్లు మండలములోని బమ్మెరవా డనియు తెలిపిరి.

వావిలికొలను సుబ్బదాసు కడపమండలమువా డగుటచే, పోతన తన్మండ లములోనివా డని వాదించెను. బహుకాలము వాదప్రతివాదములు జరిగినవి. ఎన్నో గ్రంథములు పెరిగినవి. పెద్దిభొట్ల వీరయ్య అన్నిటిని క్రోడీకరించి గ్రంథము ప్రకటించినాడు. కొలది సంవత్సరముల కిందట అనుముల సుబ్రహ్మ ణ్యశాస్త్రి అను పండితుడు అన్ని విషయములు సమీక్షించి, గ్రంథము రచించి నాడు. జనగాం పురమునకు రమారమి 20 మైళ్ల దూరములో నున్న బమ్మెర వాడు పోతన యని సహేతుకముగా ఆయన నిర్ధారణ చేసినాడు.

వీరభద్రవిజయ, భోగినీదండక, నారాయణశతకములు పోతనామాత్య విరచితములు కా వనువా రున్నారు.

పోతన శైవకుటుంబమున పుట్టి బాల్యమున శైవగురువుకడ దీక్ష పొందిన వాడు. ఈతడు నియోగిబ్రాహ్మణుడు. కౌండిన్య సగోత్రుడు. లక్కమాంబ, కేసన్నల పుత్రుడు. ఈతడు క్రీ. శ. 15, 16 శతాబ్దులలో వర్ధిల్లె నని చెప్ప వచ్చును. (1450_1525 ప్రాంతాలవాడు).

చిన్నతనమున పోతన సోమనాథుని వృషాధిప శతకమును, అన్నమయ్య చెప్పిన సర్వేశ్వరశతకమును చదివినట్లు స్పష్టము. వీరభద్రవిజయ రచనానంతరము స్మార్తగురువుల కడ అద్వైతము గ్రహించి శివ. కేశవభేదము విడిచినాడు. భాగవతమున - 'చేతు లారంగ శివుని పూజింపడేని, నోరు నొవ్వంగ హరికీర్తి నుడువడేని' అని వ్రాసినాడు.

నారాయణ శతకమును వెల్లంకి తాతంభట్లు, కస్తూరి రంగకవియు పేర్కొన్నారు. కావున ఇది ప్రాచీన శతక మనవచ్చును. ఈశతకములోని _

ధర సింహాసన మై నభంబు గొడు గై తద్దేవతల్ భృత్యు లై
పరమామ్నాయము లెల్ల వందిగణ మై బ్రహ్మాండ మాగార మై
సిరి భార్యామణి యై విరించి కొడు కై శ్రీగంగ సత్పుత్రి యై
వరుస న్నీఘనరాజసంబు నిజ మై వర్ధిల్లు నారాయణా !

ఈపద్యము భాషలో, భావములో, రీతిలో భాగవతమును తలపించు చున్నది! ఈగ్రంథద్వయమునకు సామ్యమును చూపుటకు కొన్నిపద్యము లుదాహరింపబడుచున్నవి.

భూతవ్రాతము నంబుజాసనుడ వై పుట్టింతు విష్ణుండ వై...నారాయణా!

ఇరు వొందన్ ద్రుహిణాత్మకుం డయి రమాధీశుండు విశ్వంబు సు
స్థిరతన్ నిల్పి కృపాకటాక్షమున రక్షించున్ సమస్తప్రజో
త్కర సంహారము సేయునప్పుడు హరాంతర్యామి యై యింతయున్
హరియించుం బవనుండు మేఘముల మాయం జేయుచందంబునన్.

భాగ. ద్వితీయ స్కంధ.

పటు గర్భాంతరగోళభాగమున నీబ్రహ్మాండభాండంబు...నారాయణా !

మును కల్పాంతమునందు గుక్షి నఖిలంబున్ దాచి యేకాకి వై
జనలోకోపరిలోకవాసులును యుష్మత్తత్త్వమార్గంబు చిం

తనముం జేయు బయోధియందు నహిరా ట్తల్పంబునం బవ్వళిం
చిన నీరూపము నేడు సూపితివి లక్ష్మీనాథ, దేవో త్తమా !

భాగ. చతుర్థ.

దళదిందీవర నీలనీరద సముద్యద్భాసితాకార...నారాయణా !

త్రిజగన్మోహనశీలకాంతి తను వుద్దీపింప బ్రాభాతనీ
రజబంధుప్రభ మైన చేలము పయిన్ రంజిల్ల నీలాలక
వ్రజసంయు క్త ముఖారవింద మతిసేవ్యం బై విజృంభింప మా
విజయుం జేరెడు వన్నెకాడు మది నావేశించు నెల్లప్పుడున్ !

భాగ. ప్రథమ.

పరమం బై పరత త్త్వ మై సకలసంపత్సార మై భవ్య మై...

నారాయణా !

అధికాఘౌఘ తమోదివాకరము నై యద్రీంద్రజా జిహ్వాకున్...

నారాయణా !

పరు డై యీశ్వరు డై మహామహిము డై, ప్రాదుర్భవస్థాన సం
హరణక్రీడను డై త్రిశక్తియుతు డై యంతర్గతజ్యోతి యై
పరమేష్ఠి ప్రము ఖామరాధిపులకుం బ్రాపింపరా కుండు దు
స్తర మార్గంబున దేజరిల్లు హరికిం దత్వార్థి నై మ్రొక్కెదన్.

భాగ. ద్వితీయ.

వరదుగ్ధాబ్ధి తరంగ డోలికలలో వైకుంఠ లోకంబులో...నారాయణా !

అల వైకుంఠపురంబులో నగరిలో నామూలసౌధంబుదా
పల మందార వనాంతరామృతసరఃప్రాంతేందుకాంతోపలో
త్పల పర్యంక రమావినోది యగు నాపన్నప్రసన్నుండు వి
హ్వల నాగేంద్రము పాహి పాహి యన గు య్యాలించి సంరంభి యై.

భాగ. అష్టమ.

నిను వర్ణింపనివాడు మూగ మదిలో నీసత్కథాలాపముల్...నారాయణా!

నిను వర్ణింపనిజిహ్వ దా(బదటికా ? నీలాభ్రదేహాంగకా...నారాయణా!

హరి భజియించు హస్తములు హస్తము లచ్యుతు, గోరి మ్రొక్కు త
చ్చిరము శిరంబు చక్రధరు, జేసినచిత్తము చిత్త మిందిరా
వరు, గనుదృష్టి దృష్టి మురవైరి నుతించినవాణి వాణి య
క్షిరుకథ లానుకర్ణములు కర్ణము లై విలసిల్లు బో భువిన్.

భాగ. దశమ. 965.

రాణించెం గడు నంచు నీసహచరుల్ రాగిల్లి సోలంగ...నారాయణా!

నవమాధుర్యము కల్గు కృష్ణమురళీ నాదామృతస్యందముల్
సెవులం జొచ్చి హృదంతరాళముల భాసిల్లన్ సవత్సంబు లై
యువిదా! మేపులకుం దొఱంగి మృగగోయూథంబు నుత్కంఠతో
దివికిం గంఠము నెత్తి లో వదలుబో దేహేంద్రియవ్యాప్తులన్,

భాగ. దశమ. 1127.

భక్తి జ్ఞాన వైరాగ్యములు ఈశతకమున బీజరూపములో నున్నవి. కవి మహాగ్రంథరచన తలపెట్టి నప్పుడు చేయి తిరుగుటకై ముందు చిన్నిపొత్తము రచించి అభ్యాసమున సిద్ధు డైనట్టు పోతన భాగవతాంధ్రీకరణకు పూర్వము దీనిని చెప్పె నని ఊహింపవచ్చును. భావికాలములో భాగవతము తాను చేయ నున్నట్లు కవి ఈశతకమున పెక్కుసార్లు సూచనలు చేసినాడు. కృష్ణావతార వింశతిలో ఈవాక్కులను గమనింప దగును:

కస వొప్పన్ పసి మేసి...పసిగొంచు వచ్చుటలు నే భావింతు - 45
గోబృందమ్మతో వచ్చు నీవన్నెల్... నే వర్ణింతు - 46
ఈ వరవృత్తాంతము లేను పుణ్యకథగా వర్ణింతు - 47
గోపాలవ్రాతము గండుకోయిలలుగా వర్ణింతు - 49
గోశ్రేణుల్ చిందులు ద్రొక్కు యాడుటలు నే జర్చింతు - 50
గోపికల తద్గానంబులన్...చందములు నే వర్ణింతు - 51

ఈవిధముగా రాసక్రీడ, వేణునాదము, గోపికా విరహము, పూతనాహరణము, కంసవధము - ఇత్యాది కృష్ణలీలలు వర్ణింతు నని ఎన్నో పద్యములలో పలికినాడు. శతకమున శ్రీరామ శ్రీకృష్ణుల యెడ భక్తి వెల్లడి యగుచున్నది. రామానుజ మతవ్యాపనమును స్ఫురింప జేసెడిభావనలు కొలది. రఘువీర శతకమునందలి వైష్ణవసంప్రదాయములు నారాయణ శతకమున కానరావు.

ఈశతకశైలి భాగవతశైలి వలెనే హృద్యము. అందులో నున్నట్లే శబ్దాలంకారములు మెండుగా నున్నవి. భావములు భాగవతభక్తి భరితము లైి రసోద్గారము లై యున్నవి. భావభాషలు అన్యోన్యసమ్మోహనములు గలిగి మధురహృదయమును ప్రస్ఫుటము చేయుచున్నవి.

రూపకల్పనయందు శతకశైలి మహిమ్నస్తోత్ర, శివానందలహరీ, శ్రీ కృష్ణకర్ణామృత, సర్వేశ్వరశతకాది గ్రంథముల శైలిని బోలి ప్రసన్న గంభీరముగా నున్నది.

ఈశతకకర్త ప్రాకృతశతక సంప్రదాయానుసారముగా నిజశతకమును వివిధశీర్షికలక్రింద విభజించి విషయసౌలభ్యము నాపాదించినట్లు ఈ పద్యము వలన ప్రస్ఫుట మగుచున్నది.

రమణీయంబుగ నాదిమంబు నవతారమ్ముల్ భవద్దివ్యరూ
పము నామామృతమున్ దలంప దశకప్రాప్త్యై కృష్ణావతా
రము సుజ్ఞానము మోక్షమున్ ద్వివిధ సంప్రాప్తిన్ శతాంధ్రాఖ్యకా
వ్యము నర్పించితి మీపదాబ్జములకున్ వైకుంఠ నారాయణా !

1. ఆదిదశకము ; 2. అవతారదశకము ; 3. దివ్యరూపదశకము;
4. నామప్రభావదశకము ; 5. కృష్ణావతార వింశతి ; 6. జ్ఞానవింశతి
7. మోక్షవింశతి. భక్తిశతకములలో భగవన్మహిమాది వర్ణనము లున్నను ఈ శతకమునం దున్నట్టు విషయ విభాగము కానరాదు. ఈ కవి కావ్యకళాదక్షు డనిపించును.

అష్టాక్షరీమంత్రము వైష్ణవ మంత్రరాజము. నారాయణ శతకకర్త ఏతన్మంత్రోపాసకు డని స్పష్టము.

కలుషాగాధవినాశకారి యగుచుం గైవల్యసంధాయి యై
నలి నొప్పారెడు మంత్రరాజ మగు నీనామంబు ప్రేమంబుతో
నలర న్నెవ్వనివాక్కునం బొరయదే నన్నీచుఘోరాత్మయుం
వెలయం భూరుహకోటరం బరయ సూ వేదాత్మ నారాయణా !

ఈ శతకము శుద్ధ మైన వైష్ణవభక్తిని బోధించుచున్నది. కృష్ణుని శృంగారలీలలలోనూ, శ్రీమన్నారాయణ నిర్గుణస్థితిలోనూ, శుద్ధవైష్ణవభక్తి ప్రత్యక్షము. వాసుదేవుని ఎవరెవరు ఏ రీతిని సేవింతురో భగవానుడు వారల

కాయారీతిని ప్రత్యక్ష మగుచుండు నని కవి తెలిపినాడు. భగవద్భక్తికి చిత్త సమర్పణము ముఖ్య మనియు, చిత్తశుద్ధి లేని బాహ్యక్రియాదులు నిష్ప్రయోజ నము లనియు ఈ శతకాభిప్రాయము. సదాచారవర్జితము లైన జపనియమాదులు బకజపముల వంటి వై కైంకర్యమునకు ఉపకరింప వని బోధించినాడు.

ఈశతకము వైష్ణవపదము నర్థించుచున్నను, విశిష్టాద్వైతసిద్ధినే గాక అద్వైతసిద్ధిని గూడ అర్థించుచున్నది. జ్ఞానవింశతిలోనూ, మోక్షవింశతిలోనూ ఇది స్పష్టము. ఈ శతకములో బీజరూపమున నున్న ఈభావము భాగవతము లోని ముఖ్యఘట్టములలో స్పష్టముగా గోచరించును.

శ్రీ కులశేఖర ఆళ్వారు అనుగ్రహించిన ముకుందమాలలోని ఈ పద్యము లను నారాయణ శతకకర్త బఠించినట్లు తోచును.

దారా వారాకరవరసుతా తే తనూజో విరించిః
స్తోతా వేద స్తవ సురగణో భృత్యవర్గః ప్రసాదః
ముక్తి ర్మాయా జగదవికలం తావకీ దేవకీ తే
మాతా మిత్రం వలరిపుసుత స్త్వ య్యతో న్యన్నజానే.

జిహ్వే కీర్తయ కేశవం మురరిపుం చేతో భజ శ్రీధరం
పాణిద్వన్ద్వ సమర్చ యాచ్యుతకథా శ్రోత్రద్వయ త్వం శ్రుణు
కృష్ణం లోకయ లోచనద్వయ హరే ర్గచ్ఛాంఘ్రియుగ్మాలయం
జిహ్వేఘ్రాణ ముకుందపాదతులసీం మూర్ధ న్న మాధోక్షజమ్.

కృష్ణకర్ణామృతములోని "రాధా పునాతు జగ దచ్యుతదత్త శిత్తా". నారా యణ శతకములోని "పెరుగుల్ దెచ్చుచు నొక్కగోపిక..."

ముకుంద మాలలోని "ఆమ్నాయాభ్యసనా న్యరణ్యరుదితం ..." నారాయణశతకములోని "స్నానంబుల్ నదులందు చేయుట ....." వీనికి సామ్యము కనబడుచున్నది.

భాగవతములో విస్పారినవానికి బీజములు నారాయణశతకములోని వర దుగ్ధాబ్ధి...అలవై కుంఠపురంబు...కాననగును.

సకలాధీశ్వరు లై ...గణాధిపతు లై ...సర్వేశ్వరశతకము.
ఘనభోగాస్పదు లై ...నారాయణశతకము.

ఖలు లై యాచకు లై ...సర్వేశ్వరా...
నిరతానందవియోగు లై ...నారాయణా...
భువనోత్పత్తి...విధించుచో...సర్వేశ్వరా...
భూతవ్రాతము...నారాయణా...
భవదుఃఖార్ణవ యానపాత్రము...సర్వేశ్వరా.
పరమం బై , పరతత్త్వ మై...నారాయణా.

వీనికి పరస్పర పదభావ సామ్యము గోచరించుచున్నది. నారాయణ శతకకర్త యే గాక ఆంధ్రకవు లనేకులు సంస్కృత స్తోత్రములను అష్టకాదు లను ఎడనెడ ననుసరించుచుండుట సంప్రదాయము,

ఈ శతకకవి సంబోధించిన నారాయణుడు విశ్వమయు డైన ఆదినారాయ ణుడు. ఆదినారాయణుడు అవ్యక్తుడు, దివ్యాత్ముడు, వేదాత్ముడు, భూతాత్ముడు, భిన్నరూపములను ధరించి లోకోద్ధరణము చేయుచుండును.

బాలగోపాలుని మురళీగానము గోవర్ధనమునకును, గోబృందమునకును, గోపాలురకును బ్రహ్మానందహేతు వైనది. భాగవతములోని నారాయణుడు శృంగారమూర్తి, కరుణామయమూర్తి, భక్తమందారమూర్తి, నారాయణ శత కములోని నారాయణుడు విశ్వమయుడు, పరమార్థప్రదాత.

ఈశతకకవి చిత్తశుద్ధి కల భాగవతోత్తముడు. లౌకికసంపదల నాశించి భగ్నమనోరథు డైన విరాగి కాడు. భాగవతములోని అద్వైతసిద్ధి ఇందు ప్రస్ఫు టము కాకపోయినను భక్తిజ్ఞాన యోగములు సరియోగము పొందినవి. ఇతడు అహంకార మమకారములను విడిచి పవిత్రహృదయముతో నారాయణోపాసన చేసి కృతార్థు డైనట్లు గోచరించును,

ఈశతకమందలి ఐదు, అరవై యొకటి పద్యములను బట్టి శతకకర్తకు వేద శాస్త్ర పురాణ పరిచయ మున్నట్లు తోచుచున్నది.

1. ఈశతకములో_ ఎడల న్నేతప్పులన్-ద్రుతమున కచ్చు పరమగునపుడు ద్విత్వము విధించినాడు.

[సర్వమున్నతని—భాగవతము. నన్నయ—అన్నిష్టసఖి—అన్నాడు.
ఉత్తరహరివంశమున-సర్వాంగున్నిన్ననుభూతా-ఆనియున్నది.]

2. విహరిం చింద్రవిరించి...క్ష్వ్యర్థకసంధి.

3. అత్యంత సామర్థ్యులై...12 :

[శేషనాథుని పర్వతపురాణములో-అపాంగవ్యాప్తలోలక్రియా సామర్థ్యున్ అని యున్నది. చాతుర్యుడు అని సింగన ద్విపద భాగవతములోను, దారిద్ర్యుడు అని కొరవి గోపరాజు ప్రయోగించినారు.]

4. వైరిసమాసములు:-

మగ మీనాకృతి...నారాయణ: 11

[మురకుచకుంభములు-నైషధము : 2-95

చెలువ నేత్రవిలాసము-విజయ విలాసము : 2]

5. ఇరువై యొక్కటి నూరు...నారా : 16

[ఇరువై నాలుగు మూర్ల నేల...కాశీఖండము : 1-9

నూటిరువై యెనిమిది భేదములు : నరస భూపా : 2-50.]

6. కల్గుండు (కల్గి + ఉండు)

[కల దన్నవారికి కల్గుండునాను-బసవపురాణము]

7. వరదాసావళి దాస దాసి నయి దుర్వారౌఘముల్...88

ఇచట దాసుడు అనుటకు మారు దాసి అని ప్రయుక్తము.

[చెచ్చెర కాళిదాసికిని-బసవపురాణము.

పరమున కేను దాసి నయి పల్క-గ...కుమార...

ఇది శివకవులలో పరిపాటి యగు పదము.]

శ్రీ

నారాయణ శతకము

శ్రీరామామణి పాణిపంకజమృదుశ్రీతజ్ఞ పాదాబ్జ శృం
గారాకారశరీర, చారుకరుణాగంభీర, సద్భక్తమం
దా, రాంభోరుహపత్రలోచన కళాధారోరుసంపత్సుధా
పారావారవిహార, నాదురితముల్ భంజింపు నారాయణా : 1

మ. కడకుం బాయక వేయినోళ్ళ గల యాకాకోదరాధీశుడున్
గడ ముట్ట న్వినుతింప లేక నిగుడఁ గ్రాలంగ నొప్పారు మి
మ్మడరఁ సన్నుతి సేయ నాదువశమే : యజ్ఞాని, లోభాత్ముఁడఁ,
జడుఁ డ, న్నజ్ఞుఁడ, నైకజిహ్వుఁడ, జనస్తబ్ధుండ, నారాయణా : 2

శా. నే నీదాసుఁడ నీవు నాపతివి నిన్నే కాని యెం డెవ్వరిఁ
ధ్యానింపం బ్రణుతింప నట్లగుటకు న్నానేర్చుచందంబునఁ
నీ నామస్తుతు లాచరించు నెడల న్నేతప్పులుం గల్గినఁ
వానిన్ లోఁగొను మయ్య, తండ్రి, విహితవ్యాపార, నారాయణా : 3

మ. నెరయ న్నిర్మల మైన నీస్తుతికథానీకంబు పద్యంబులో
నొరుగుల్ మిక్కిలి గల్గె నేనియుఁ గడు న్యోగంబె చర్చింపఁగాఁ
గుఱుగ ణ్వైనను వంకబోయినఁ గడుం గుజ్జైనఁ బేడెత్తినం
జెఱుకుం గోలకు తీపు గాక కలదే, చే దెందు, నారాయణా : 4

మ. చదువుల్ పెక్కులు సంగ్రహించి పిదపం జాలంగ సుజ్ఞాని యై
మదిలోఁ బాయక నిన్ను నిల్పుఁ దగు నామర్మంబు వీక్షింపఁడే
మొదలం గాడిద చారుగంధవితతుల్ మోవంగ శక్యంబె కా
కది సౌరభ్యపరీక్ష జూడ కుశలే యవ్యక్త, నారాయణా : 5

మ. లలిఁ గబ్బంబు కరాట మివ్వసుధ నెల్లం న్నిండెఁ బో నీకథా
వళి కర్పూరము నించిన న్నితర మౌ వ్యర్థార్థకామోదముల్
పెలుచం బూసిన యక్కరాటము తుదిన్ బేతేకరాటంబె పో
చలదిందీవరపత్రలోచన, ఘనశ్యామాంగ, నారాయణా ! 6

మ. మన మార న్నచలేంద్రజాధిపతికి న్మస్తాగ్రమాణిక్య మై
మునికోపానలదగ్ధ రాజతతికి న్ముక్తిస్ఫురన్మార్గ మై
యెనయఁ సాయకశాయికిం జనని యై యేపారు మిన్నేటికిం
జనిమూలం బగు నంఘ్రి నాదుమదిలోఁ జర్చింతు, నారాయణా ! 7

శా. నీపుత్రుండు చరాచరప్రతతుల న్నిర్మించి పెంపారఁగా
నీపుణ్యాంగన సర్వజీవతతుల న్నిత్యంబు రక్షింపఁగా
నీపాదోదక మీజగత్త్రయముల న్నిష్పాపులం జేయఁగా
నీపెం పే మని చెప్పవచ్చు సుగుణా నిత్యాత్మ, నారాయణా ! 8

శా. బ్రహ్మాండావలిలోన సత్వగుణి వై బాహ్యంబునం దాదిమ
బ్రహ్మాఖ్యం బరతత్వబోధములకున్ భవ్యాధినాథుండ వై
బ్రహ్మేంద్రామరవాయుభుక్పతులకుఁ భావింప రాకున్న నా
జిహ్మవ్యాప్తుల నెన్న నాదువశమే చిద్రూప, నారాయణా ! 9

మ. ధర సింహాసన మై నభంబు గొడు గై తద్దేవతల్ భృత్యు లై
పరమామ్నాయము లెల్ల వందిగణ మై బ్రహ్మాండ మాగార మై
సిరి భార్యామణి యై విరించి కొడు కై శ్రీగంగ సత్పుత్రి యై
వరుస న్నీఘనరాజసంబు నిజ మై వర్ధిల్లు, నారాయణా ! 10

మ. మగమీనాకృతి వార్ధిఁ జొచ్చి యసుర న్మర్దించి యవ్వేదముల్
మగుడం దెచ్చి విరించి కిచ్చి యతని న్మన్నించి యేపారఁగాఁ
బగ సాధించిన దివ్యమూర్తి వని నే భావింతు నెల్లప్పుడున్
ఖగరాజధ్వజ భక్తవత్సల జగత్కారుణ్య, నారాయణా ! 11

మ. అమరుల్ రాక్షసనాయకుల్ కడఁకతో నత్యంతసామర్థ్యు లై
భ్రమరీదండము మందరాచలముగా బాథోనిధిం ద్రచ్చగా
దమకించెఁ భువనత్రయంబును గిరుల్ దంతావళుల్ మ్రొగ్గినం
గమఠం బై ధరియించి మించిన జగత్కల్యాణ, నారాయణా ! 12

శా. భీమాకారవరాహ మై భువనముల్ భీతిల్లి కంపింప ను
ద్దామోర్వీం గొనిపోయి నీరనిధిలో డాఁ గున్నగర్వాంధునిన్
హేమాక్షుసురు వీఁకఁ దాకిఁ జయలక్ష్మిఁ గారవింపంగ నీ
భూమిం దక్షిణదంష్ట్రి నెత్తిన నినుం బూజింతు నారాయణా : 13

శా. స్తంభంబందు నృసింహ మై వెడలి యచ్చండాట్టహాసధ్వనుల్
దంభోళిం గడువంగ హేమకశిపోద్దండాసురాధీశ్వరుఁ
శుంభద్గర్భము వ్రచ్చి వానిసుతునిన్ శోభిల్ల మన్నించి య
జ్జంభారాతిని బ్రీతిఁ దేల్చిన నినుం జర్చింతు, నారాయణా : 14

మ. మహియు న్నాకసముం బదద్వయపరీమాణంబుగాఁ బెట్టి యా
గ్రహ మొప్పం బలిమస్తకం బొకపదగ్రస్తంబుగా నెమ్మితో
విహరిం చింద్రవిరించిశంకర మహావిర్భూత దివ్యాకృతిన్
సహజం బై విలసిల్లు వామన లసచ్చారిత్ర నారాయణా : 14

మ. ధరణిన్ రక్తమహాహ్రదంబు లెలమిం ద్రైలోక్య నిర్దిష్టమై
పరగం బైతృక తర్పణంబుకొఱకై ప్రఖ్యాతిగాఁ దీవ్రతన్
నిరువయ్యొక్కటిమారు క్షత్రవరుల న్నేపార నిర్జించి త
త్పరశుభ్రాజిత రామనామము కడుఁ ధన్యంబు నారాయణా : 16

మ. వరుసం దాటకిఁ జంపి కౌశికుమఖస్వాస్థ్యంబు గావించి శం
కరుచాపం బొగిఁ ద్రుంచి జానకిఁ దగం గళ్యాణ మై తండ్రిపం
పరుదారన్ వనభూమి కేఁగి జగదాహ్లాదంబుగా రావణున్
ధరణిం గూల్చిన రామనామము కడుఁ ధన్యంబు నారాయణా : 17

మ. యదువంశంబున గృష్ణ కగ్రజుడవై * యాభీల శౌర్యోన్నతిన్
మదవద్దేనుక ముష్టికా ద్యసురులఁ మర్దించి లీలారసా
స్పదకేళీరతి రేవతీవదన కంజాతాంతభృంగం బనఁ
విదితం బౌ బలరామమూర్తి వని నిన్ వీక్షింతు నారాయణా ! 18

మ. పురము ల్మూడును మూడులోకములు నేప్రొద్దు న్విదారింప ద
త్పురనారీ మహిమోన్నతుల్ సెడుటకై బుద్ధుండ వై బుద్ధితో
వరబోధద్రుమ సేవ జేయుటకునై వారిం బ్రబోధించి య
ప్పురముల్ గెల్చిన మీయుపాయము జగత్పూజ్యంబు నారాయణా ! 19

మ. కలిధర్మంబున బాపసంకలితు లై గర్వాంధు లై తుచ్ఛు లై
కులశీలంబులు మాని హేయగతులం గ్రొవ్వారు దుష్టాత్ములం
బలిగా జేయ దలంచి ధర్మ మెలమిం బాలించి నిల్పంగ మీ
వలనం గల్క్యవతార మొందఁగల నిన్ వర్ణింతు నారాయణా ! 20

మ. ఇర వొందఁ సచరాచరప్రతతుల న్నెన్నంగ శక్యంబు కా
కరయఁ పద్మభవాండ భాండచయము న్నారంగ మీకుక్షిలో
నరుదార న్నుదయించు బెంచు నడఁగు న్ననారికేళోద్భవాం
తర వాఃపూరము చంద మొంది యెపుడున్ దైత్యారి నారాయణా ! 21

మ. దళదిందీవర నీలనీరద సముద్యద్భాసితాకార, శ్రీ
లలనాకౌస్తుభచారువక్ష విబుధశ్లాఘోద్భవస్థాన కో
మలనాభీచరణారవిందజనితామ్నాయాద్యగంగా ! లస
జ్జలజాతాయతనేత్ర నిన్ను మదిలోఁజర్చింతు నారాయణా ! 22

మ. జగదాధారక భక్తవత్సల కృపాజన్మాలయాపాంగ ! భూ
గగనార్కేందుజలాత్మపావక మరుత్కాయా ! ప్రదీపప్రయో
గి గణస్తుత్య మహాఘనాశన ! లసద్గీర్వాణసంసేవితా !
త్రిగుణాతీత ! ముకుంద ! నాదుమదిలో దీపింపు నారాయణా ! 23

---

*యేపారునుద్దండతఁ.

శా. భూతవ్రాతము సంబుజాసనుఁడ వై పుట్టింతు విష్ణుండ వై
ప్రీతిం బ్రోతు హరుండ వై చెఱుతు నిర్భేద్యుండ వై త్రిగుణో
పేతం బై పరమాత్మ వై నిలుతు నీపెం పెవ్వరుం గాన ర
జ్జాతోద్భూతసుజాతపూజితపదాబ్జశ్రేష్ఠ నారాయణా ! 24

మ. వరనాభీధవళాంబుజోదరమున వాణీశుఁ గల్పించి య
ప్పురుషశ్రేష్ఠుని ఫాలమందు శివునిం బుట్టించి యామేటికిం
బరమోత్తంసముగా వియత్తలనదిం బాదంబులం గన్న మీ
సరి*యెవ్వారలు మీరు దక్కఁగ రమాసాధ్వీశ నారాయణా ! 25

మ. ప్రభ మీనాభి జనించినట్టి విలసత్పద్మోరుసద్మంబునం
బ్రభవం బైన విరించి ఫాలజనిత ప్రస్వేదసంభూతుఁ డై
యభిధానంబును గోరి కాంచెను భవుం డార్యేశు లూహింపఁగా
నభవాఖ్యుండవు ని న్నెఱుంగవశమే యబ్జాక్ష నారాయణా ! 26

మ. పటుగర్భాంతరగోళభాగమున నీబ్రహ్మాండభాండంబు ప్రా
కట దివ్యాద్భుతలీలఁ దాల్చి మహిమం గల్పాంత మంభోధి పై
వటపత్రాగ్రముఁ జెంది యొప్పిన మిము న్వర్ణింపఁగా శక్యమే
నిటలా క్షాంబురుహాసనాదికులకు న్నిర్వాణ నారాయణా ! 27

మ. సవిశేషోరు సువర్ణబిందువిలస చ్చక్రాంకలింగాకృతి
భవుచే నుద్ధవుచేఁ బయోజభవుచేఁ బద్మారిచే భానుచే
ధ్రువుచే నా దివిజాధినాయకులచే దీప్యన్మనీంద్రాళిచే
నవదివ్యార్చన లందుచుందువు రమానారీశ నారాయణా ! 28

మ. సర్వంబున్ వసియించు నీతనువునన్ సర్వంబునం దుండగా
సర్వాత్మా ! వసియించు దీ వని మదిన్ సార్థంబుగాఁ జూచి యా
గీర్వాణాదులు వాసుదేవుఁ డనుచున్ గీర్తింతు రేప్రొద్దు నా
శీర్వాదంబు భవన్మహామహిమ లక్ష్మీనాథ నారాయణా ! 29

---

* యింకెవ్వరు నీవెక్కర్తవు రమాసంబంధ.

మ. గగనాద్యంచితపంచభూతమయ మై కంజాతజాండావలిన్
సగుణబ్రహ్మమయాఖ్యతం దనరుచున్ సంసారి వై చిత్కళా
సుగుణం బై విలసిల్లు దీవు విపులస్థూలంబు సూక్ష్మంబు నై
నిగమోత్తంస గుణావతంస సుమహోత్యాత్మ నారాయణా ! 30

మ. ఎల రారన్ భవదీయనామకథనం బేమర్త్యచిత్తంబులో
బొలు పారం దగి లుండునేని యఘముల్ పొందంగ నె ట్లోపెడున్
కలయం బావకుచేత బట్టువడు నక్కష్టంబు పై గీటముల్
నిలువ న్నేర్చునె భక్తపోషణ కృపానిత్యాత్మ నారాయణా ! 31

మ. కలయం దిక్కులు నిండి చండతర మై కప్పారుమేఘౌఘముల్
వెలయన్ ఘోరసమీరణస్ఫురణచే వే పాయుచందంబున
జలదంభోళి మృగాగ్నితస్కరరుజాశత్రోరగవ్రాతముల్
దొలగు నీ మ్మదగు దివ్యమంత్రపఠన దోషఘ్న నారాయణా ! 32

మ. కలుషాగాథవినాశకారి యగుచుం గైవల్యసంధాయి యై
నలి నొప్పారెడు మంత్రరాజ మగు నీనామంబు ప్రేమంబుతో
నలర న్నెవ్వని వాక్కునం బొరయదే నన్నీచు ఘోరాత్మయున
వెలయన్ భూరుహకోటరం బదియ సూ వేదాత్మ నారాయణా ! 33

మ. పరమం బై పరతత్వ మై సకలసంపత్సార మై భవ్య మై
సురసిద్ధోరగయక్షపక్షిమునిరక్షోహృద్గుహాభ్యంతర
స్థిరసుజ్ఞానసుదీప మై శ్రుతికళాసిద్ధాంత మై సిద్ధ మై
సరి లే కెప్పుడు నీదునామ మమరున్ సత్యంబు నారాయణా ! 34

మ. అధికాఘౌఘతమోదివాకరము నై యద్రీంద్రజా జిహ్వాకున్
సుధ యై వేదవినూత్నరత్నములకున్ సూత్రాభిధానంబు నై
బుధసందోహమనోహరాంకురము నై భూదేవతాకోటికిన్
విధు లై మీబహునామరాజి వెలయున్ వేదాత్మ నారాయణా ! 35

మ. పొనరన్ముక్తికిఁ ద్రోవ వేదములకుం బుట్టిల్లు మోదంబునం
దునికిస్థానము నిష్టభోగములకు న్నుత్పత్తి యేప్రొద్దునుఁ
ఘనపాపంబుల వైరి షడ్రిపులకుఁ గాలావసానంబు మీ
వినుతాంఘ్రిద్వయపద్మసేవన గదా విశ్వేశ నారాయణా! 36

మ. భవరోగంబుల మందు పాతకత మోబాలార్కబింబంబు క
ర్మ విషజ్వాలసుధాంశుగామృతతుషారవ్రాతపాథోధిమూ
ర్తివి కైవల్యపదావలోకనకళాదివ్యాంజనశ్రేష్ఠ మై
భువిలో మీ దగు మంత్రరాజ మమరున్ భూతాత్మ నారాయణా! 37

మ. వరుసన్ గర్మపిపీలికాకృత తనూవల్మీకనాళంబులోఁ
బరుషాకారముతో వసించిన మహాపాపోరగశ్రేణికిం
బరమోచ్చాటన మై రహస్యమహిమం బాటింపుచు న్నుండు మీ
తిరుమంత్రం బగు మంత్రరాజ మమరుం దివ్యాత్మ నారాయణా! 38

మ. హరుని న్నద్రిజ నాంజనేయుని గుహు న్నయ్యంబరీషున్ ధ్రువుం
గరిఁ బ్రహ్లాదు విభీషణాఖ్యుని బలిన్ ఘంటాశ్రవు న్నారదుఁ
గర మొప్ప న్వీదురున్ బరాశరసుతున్ గాంగేయునిఁ ద్రౌపదిన్
నరు నక్రూరునిఁ బాయకుండును భవన్నామంబు నారాయణా! 39

శా. శ్రీకి న్మందిర మైన వక్షము సురజ్యేష్ఠోద్భవస్థాన నా
భీ కంజాతము చంద్రికాంతరసుధాభివ్యక్త నేత్రంబులుఁ
లోకస్తుత్య మరున్నదీజనక మాలోలాంఘ్రియుఁ గల్గు నా
లోకారాధ్యుఁడ వైన ని న్నెపుడు నాలోఁ జూతు నారాయణా! 40

శా. విందుల్ విందు లటంచు గోపరమణుల్ వ్రేపల్లెలోఁ బిన్ననాఁ
డందెల్ మ్రోయఁగ ముద్దుమో మలర ని న్నాలింగితుం జేయుచో
డెందంబుల్ దనివార రాగరసవీటీలీలలఁ దేల్చు మీ
మందస్మేర ముఖేందురోచులు మము న్మన్నించు నారాయణా! 41

శా. విందు ల్వచ్చిరి మీయశోదకడకు న్వేగంబె పొ మ్మయ్యయో
నందానందన! చందనాంకురమ! కృష్ణా! యింక(బో వేమి మా
మందం జాతర సేయ(బోద మిదె రమ్మ యంచు మి మ్మెత్తుకో
చందం బబ్బిన నుబ్బకుండుదురె ఘోషస్త్రీలు నారాయణా! 42

శా. అన్నా కృష్ణమ నేడు వేల్పులకు మీ(దన్నార మీచట్లలో
వెన్నల్ ముట్టకు మన్న నాక్షణమున న్వికృత్యాకృతిస్ఫూర్తి వై
యున్నన్ దిక్కు-లు చూచుచున్ బెగడి ని న్నోలి న్ముతుల్ సేయుచున్
గన్నుల్ మూయ యశోదకున్ జిఱుత వై కన్పింతు నారాయణా! 43

శా. ఉల్లోలంబులుగా(గురుల్ నుదుటిపై నుప్పొంగ మో మెత్తి ధ
మ్మిల్లం బల్లలనాడ రాగరసనమ్మిశ్రంబుగా నీవు వ్రే
పల్లెం దాడుచు గోపగోనివహగోపస్త్రీలయుల్లంబు మీ
పిల్లంగ్రోవిని జుట్టి రా(దిగుచు నీపెం పొప్పు నారాయణా! 44

మ. కస వొప్పన్ పసి మేసి ప్రొద్దు గలుగం గాంతారముం బాసి య
ప్పసియు న్నీవును వచ్చుచో నెదురుగా(బై కొన్న గోపాంగనా
రసవద్వృత్తపయోధరద్వయ హరిద్రాలేపనామోదముల్
పసి(గొంచున్ బసి(గొంచు వచ్చుటలు నే భావింతు నారాయణా! 45

శా. చన్నుల్ మీదిఁకి చొక్కళింప నడుముం జివ్వాడ కందర్పసం
పన్నాఖ్యంబు నటించు మాడ్కి- కబరీభారంబు లూటాడ(గా
విన్నాణంబు నటింప గోపజన గోబృందంబుతో వచ్చు మీ
వన్నెల్ కన్నుల ముంచి గ్రోలుటలు నే వర్ణింతు నారాయణా! 46

మ. పెరుగుల్ ద్రచ్చుచు నొక్క-గోపిక మిముం బ్రేమంబునం జూచి రా
గ రసావేశత రిక్త ద్రచ్చ నిడ నాకవ్యంబు నీవు న్మనో
హరలీలం గనుగొంచు ధేను వని యయ్యాబోతునుం బట్టి తీ
వరవృత్తాంతము లేను పుణ్యకథగా వర్ణింతు నారాయణా! 47

శా. కేలఁ గోలయు గూటిచిక్కము నొగిం గీలించి నెత్తంబునం
బీలీపించము(జుట్టి నెన్నడుమునం బించావళిఁ గట్టి క
ర్ణాలంకార కదంబగుచ్ఛ మధుమత్తాలీస్వనం బొప్పనీ
వాలన్ గాచినభావ మిట్టి దని నే వర్ణింతు నారాయణా ! 48

శా. కాళిందీతటభూమి నాలకదుపుల్ కా లూ(ది మేయఁ సము
త్తాలోలతమాలపాదపశిఖాంతస్థుండ వై వేణురం
ధ్రాలిన్ రాగరసంబు నిండ విలసద్రాగంబు సంధించి గో
పాలవ్రాతము గండుగోయిలలుగా వర్ణింతు నారాయణా ! 49

శా. రాణించెన్ గడు నంచు నీసహచరుల్ రాగిల్లి సోలంగ మీ
వేణుక్వాణము వీనులం బడి మనోవీథుల్ బయల్ముట్ట(గా
ఘోణాగ్రంబులు మీది(కెత్తుకొని లాంగూలంబు లల్లార్చి గో
శ్రేణుల్ చిందులు ద్రొక్కఁ యాడుటలు నే(జర్చింతు నారాయణా ! 50

మ. పసులంగాపరి యే మెఱుంగు మధురప్రాయోల్లసద్భృత్తవా
గ్విసరారావము మోవి దా వెదురుగ్రోవిం బెట్టినా(డంచు నిఁ
గసటుల్ సేయ(గ నా(డు గోపిక లతద్దానంబులన్ మన్మథ
వ్యసనాసక్తల(జేయుచందములు నే వర్ణింతు నారాయణా ! 51

మ. జడ యెంతే(దడ వయ్యె జెయ్యి యలసెఁ శైలంబు మాచేతులం
దిడు మన్నఁ జిరునవ్వుతో వదలినఁ హీనోక్తి గీపెట్టి నె
క్కుఁడు గోవుల్ బ్రియ మంద నింద్రు(డడలం గోవర్ధనాద్రీంద్రమున్
గొడు గె యుండగ(గేల(బూనితి గదా గోవింద నారాయణా ! 52

మ. లలితాకుంచితవేణీయం దడవిమొల్లల్ జాజి ఫాలస్థలిఁ
దిలకం బొయ్యన జాజి(గుండలరుచుల్ దీపింప లే(జెక్కులన్
మొలకన్నవ్వుల చూపు లోరగిల మే న్మ్మవ్వంకలఁ బోవ(గా
నలి గైకొందుపు గాదె నీవు మురళీనాట్యంబు నారాయణా ! 53

శా. మాపాలం గడు గ్రొవ్వి గోపికలతో మత్తిల్లి వర్తింతువే
మాపాలెంబుల వచ్చి యుండుదు వెస న్మాపాలలో నుండు మీ
మాపా లై నసుఖాబ్ధిలో మునుగుచున్ మన్నించి తా గొల్లలన్
మాపాలం గలవేల్పు వీవె యని కా మన్నింతు నారాయణా ! 54

మ. ఒకకాంతామణి కొక్క డీవు మఱియు న్నొక్కొ క్కొ క్కొండ లై
సకలస్త్రీలకు సంతసం బలర రాసక్రీడ త న్మధ్యక
ల్పకమూలంబు సవేణునాదరస మొప్పంగా బదార్వేల గో
పికలం జెంది వినోద మొందునెడ నీపెం పొప్పు నారాయణా ! 55

మ. లలితం బైన భవత్తనూవిలసనన్ లావణ్యదివ్యామృతం
బలు(గు ల్వార(గ నీకటాక్షమున(దా మందంద గోపాంగనల్
తల(పు ల్పాదులు కట్టి కందళితనూత్నశ్రీలు వాటింతు రా
నెలతల్ తీవెలు చై త్రవిస్ఫురణ మౌ నీయొప్పు నారాయణా ! 56

శా. లీలన్ పూతనప్రాణవాయువులు పాలిండ్లందు వెళ్ళించి, దు
శ్శీలుం డై చను బండిదానవు వెసం జిందై పడం దన్ని యా
రోల న్మద్దులు గూల్చి ధేనుదనుజున్ రో(జంగ నీల్గించి వే
కూలన్ కంసుని(గొట్టి గోపికలకోర్కుల్ దీర్తు నారాయణా ! 57

మ. రసనాగ్రంబున నీదునామరుచియు రమ్యంబుగా(జెవ్వుకు
న్నసలారంగ భవత్కథాభిరతియున్ హస్తాబ్జయుగ్మంబులన్
వెస నీపాదసుపూజితాదియుగమున్ విజ్ఞానమధ్యాత్మకున్
వెస నిం పొందనివా(డు దా(బకువు సూ వేదాత్మ నారాయణా ! 58

మ. వరకాళిందితరంగడోలికలలో వైకుంఠధామంబులో
వెర వొప్పార నయోధ్యలో మధురలో వ్రేపల్లెలో ద్వారకా
పురిలో నాడెడుభంగి నాదుమదిలో భూరిప్రసన్నాననాం
బురుహం బొప్ప నటించు టొప్పును సితాంభోజాక్ష నారాయణా ! 59

శా. చల్ల ల్వేఁతొకయూర నమ్ముకొను నాసం బోవుచోఁ ద్రోవ నీ
వుల్లాసంబున నడ్డ కట్టి మదనోద్యోగానులాపంబులఁ
చల్లన్ జల్లనిచూపు జల్లు మని గోపస్త్రీలపైఁ జల్లు మీ
చల్లంబోరుతెఱంగు జిత్తమున నే జర్చింతు నారాయణా ! 60

మ. కలయ న్వేదములుఁ బురాణములు బ్రఖ్యాతంబుగా తెల్పి మీ
వలనన్ భక్తి విహీనుఁడైన పిదపన్ వ్యర్థప్రయత్నంబె పో
గులకాంతామణి గొడ్డు వోయిన గతిం గ్రొవ్వారుసస్యంబు దా
ఫలకాలంబున నీచపోవు పగిదిన్ పద్మాక్ష నారాయణా ! 6

శా. స్నానంబుల్ నదులందు జేయుట గజస్నానంబుచందం బగుఁ
మౌనం బొప్ప జపించువేద మటపీ మధ్యంబులో నే డ్పగున్
నానాహోమము లెల్ల బూడిదలలోన న్వేల్చునె య్యే చను
న్నీనామోక్తియు నీపదాబ్జరతియున్ లేకున్న నారాయణా ! 62

మ. అల నీటం దగురొంపిపైఁ జిలికిన న్నానీటనే పాయు నా
యిల పాపంబులు దుర్భరత్వము మహాహేయంబునం బొందినం
బలు వై జీవుని దొప్పఁదోఁగినవి యీబాహ్యంబునం బాయునే
పొలియుం గాక భవత్పాదజలముం బ్రోక్షింప నారాయణా ! 63

మ. తనచిత్తాబ్జము మీపదాబ్జములకుం దాత్పర్యసద్భక్తి తం
తున బంధించినబంధనంబు కతనం దుష్పాపపుంజంబు లె
ల్లను విచ్ఛిన్నము లై యడంగు మహిమోల్లాసాభి యైనట్టి దా
సున కిం పొందును మోక్షవైభవము దా సుశ్లోక నారాయణా ! 64

మ. తనువుం జీవుఁడు నేక మైనపిదపన్ ధర్మక్రియారంభుఁ డై
యనయంబు న్మది ద న్నెఱుంగక తుది న్నామాయచే మగ్నుఁ డై
తనుతత్త్వాదివియోగ మైనపిదపం దా నేర్చునే నీదు ద
ర్శన మింపారఁగ భక్తివైభవ మహాసంకాశ నారాయణా ! 65

మ. తనకుఁ సాత్వికసంపదాన్విత మహాదాసోహభావంబునన్
ననయంబు న్మది నన్యదైవభజనం బారంగ దూలింపుచున్
జనితాహ్లాదముతోడ నీచరణముల్ సద్భక్తి పూజించి నిఁ
గనుగొన్నంతనె కల్మషంబు లడఁగుం గర్మఘ్న నారాయణా! 66

మ. పరికింపన్ హరిభక్తి భేషజునకున్ భవ్యంబు గా మీఁద మీ
చరణాంభోరుహదర్శనంబు గలదే సంప్రీతి నె ట్లున్నఁదా
ధరలోఁ జోరుఁడు గన్న దుస్తర పరద్రవ్యంబుపై నాశలం
బొరయ న్నేర్చునె దుర్లభం బగు గృపాంభోజాక్ష నారాయణా! 67

మ. పరమజ్ఞాన వివేక పూరిత మహా భవ్యాంతరాళంబునఁ
బరగ న్నీ నిజనామమంత్ర మొనరన్ భక్తి న్ననుష్ఠింపుచుం
దురితాన్వేషణ కాలభూతము వెసన్ దూలంగ వాకట్టు వాఁ
డరుగున్ భవ్యపదంబు నొందుటకు నై యవ్యక్త నారాయణా! 68

మ. సరిఘోరాంధక బోధకారణ విపత్సంసార మాలిన్యముఁ
బరమానంద సుబోధకారణ లసద్భాస్మంబుపై నూఁది యా
నిరతజ్ఞానసుకాంతిదర్పణమున న్నిస్సంగుఁ డై తన్ను దా
సరయం గాంచినవాఁడు నిన్నుఁగనువాఁ డబ్జాక్ష నారాయణా! 69

మ. పరుషాలాపము లాడ నోడి మది నీపాపార్జనారంభుఁ డై
నిరసిం చేరికిఁ గీడు సేయక మది న్నిర్ముక్తకర్ముండు నై
పరమానందనిషేధముల్ సమముగా భావించి వీక్షించు నా
పరమజ్ఞాని భవత్కృపం బొరయు నో పద్మాక్ష నారాయణా! 70

మ. ఒరులం దన్ను నెఱుంగు నియ్యెఱుకయు న్నొప్పార నేకాంత మం
దరయం బై పడు నన్యభామినులపై నాకాంక్షదూరత్వమున్
మరణావస్థను నీదునామములె సన్మానంబునం దోఁచుటల్
ధరలోన న్నివి దుర్లభంబులు సుధాధామాక్ష నారాయణా! 71

మ. వెర వొప్ప న్బహుశాస్త్రమంత్రము లొగి స్వీకించి వే తెల్పి మీ
పరనామామృతపూర మానుచు దగన్ వైరాగ్యధాపంబునఁ
సరి నక్రాంతము గోరువారు పిదపన్ సంసారమాతుఃపయో
ధరదుగ్ధంబులు గ్రోల నేరరు వెసఁ దైత్యారి నారాయణా! 72

శా. వేదం బందు సునిశ్చయుం డగు మహావే ల్పెవ్వఁడో యంచు నా
వేదవ్యాస పరాశరుల్ వెదకిన న్వేఱొండు లే డంచు మీ
పాదాంభోజము లెల్లప్రొద్దు మదిలో భావింతు రత్యున్నతిన్
శ్రీదేవీవదనారవిందమధుపా శ్రీరంగ నారాయణా! 73

మ. సుతదారాప్తజనాదివిత్తములపై శూన్యాభిలాషుండు నై
యతనోద్రేకయుతంబు లై పొదలు నయ్యింద్రియవ్రాతముల్
మృతిఁ బొందించి దమంబునన్ శమమునన్ మీయంగ వర్తించు ని
ర్గతసంసారి భవత్కృపం బొరయు నో కంజాక్ష నారాయణా! 74

మ. ప్రమదం బారఁగ పుణ్యకాలగతులన్ భక్తి న్ననుష్ఠింపుచున్
నమర న్నన్న సువర్ణ గో సలిల కన్యా ధారుణీ గ్రామ దా
నము లామ్నాయ విధోక్తి భూసురులకున్ సన్మార్గఁ డై యిచ్చువాఁ
డమరేంద్రార్చిత వైభవోన్నతుఁ డగు న్నామీఁద నారాయణా! 75

మ. ఇల నెవ్వారి మనంబులో నెఱుక దా నెంతెంత గల్గుండు నా
కొలదిం జెంది వెలుంగుచుండు కలయ న్గోవింద నీరూపులఁ
అలర న్నంబు మితంబు లై సరసిలో నంభోరుహంబుల్ దగఁ
నిల నొప్పారెడు చంద మొందె దెపుడు న్నీలాంగ నారాయణా! 76

మ. మదిలో నుత్తమభక్తిపీఠముపయిఁ మానాథ మీపాదముల్
గదియం జేర్చిన వాని కే నొడయడన్ గా దంచు నత్యున్నతిన్
పదిలుం డై సమవర్తి మృత్యువునకుఁ బాఠంబుగాఁ బల్కు మీ
పదపద్మార్చకు లెంత పుణ్యులొ కృపాపారీణ నారాయణా! 77

మ. కుల మెన్నం గొల దేల యేకులజు(డుం గోత్రాభిమానాభిలా
షలునజ్ఞానము బాసి జ్ఞానము మదిన్ సంధించి శుద్ధాత్మ(డై
యలరారం బరుసంబు సో(కు నిను మున్ హేమాకృతిస్తోమ మై
వెలయు న్నాగతివా(డు ముక్తి కరుగున్ వేదాత్మ నారాయణా ! 78

మ. నిరతానందనియోగు లై నియతు లై నిర్భాగ్యు లై నీచు లై
కరుణాహీనమనస్కు లై మలిను లై కష్టాత్ము లై నష్టు లై
పరుషవ్యాధినిబద్ధు లై పతితు లై భగ్నాంగు లై మ్రగ్గువా
రరయ న్ని న్నొగి నాత్మయం దిడనివా రబ్జాక్ష నారాయణా ! 79

మ. ఘనభోగాస్పదు లై గతౌఘమతు లై కారుణ్యు లై ముక్తు లై
ధనకీ ర్తిప్రదు లై దయాభిరతు లై ధర్మాత్ము లై నిత్యు లై
మనుజాధీశ్వరు లై మనోజనిభు లై మాన్యస్థు లై స్వస్థు లై
యెనర న్నొప్పెడువారు నీపదరుచి న్మూహించు నారాయణా ! 80

మ. విదితామ్నాయ నికాయ భూతములలో విజ్ఞానసంపత్కళా
స్పద యోగీంద్రమనస్సరోజములలో బ్రహ్మేంద్రదిక్పాలక
త్రిదశవ్రాతకిరీటరత్నములలో దీపించుచున్నట్టి మీ
పదపద్మంబులు భావగేహమున నే భావింతు నారాయణా ! 81

మ. వెలయన్ యౌవనకాలమందు మరు(డున్ వృద్ధాప్యకాలంబునన్
బలురోగంబులు నంత్య మందు యము(డుం బాధింప నట్టైన యీ
పలుజన్మంబులు చాల దూలితి ననుం బాలింపవే దేవ మీ
ఫలితానంద దయావలోకనము నా పై(జూపు నారాయణా ! 82

మ. బలుకర్మాయత పాశబంధవితతి బాహాపరిశ్రేణికి
జలయంత్రాన్విత బంధయాతనగతిన్ సంసారకూపంబులో
నలరం ద్రిమ్మరుచుండు నన్ను నకటా ! యార్తుండ నై వే(డెదన్
వెలయ న్నీకృపచేత(జేకొనవె నన్ వేవేగ నారాయణా ! 83

మ. మమహంకార వికారసన్నిభ మహామత్తాది లోభాంధకా
రముచే ముక్తికి నేఁగుమార్గ మెఱుగఁ రా దింక నాలోన నీ
విమలాపాంగదయా దివాకరరుచిన్ వెల్గింపు మింపార నో
కమలానందవిహారవక్షిలలితా ! కంజాక్ష ! నారాయణా ! 84

మ. పరిపంథిక్రియ నొత్తి వెంటఁ బడునప్పాపంబుఁ దూలించి మీ
చరణాబ్జస్థితి పంజరంబు శరణేచ్ఛం జొచ్చితిం గావుమీ
బిరుదుం జూడుము మీరు సూడఁగ భవద్భృత్యుండు దుఃఖంబులం
బొరయ నీ్మ కపకీర్తి గాదె శరదంభోజాక్ష నారాయణా ! 85

మ. సతతాచారము సూన్యతంబు కృపయున్ సత్యంబునున్ శీలమున్
నతశాంతత్వము చిత్తశుద్ధికరము న్నధ్యాత్మయున్ ధ్యానమున్
ధృతియున్ ధర్మము సర్వజీవహితముం దూరంబు గాకుండ స
మ్మతికిం జేరువ మీనివాససుఖమున్ మానాథ నారాయణా ! 86

మ. భవనాశిన్ గయ తుంగభద్ర యమునన్ భాగీరథిం గృష్ణ వే
త్రవతి న్నర్మద పెన్న గౌతమి పయోరాశి న్వియద్గంగయం
దవగాహంబున నైన పుణ్యములు బెం పారంగ నేఁ డిచ్చటన్
భవదంఘ్రిస్మరణంబునం గలుగు పో పద్మాక్ష నారాయణా ! 87

మ. ధర గ్రామాధిపు నింటిదాసుఁడు వెసం దా ద్రోహముం జేసినన్
పరగం జెల్లుట సూచి తీభువనసంపాద్యుండ వైనట్టి మీ
వరదాసావలి దాసదాసి నని దుర్వారౌఘముల్ జేసితిన్
కరుణం జేకొని కావు మయ్య త్రిజగత్కల్యాణ నారాయణా ! 88

మ. గణుతింపన్ బహుధర్మశాస్త్రనిగమౌఘం బెప్పుడు న్ని న్నకా
రణబంధుం డని చెప్ప నత్తెఱఁగు దూరం బందకుండంగ నే
బ్రణతుల్ జేసెదఁ గొంత యైనఁ గణుతింపం బాడి లేకుండినన్
ఋణమా నానతి నీవు శ్రీపతివి నీ కే లప్పు ? నారాయణా ! 89

మ. కరినాథుండు జలగ్రహ గ్రహణ దుఃఖాక్రాంతుఁ డై యాశ మీ
శరణం బన్నఁగృశాను భానుశతతేజస్ఫూర్తి యైనట్టి మీ
కరచక్రంబున నక్రకంఠము వెసఁ ఖండించి మించెం దయా
పరసద్భక్తభయానక ప్రకర సత్ప్రాకట్య నారాయణా ! 90

శా. ఏభావంబున నిఁ దలంచె గజయూథేంద్రుండు ఆపన్నుఁ డై
యేభావంబున ద్రౌప దయ్యెడ రమాధీశా యనె న్వాయసం
బేభావంబున నీశరణ్య మనెనో యానీకృపాదృష్టిచే
నాభావంబున నీతలంపు గలుగ న్నా కిమ్మ నారాయణా ! 91

శా. నీలగ్రీవుఁడు చేతిపున్కఁ విడిచె న్నీ వియింతి భిక్షంబునఁ
నీలగ్రీవుఁడు యీశ్వరాఖ్యుఁదనరె న్నీనామజప్యంబునన్
నీలగ్రీవుఁడు మించి త్రుంచెఁబురముల్ నీప్రాపు సేవించినన్
నీలగ్రీవ ముఖాబ్జభాస్కర కృపానిత్యాత్మ నారాయణా ! 92

మ. నిను వర్ణింపనివాఁడు మూఁగ మదీలో నీనామమున్ వీనులఁ
విని మోదింపనివాఁడు చెవ్డు మరి నిఁ వేడ్కఁ మనోవీథినిఁ
గని పూజింపనివాఁడు నాశకరుఁ డౌ కర్మక్రియారంభుఁ డై
తనలోఁ గాననివాఁడు నీచమతి పో తత్త్వజ్ఞ నారాయణా ! 93

మ. నిను వర్ణింపని నీచబంధమతి దా నిర్మగ్నమూఢాత్ముఁ డై
పెనుదై వంబులఁ గోరి తా మనమునన్ సేవించుచందంబు తా
నవలం బారిన భూతియందు వెలయ న్నాజ్యాహుతుల్ పూని వే
ల్చిన చందంబున వ్యర్థ మై తనరు జూ చిద్రూప నారాయణా ! 94

మ. నిను వర్ణింపని జిహ్వ దాఁ బదటికా ? నీలాభ్రదేహాంగకా
నిను నాలింపని చెవ్వు దాఁ బదటికా ? నీరేజపత్రేక్షణా
నినుఁ బూజింపనికేలు దాఁ బదటికా ? నిర్వాహకక్ష్మాతలా
నినుఁ జింతింపని యాత్మ దాఁ బదటికా నిర్వాణ నారాయణా ! 95

శా. నీవే తల్లివి నీవె తండ్రి వరయ న్నీవే జగన్నాథుఁ డౌ
నీవే నిశ్చలబాంధవుండ వరయ న్నీవే మునిస్తుత్యుఁ డౌ
నీవే శంకరమూలమంత్ర మరయన్ నీవే జగత్కర్తవున్
నీవే దిక్కనువారి వారలె కడు న్నీవారు నారాయణా ! 96

మ. అపరాధంబులు నిన్ను నమ్మి విను మే నాజన్మపర్యంతముఁ
విపరీతంబుగఁ జేసినాఁడ నిఁక నీవే దిక్కు నాలోనికిఁ
గపటం బింతయు లేక దండధరుకుం గట్టీక రక్షింపు మీ
కృపకుం బాత్రుఁడ నయ్య ధర్మపురి లక్ష్మీనాథ నారాయణా ! 97

శా. చెల్లం జేసితి పాతకంబులు మదిఁ శ్రీనాథ మీనామముల్.
పొల్లుల్ బో వని నమ్మి పద్యశతమున్ బూర్ణంబుగాఁ జెప్పితిన్
చెల్లంబో నను నమ్మె వీఁ డని దయం జేపట్టి రక్షింపుమీ
తల్లిం దండ్రియు నీవు గాక యెరులే తర్కింప నారాయణా ! 98

మ. నరసిం హాచ్యుత వాసుదేవ వికసన్నాళీకపత్రాక్ష భూ
ధర గోవింద ముకుంద కేశవ జగత్త్రి తాహితల్పాంబుజో
దర దామోదర తార్క్ష్యవాహన మహాద్వైత్యారి వైకుంఠమం
దిర పీతాంబర భక్తవత్సల కృపన్ దీవింపు నారాయణా ! 99

మ. కడకంటం గడలేని సంపద లొగిం గావింపు లక్ష్మీశ పా
ల్కడలిన్ బన్నగశాయి వై భువనముల్ గల్పించు సత్పుత్రునిఁ
బొడమఁ జేసిన నాభిపంకజ జగత్పుణ్యాత్మ భాగీరథీ
పడతిం గన్న పదారవిందముల నే భావింతు నారాయణా ! 100

మ. తపముల్ మంత్రసమస్తయజ్ఞఫలముల్ దానక్రియారంభముల్
జపముల్ పుణ్యసుతీర్థసేవఫలముల్ సద్వేదవిజ్ఞానముఁ
ఉపవాసవ్రతశీలకర్మఫలముల్ ఒప్పార ని న్నాత్మలో
నుపమింపం గలవారికే గలుగు వేయు న్నేల నారాయణా ! 101

శా. శ్రీనారాయణ యన్నఁ జాలు దురితశ్రేణి న్నివారింపఁగా
నానందస్థితి గల్గు నంచు నిగమార్థానేక మెల్లప్పుడుఁ
నానాభంగులఁ జెప్ప నేను విని శ్రీనారాయణా యంచు ని
న్నే నే నెప్పుడు గొల్తు బ్రోవఁ గదె తండ్రీ నన్ను నారాయణా ! 102

మ. కలితాఘౌఘవినాశకారి యగుచుం గైవల్యసంధాయి యై
నలి నొప్పారెడు మంత్రరాజ మగు నీనామంబు ప్రేమంబునఁ
అలర న్నెవ్వని వాక్కునం బొరయదో యన్నీచు దేహంబు దా
వెలయఁ భూరుహకోటరం బదియ సూ వేదాత్మ నారాయణా ! 103

మ. రమణీయంబుగ నాదిమంబు నవతారంబుఁ భవద్దివ్యరూ
పము నామామృతముఁ దలంప దశకప్రా ప్తయ్యెఁ గృష్ణావతా
రము సుజ్ఞానము మోక్షముఁ ద్వివిధసంప్రా ప్తిఁ శతాంధ్రాఖ్య కా
వ్యము నర్పించితి మీపదాబ్జములకుఁ వైకుంఠ నారాయణా ! 104

శా. నీమూర్తుల్ గన నీకథల్ వినఁ దుదిఁ నీపాదనిర్మాల్యని
ష్టామోదంబు నెఱుంగ, నీచరణతోయం బాడ, నై వేద్యముల్
నీమం బొప్ప భజింప నీజపము వర్ణింపఁ గృపం జేయవే
శ్రీ మించఁ బహుజన్మ జన్మములకుఁ శ్రీయాదినారాయణా ! 105

నారాయణ శతకము సంపూర్ణము.

నరసింహ శతకము

ఇది సంపూర్ణముగా సీసపద్య శతకము.

భూషణవికాస శ్రీధర్మపురి నివాస
దుష్టసంహార నరసింహ దురితదూర !

అనునది మకుటము. ఈశతకాంతమున

శేషప్ప యనుకవి చెప్పినపద్యముల్
చెవుల కానంద మై చెలగుచుండు—

అని యుండుటవలన శేషప్ప యనునత డీ శతకమును రచించినా డని తెలియు చున్నది. ఈపద్యమున ఆతనిపేరు తప్ప అన్యవిషయములు లేవు.

ఈత డెక్కడివాడు ?

ప్రతిపద్యమకుటములో ధర్మపురినివాస అని యుండుటచే రచయిత ధర్మ పురివా డని తోచును. వెనుకటిరోజులలో మానవుడు సామాన్యముగా జన్మస్థాన మునసే నివసించుచు, వృద్ధి పొందుచు, తుద కక్కడనే మరణించును. కావున నీతడుకూడ అట్టివాడే యని భావింపవచ్చును.

ధర్మపురి ఎక్కడిది ?

శేషప్ప అనంతపుర మండలములోని తాడిపత్రికి రమారమి పదునైదు కిలోమీటర్ల దూరమున నున్న ధర్మవురమువా డని జనమంచి సుబ్రహ్మణ్య శర్మగారి యభిప్రాయము. ఆయనయింటిపేరు యాయవరమువా రనియు, తద్వం శమువా రిప్పటికిని అక్కడ నున్నా రనియు, ఆపురసమీపమందలి గుట్టమీద లక్ష్మీనరసింహ స్వామివారి సన్నిధిలో గూరుచుండి కవి శతకమును క్రమముగా రచించె నని వారు చెప్పి రనియు, శతకములోని భాషనుబట్టి కవి రాయలసీమ వాడే యనియు శర్మగారు వ్రాసిరి. రాయలసీమలోనిది ధర్మపురియా, ధర్మ వరమా ?

ఇది యిట్లుండ, నిడుదవోలు వెంకట రావుగారు శేషప్ప తెలంగాణా లోనివా డన్నారు. ధర్మపురి తెలంగాణాయందలి సుప్రసిద్ధక్షేత్రము. అందు

నరసింహాలయము, లక్ష్మీనాథాలయము కలవు. వీనిలో నరసింహస్వామివారి దేవళము మిక్కిలి ఖ్యాతి నొందినది. ఆంధ్రకవులు కొందరు దీనిని ప్రశంసించినారు. మడికి సింగనకవి తన పద్మపురాణములో నిట్లన్నాడు:

అతులితలీల కేశసచివాగ్రణి ధర్మపురంబునందు నం
చితముగ నన్నసత్ర మిడి శ్రీనరసింహున కుత్సవంబులన్
సతత మహోపకారములు సల్పుచు రామగిరీంద్రమందు సు
స్థితి గుడి కట్టి విష్ణుని ప్రతిష్ఠ యొనర్చె నుదాత్త సంపదన్.

కొఱవి గోపరాజు "సింహాసన ద్వాత్రింశిక"లో ధర్మపురిప్రశంస చేసినాడు. చటి గొండ ధర్మన, సిరిప్రెగడ ధర్మన, ధర్మనకవి మొదలగు నామములు ఈధర్మపురినిబట్టి యేర్పడినవే పోతనకవి 'నారాయణ' శతకములో "ధర్మపురి లక్ష్మీ నాథ నారాయణా!" అని ధర్మపురిలక్ష్మీనాథుని పేర్కొన్నాడు. ఈనరసింహ శతకమువలననే ధర్మపురి ఆంధ్రసాహిత్యమున ప్రసిద్ధమైన దని చెప్పవచ్చును.

అనంతపుర మండలములోని ధర్మపురిని గాని, తెలంగాణాలోని ధర్మపురిని గాని దర్శించునవకాశము నాకు లభింపలేదు. పోతనకవి తెలంగాణావాడని విమర్శకులు నిర్ధారణ చేసినారు. పోతన ధర్మపురి లక్ష్మీనాథుని సంబోధించినప్పుడు ధర్మపురినివాసి యైన శేషప్ప తెలంగాణములోనివా డనియే విశ్వసింపదగును.

శేషప్ప కాలము:

తా నెప్పటివాడో శేషప్ప చెప్పుకొన లేదు. అయినను ఈత డిన్నూరు సంపత్సరముల లోపలివా డని సుబ్రహ్మణ్య శర్మ వ్రాసినారు.

నరసింహ శతకము తొలుత క్రీ. శ. 1868 లో ముద్రిత మయినది. కాబట్టి నూరేండ్ల క్రిందటివా డనుట నిర్వివాదాంశము ఈశతకమందలి 13 వ పద్యమునుబట్టి ఈతడు క్రీ. శ. 1780 - 1800 ప్రాంతమువా డని భావించుటకువీ లగుచున్నది.

కోతికి జలతారు కుళ్ళాయి యేటికి?
...క్రూరచిత్తునకు సద్గోష్ఠి యేల?
మాటనిలుకడ సుంకరి మోటు కేల?
చెవిటివానికి సత్కథాశ్రవణ మేల?

ఈపద్యమే అడిదము సూరకవి రచించిన రామలింగేశ శకమున 49 పద్యముగా గానవచ్చుచున్నది. సూరకవి శతకమున "రామలింగేశ, రామచంద్ర పురవాస! "అనునది మకుటము. అందు సరస కవితాదానంబు ముష్కరున కేల? అనుపాదము హెచ్చుగా నున్నది. రామలింగేశ శతకము చాల వ్యాప్తి కలది. సూరకవి క్రీ. శ. 1720-80 ప్రాంతము వాడు. విశేషించి దేశ సంచారము చేసినవాడు. ఈపద్యమును శేషప్ప గ్రహించి తనశతకమున జేర్చికొని యుండవచ్చును. సూరకవి సూరికవి; అట్లు చేయడు. కావున శేషప్ప 1780-1800 ప్రాంతమున నుండె నని భావించుట అసమంజసము కాదు.

శేషప్పకు కొంచెము పూర్వ డయిన కూచిమంచి తిమ్మకవి కుక్కుటేశ్వర శతకమును —

భూనుతవిలాస! పీఠికాపురనివాస!
కుముదహితకోటిసంకాశ! కుక్కుటేశ!

అను మకుటముతో రచించెను.

దానిని జూచిన శేషప్ప తనశతకమును —

భూషణవికాస! శ్రీధర్మపురనివాస!
దుష్టసంహార! నరసింహ దురితదూర!

అను మకుటముతో రచించి విద్వత్కవియెడ గౌరవము చూపినట్లు తోచును.

శేషప్ప చాత్తాదవైష్ణవు డని తెలియుచున్నది.

నరసింహ శతకము

శ్రీమనోహర ! సురార్చిత ! సింధుగంభీర !
భక్తవత్సల! కోటిభానుతేజ !
కంజనేత్ర ! హిరణ్యకశిపునాశక ! శూర !
సాధురక్షణ ! శంకచక్రహస్త !
ప్రహ్లాదవరద ! పాపధ్వంస ! సర్వేశ !
క్షీరసాగరశాయి ! కృష్ణవర్ణ !
పక్షివాహన ! నీలభ్రమరకుంతలజాల !
పల్లవారుణ పాదపద్మయుగళ !
చారుశ్రీచందనాగరుచర్చితాంగ !
కుందకుట్మలదంత ! వైకుంఠధామ !
భూషణవికాస ! శ్రీధర్మపుర నివాస !
దుష్టసంహార ! నరసింహ ! దురితదూర ! 1

పద్మలోచన ! సీసపద్యముల్ నీ మీఁద
జెప్ప బూనితి నయ్య ! చిత్తగింపు;
గణ యతిప్రాసలక్షణముఁ జూడఁగ లేదు;
పంచకావ్యశ్లోకపఠన లేదు;
అమరకాండత్రయం బరసి చూడఁగ లేదు;
శాస్త్రీయ గ్రంథముల్ చదువ లేదు;
నీకటాక్షంబున నే రచించెదఁ గాని
ప్రజ్ఞ నాయది గాదు ప్రస్తుతింపఁ;
దప్పు గలిగిన సద్భక్తి తక్కు వౌనె ?
చెఱకునకు వంకపో తేమి చెడునె తీపు ?
భూషణవికాస ! శ్రీధర్మపుర నివాస
దుష్టసంహార ! నరసింహ ! దురితదూర ! 2

నరసింహ ! నీ దివ్యనామమంత్రముచేత
దురితజాలము లెల్ల(దోలవచ్చు
నరసింహ ! నీ దివ్యనామమంత్రముచేత
బలు వైన రోగముల్ పాపవచ్చు
నరసింహ ! నీ దివ్యనామమంత్రముచేత
రిపుసంఘముల సంహరింపవచ్చు
నరసింహ ! నీ దివ్యనామమంత్రముచేత
దండహస్తు(బంట్ల దఱుమవచ్చు
భళిర ! నే నీ మహామంత్రబలముచేత
దివ్యవైకుంత పదవి సాధింపవచ్చు. భూ...

3

ఆదినారాయణా ! యనుచు నాలుకతోడ(
బలుక నేర్చినవారి పాదములకు
సాష్టాంగముగ నమస్కార మర్పణ(జేసి
ప్రస్తుతించెద నయ్య, బహువిధముల
ధరణిలో నరు లెంత దండివా రైనను
నిన్ను(గానని వారి నే స్మరింప;
మేము శ్రేష్ఠుల మంచు మిడుకు చుండెడివారి
చెంత(జేర(బోను శేషశయన !
పరమ సాత్వికు లైన నీ భక్తవరుల
దాసులకు దాసు(డను జుమీ !ధాత్రిలోన. భూ...

4

ఐశ్వర్యములకు ని న్ననుసరింప(గ లేదు,
ద్రవ్యమి మ్మని వెంట దగుల లేదు,
కనక మిమ్మని చాల(గషపెట్ట(గ లేదు,
పల్లకిమ్మని నోట(బలుక లేదు,
సొమ్ము లి మ్మని నిన్ను నమ్మి కొల్వగ లేదు,
భూము లిమ్మని పేరు పొగడ లేదు,

బలము లిమ్మని నిన్ను బ్రతిమాలఁగా లేదు,
పసుల నిమ్మని పట్టు పట్ట లేదు,
నేను గోరిన దొక్కఁటే నీలవర్ణ !
చయ్యనను మోక్ష మిచ్చినఁ జాలు నాకు. భూ... 5

మందుఁడ నని నన్ను నింద జేసిన నేమి ?
నా దీనతను జూచి నవ్వ నేమి ?
దూరభావము లేక తూలనాడిన నేమి ?
ప్రీతి సేయక వంకఁబెట్ట నేమి ?
కక్కసంబులు బల్కఁ వెక్కిరించిన నేమి ?
తీవ్రకోపముచేతఁ దిట్ట నేమి ?
హెచ్చుమాటలచేతఁ నెమ్మె లాడిన నేమి ?
చేరి దాపట గేలి చేయ నేమి ?
కల్పవృక్షంబువలె నీవు గల్గ నింకఁ
బ్రజల లక్ష్యంబు నా కేల ? పద్మనాభ! భూ... 6

చిత్తశుద్ధిగ నీకు సేవఁ జేసెదఁ గాని,
పుడమిలో జనుల మెప్పులకుఁ గాదు;
జన్మపావనతకై స్మరణఁ జేసెదఁ గాని
సరివారిలోఁ బ్రతిష్ఠలకుఁ గాదు;
ముక్తికోసము నేను మ్రొక్కఁ వేఁడెదఁ గాని,
దండిభాగ్యము నిమిత్తంబు గాదు!
నిన్నుఁ బొగడను విద్య నేర్చితినే కాని
కుజీ నిండెడు కూటికొఱకుఁ గాదు;
పారమార్థికమునకు నేఁ బాటుపడితిఁ
గీర్తికి నపేక్ష పడలేదు కృష్ణవర్ణ ! భూ... 7

శ్రవణ రంధ్రముల నీసత్కథల్ పొగడంగ
లేశ మానందంబు లేనివాఁడు,

పుణ్యవంతులు నిన్ను బూజ సేయఁగ జూచి
భావమం దుత్సాహపడనివాఁడు,
భక్తవర్యులు నీ ప్రభావముల్ పొగడఁగ
దత్పరత్వము లేక తలఁగువాఁడు,
తనచిత్తమందు నీధ్యాన మెన్నఁడులేక
కాల మంతయు వృథా గడపువాఁడు,
వసుధలో నెల్ల వ్యర్థుండు వాఁడె యగును;
మటియుఁ జెడుఁ గాక యెప్పుడు మమత నొంది. భూ... 8

గౌతమీస్నానాన గడతేరుద మటన్న
మొనసి చన్నీళ్లలో మునుఁగ లేను;
దీర్థయాత్రలచేఁ గృతార్థుఁ డౌద మటన్న
బడలి నేమంబు లే నడపలేను;
దానధర్మముల సద్గతినిఁ జెందుద మన్న
ఘనముగా నాయొద్ద ధనము లేదు;
తప మాచరించి సార్థకము నొందుద మన్న
నిమిష మైన మనస్సు నిలుపలేను;
కష్టముల కోర్వ నాచేతఁగాదు; నిన్ను
స్మరణ చేసెద నా యథాశక్తికొలది. భూ... 9

అర్థివాంఛ్రకు నీక హానిఁ జేయుటకంటెఁ
దెంపుతో వసనాభి దినుట మేలు;
ఆఁడుబిడ్డల సొమ్ము లపహరించుటకంటె
బండఁ గట్టుక నూతఁ బడుట మేలు;
పరుల కాంతలఁ బట్టి బల్మిఁ గూడుటకంటె
బడబాగ్నికీలలఁ బడుట మేలు;
బ్రతుకఁ జాలక దొంగపనులు చేయుటకంటెఁ
గొంగుతో ముష్టెత్తుకొనుట మేలు;

జలజదళనేత్ర, నీ భక్తజనులతోడి
జగడ మాడెడు పనికంటె జావు మేలు భూ...

గార్దభంబున కేల కస్తూరి తిలకంబు ?
మర్కటంబున కేల మలయజంబు ?
శార్దూలమున కేల శర్కరాపూపంబు ?
సూకరంబుల కేల చూతఫలము ?
మార్జాలమున కేల మల్లెపువ్వులబంతి ?
గుడ్లగూబల కేల కుండలములు ?
మహిషంబు కేల నిర్మల మైన వస్త్రముల్ ?
బకసంతతికి నేల పంజరంబు ?
ద్రోహచింతన జేసెడి దుర్జనులకు
మధుర మైనట్టి నీనామమంత్ర మేల ? భూ... 11

పసరంబు పం జైన పసులకాపరి తప్పు,
ప్రజలు దుర్జను లైన ప్రభుని తప్పు,
భార్య గయ్యా ళైన బ్రాణనాథుని తప్పు,
తనయుడు దు ష్టైన దండ్రి తప్పు,
సైన్యంబు చెదరిన సైన్యనాథుని తప్పు,
కూతురు చెడు గైన మాత తప్పు,
అశ్వంబు చెడు గైన నారోహకుని తప్పు,
దంతి దు ష్టయిన మావంతు తప్పు,
ఇట్టి తప్పు లెఱుంగక యిచ్చవచ్చి
నటుల మెలగుదు రిప్పు డీయవని జనులు భూ... 12

కోతికి జలతారు కుళ్ళాయి యేటికి ?
విరజాజిపూదండ విధవ కేల ?
ముక్కుడితొత్తుకు ముత్తెంపున త్తేల ?
నద్ద మేమిటికి జాత్యంధునకును ?

మాచకమ్మకు నేల మౌక్తికహారముల్ ?
క్రూరచిత్తునకు సద్గోష్ఠి లేల ?
అంకుఁబోతుకు నేల రమ్యంపు నిష్ఠలు ?
వావి యేటికి దుష్టవర్తనునకు ?
మాట నిలుకడ సుంకరిమోటు కేల ?
చెవిటివానికి సత్కథాశ్రవణ మేల ? భూ... 13

మాన్యంబు లీయ సమర్థుఁ డొక్కఁడు లేఁడు ;
మాన్యముల్ చెఱుప సమర్థు లంత ;
యెండిన యూళ్ళగో డెఱిఁగింపఁ డెవ్వఁడు ;
బండిన యూళ్ళకుఁ బ్రభువు లంత :
యితఁడు పేద య టంచు నెఱిఁగింపఁ డెవ్వఁడు ;
కలవారి సిరు లెన్నఁ గలరు చాలఁ ;
దనయాలిచేష్టల త ప్పెన్నఁ డెవ్వఁడుఁ ;
బెఱుకాంత త ప్పెన్నఁ బెద్ద లంత ;
యిట్టి దుష్టుల కధికార మిచ్చినట్టి
ప్రభువు తప్పు ల టంచును బలుకవలెను భూ... 14

తల్లిగర్భమునుండి ధనము తేఁ డెవ్వఁడు,
వెళ్ళిపోయెడినాఁడు వెంటరాదు ;
లక్షాధికా రైన లవణ మన్నమె కాని,
మెఱుఁగు బంగారంబు మ్రింగఁబోఁడు ;
విత్త మార్జనఁ జేసి విఱ్ఱవీఁగుఁ బె కాని,
కూడఁబెట్టిన సొమ్ము కుడువఁబోఁడు ;
పొందుగా మఱుఁ గైన భూమిలోపలఁ బెట్టి,
దానధర్మము లేక దాఁచి దాఁచి,
తుదకు దొంగల కిత్తురో దొరల కవునొ ?
తేనె జుంటీఁగ లియ్యవా తెరువరులకు ? భూ... 15

లోకమం దెవఁ డైన లోభిమానవుఁ డున్న
భిక్ష మర్థికిఁ జేతఁ బెట్టలేఁడు ;
తాను బెట్టకయున్న తగవు పుట్టదు గాని
యొరులు పెట్టగఁ జూచి యోర్వలేఁడు ;
దాతదగ్గఱఁ జేరి తన ముల్లె పోయినట్లు
జిహ్వాతోఁ జాడీలు చెప్పుచుండు ;
ఫలము విహ్నం బైన బలుసంతసము నందు,
మేలు కల్గినఁ జాల మిణుకుచుండు ;
శ్రీరమానాథ ! యిటువంటి క్రూరునకును
భిక్షుకుల శత్రు వని పేరు పెట్టవచ్చు. భూ... 16

తనువులోఁ బ్రాణముల్ తరలిపోయ్యెడివేళ
నీ స్వరూపమును ధ్యానించునతఁడు
నిమిషమాత్రములోన నిన్నుఁ జేరును గాని
యమునిచేతికిఁ జిక్కఁ శ్రమలఁ బడఁడు ;
పరమసంతోషాన భజనఁ జేసెడివాని
పుణ్య మే మనవచ్చు భోగిశయన !
మోక్షము నీ దాసముఖ్యుల కగుఁ గాని
నరక మెక్కఁడి దయ్య ? నళిననేత్ర !
కమలనాభుని మహిమలు గానలేని
తుచ్ఛులకు ముక్తి దొరకుట దుర్లభంబు. భూ... 17

నీలమేఘశ్యామ నీవె తండ్రివి మాకు,
కమలవాసిని మమ్ముఁ గన్నతల్లి,
నీ భక్తవరు లంత నిజ మైన బాంధవుల్,
నీ కటాక్షము మా కనేకధనము,
నీ కీర్తనలు మాకు లోక ప్రపంచంబు,
నీ సహాయము మాకు నిత్యసుఖము,

నీ మంత్రమే మాకు నిష్కళంకపు విద్య,
నీ పదధ్యానంబు నిత్యజపము,
తోయజాతాక్ష! నీ పాద తులసిదళము
రోగముల కౌషధము బ్రహ్మ రుద్రవినుత భూ... 13

బ్రతికినన్నాళ్ళు నీభజన తప్పను గాని,
మరణకాలమునందు మఱతునేమొ?
యీవేళ యమదూత లాగ్రహంబున వచ్చి,
ప్రాణముల్ పెకలించి పట్టునపుడు,
కఫ వాత పైత్యముల్ గప్పఁగా భ్రమచేతఁ
గంప ముద్భవ మంది కష్టపడుచు,
నా జిహ్వాతో నిన్ను నారాయణా యంచుఁ
బిలుతునో? భ్రమచేతఁ బిలువలేనొ?
నాఁటి కిప్పుడె చేసెద నామభజన;
తలఁచెదను, జేరి వినవయ్య ధైర్యముగను భూ... 19

పాంచభౌతికము దుర్భర మైన కాయం బి
దెప్పుడో విడుదుట యెఱుక లేదు;
శతవర్షములదాఁక మితముఁ జెప్పిరి గాని,
నమ్మరా దా మాట నెమ్మనమున;
బాల్యమందో మంచి ప్రాయమందో లేక
ముదిమియందో లేక ముసలియందొ
యూరనో యడవినో యుదకమధ్యమననో
యెప్పుడో విడుచుట యేక్షణంబొ
మరణమే నిశ్చయము; బుద్ధిమంతుఁ డైన
దేహ మున్నంతలో మిమ్ముఁ దెలియవలయు భూ... 20

తల్లిదండ్రులు భార్య తనయు లాప్తులు బావ
మఱఁదు లన్నలు మేనమామగారు,

ఘనముగా బంధువుల్ గల్గినప్పటి కైన
దాను దర్ల గ వెంట దగిలి రారు;
యముని దూతలు ప్రాణ మపహరించుక పోగ,
మమతతో బోరాడి మాన్పలేరు;
బలగ మందఱు దుఃఖపడుట మాత్రమె కాని,
యించుక యాయుష్య మియ్యలేరు;
చుట్టములమీది భ్రమ దీసి చూర జెక్కి,
సంతతము ఱుమ్మ నమ్మట సార్థకంబు భూ... 21

ఇభరాజవరద! ని న్నెంత పిల్చిన గాని,
మాఱు పల్క వ దేమి మౌనితనమొ ?
మునిజనార్చిత నిన్ను మ్రొక్కి వేడిన గాని,
కనుల జూడ వ దేమి గడుసుదనమొ ?
చాల దైన్యము నొంది చాటు చొచ్చిన గాని
భాగ్య మియ్య వ దేమి ప్రౌఢతనమొ ?
సిరముగా నీపాద సేవ జేసెద నన్న,
దొరక జాల వ దేమి ధూర్తతనమొ ?
మోక్షదాయక ! యిటువంటి మూర్ఖజనుని
కష్టపెట్టిన నీ కేమి కడుపు నిండు ? భూ... 22

నీమీద కీర్తనల్ నిత్యగానము జేసి
రమ్య మొందింప నారదుడ గాను;
సావధానముగ నీచరణ పంకజ సేవ
సలిపి మెప్పింపంగ శబరి గాను;
బాల్యమప్పటినుండి భక్తి నీయందున
గలుగను బ్రహ్లాద ఘనుడ గాను;
ఘనముగా నీమీద గ్రంథముల్ గల్పించి,
వినుతి సేయను వ్యాసమునిని గాను;

సాధు(డను; మూర్ఖమతి; మనుష్యాధము(డన్ను;
హీను(డను జుమ్మి; నీవు స న్నేలుకొనుము భూ... 23

అతిశయంబుగ(గల్ల లాడనేర్చితి(గాని,
పాటిగా సత్యముల్ పలుక నేర;
సత్కార్య విఘ్నముల్ సలుప నేర్చితి(గాని,
యిష్ట మొంద(గ నిర్వహింపనేర;
నొకరి సొమ్ముకు దోసి లొగ్గ నేర్చితి(గాని,
చెలువుగా ధర్మంబు సేయనేర;
ధనము లియ్యంగ వద్దన(గ నేర్చితి(గాని,
శీఘ్రు మిచ్చెడునట్లు చెప్పనేర(;
బంకజాతాక్ష ! నే నతిపాతకు(డను
దవ్వు లన్నియు క్షమియింప(దండ్రి వీవె ! భూ... 24

ఉర్విలో నాయుష్య మున్న పర్యంతంబు
మాయ సంసారంబు మటిగి, నరు(డు
సకల పాపము లై న సంగ్రహించును గాని,
నిన్ను జేరెడి యు క్తి నేర్వలే(డు;
తుదకు(గాలునియొద్ది దూత లిద్దఱు వచ్చి,
గుంజుక చని వారు గ్రుద్దుచుండ,
హింస కోర్వ(గ లేక యేడ్చి గంతులు వేసి,
దిక్కు లే దని నాల్గుదిశలు చూడ(,
దన్ను విడిపింప వచ్చెడి ధన్యు(డెవ(డు ?
ముందె నీదాసు(డై యున్న ముక్తి గలుగు. భూ... 25

అధికవిద్యావంతు లప్రయోజకు లై రి;
పూర్ణశుంఠలు సభాపూజ్యు లై రి;
సత్యవంతులమాట జనవిరోధం బాయె;
వదఱుపోతులమాట వాసి కెక్కె;

ధర్మవాసనపరుల్ దారిద్ర్య మొందిరి;
పరమలోభులు ధనప్రాప్తు లైరి:
పుణ్యవంతులు రోగభూత పీడితు లైరి;
దుష్టమానవులు వరిష్ణు లైరి;
పక్షివాహన! మావంటి భిక్షుకులకు!
శక్తి లేదాయె; నిక నీవె చాటు మాకు భూ... 26

భుజబలంబున బెద్దపులుల జంపగ వచ్చు;
పాముకంఠము జేత బట్ట వచ్చు;
బ్రహ్మరాక్షసకోట్ల బాఱద్రోలగ వచ్చు:
మనుజుల రోగముల్ మాన్ప వచ్చు;
జిహ్వ కిష్టము గాని చేదు ఘ్రింగగ వచ్చు;
బదను ఖడ్గముచేత నదుమ వచ్చు;
గష్ట మొందుచు ముండ్లకంపలో జొర వచ్చు;
దిట్టుపోతుల నోళ్లు కట్ట వచ్చు;
బుడమిలో దుష్టులకు జ్ఞానబోధ దెలిపి
సజ్జనుల జేయలే దెంత చతురు డైన. భూ... 27

అవనిలో గల యాత్ర లన్ని చేయగ వచ్చు;
ముఖ్యు డై నదులందు మునుగ వచ్చు:
ముక్కు పట్టుక సంధ్య మొనసి వార్వగ వచ్చు;
దిన్నగా జపమాల ద్రిప్ప వచ్చు;
వేదాల కర్థంబు విజీచి చెప్పగ వచ్చు;
శ్రేష్ఠయాగము లెల్ల జేయ వచ్చు,
ధనము లక్షలు కోట్లు దాన మియ్యగ వచ్చు;
నైష్ఠికాచారముల్ నడుప వచ్చు;
జిత్త మన్యస్థలంబున జేరకుండ,
నీ పదాంభోజములయందు నిలుప రాదు భూ... 28

కర్ణయుగ్మమున నీకథలు సోఁకినఁజాలు,
పెద్ద పోగుల జోళ్లు పెట్టినట్లు ;
చేతు లెత్తుచుఁ బూజ సేయఁ గల్గినఁ జాలు,
తోరంపు కడియాలు దొడిగినట్లు ;
మొనసి మస్తకముతో మ్రొక్కఁ గల్గినఁ జాలు,
చెలువమైన తురాయి చెక్కినట్లు ;
గళము నొవ్వఁగ నామస్మరణ గల్గినఁ జాలు,
వింతగాఁ గంఠీలు వేసినట్లు ;
పూని నినుఁ గొల్చుటే సర్వభూషణంబు ;
లితర భూషణముల నిచ్చగింప నేల ? భూ... 29

భువనరక్షక ! నిన్నుఁ బొగడ నేరని నోరు
ప్రజకరోచకమైన పాడు బొంద ;
సురవరార్చిత ! నిన్ను జూడఁగోరని కనుల్
జలములోపల నెల్లి సరపుగుండ్లు ;
శ్రీరమాధిప ! నీకు సేవఁ జేయని మేను
కూలి కమ్ముడు వోని కొలిమిత్రిత్తి ;
వేడ్కతో నీకథల్ వినని కర్ణము లైనఁ
గఠినశిలాదులఁ గలుగు తొలలు ;
పద్మలోచన ! నీమీఁద భక్తి లేని
మానవుఁడు రెండు పాదాల మహిష మయ్య ! భూ. 30

అతివిద్య నేర్చుట అన్న వస్త్రములకే ;
పసుల నార్జించుట పాడికొఱకె ;
సతిని బెండ్లాడుట సంసార సుఖముకే ;
సుతులఁ బోషించుట గతులకొఱకె ;
సైన్యముం గూర్చుట శత్రుభయంబుకే ;
సాము నేర్చుట లెల్ల చావుకొఱకె ;

దాన మిచ్చుటయు ముందటి సంచితమునకే ;
ఘనముగా జదువుట కడుపుకొఅకె ;
ఇతర కామంబు గోరక సతతముగను
భక్తి నీయందు నిలుపుట ముక్తికొఅకె. భూ... 31

ధరణిలో వెయ్యేండ్లు తనువు నిల్వఁగఁబోదు ;
ధన మెప్పటికి శాశ్వతంబు గాదు ;
దారసుతాదులు తనవెంట రాలేరు ;
భృత్యులు మృతిని దప్పింపలేరు ;
బంధుజాలము తన్ను బ్రతికించుకొనలేదు;
బలపరాక్రమ మేమి పనికి రాదు ;
ఘన మైన సకలభాగ్యం బెంతఁ గల్గియు
గోచి మాత్రం బైన గొంచుఁ బోఁడు ;
వెట్టి కుక్కల భ్రమ లన్ని విడిచి, నిన్ను
భజనఁ జేసెడివారికిఁ బరమసుఖము. భూ... 82

నరసింహ ! నాకు దుర్ణయములే మెం డాయె ;
సుగుణ మొక్కటి లేదు జూడఁ జనిన ;
యన్యకాంతలమీదఁ నాశ మానఁగలేను ;
నొరుల క్షేమము చూచి యోర్వలేను ;
ఇటువంటి దుర్బుద్ధు లిన్ని నా కున్నవి ;
నేను జేసెడి పన్ని నీచకృతులు ;
నాసంటి పాపిషి నరుని భూలోకాన
బుట్టఁజేసితి వేల ? భోగిశయన !
అబ్జదళనేత్ర ! నాతండ్రి వైన ఫలము
నేరములు గాఁచి రక్షించు ; నీవె దిక్కు. భూ... 33

ధీరతఁ బరుల నిందింప నేర్చితిఁ గాని,
తిన్నగా నినుఁ బ్రస్తుతింప నైతిఁ ;

బొరుగు కామినులందు బుద్ధి నిల్పితి(గాని,
నిన్ను సంతతము ధ్యానింప నైతి(;
బొరుగు ముచ్చట లైన మురిసి వింటిని గాని,
యెంచి నీకథ లాలకించ నైతి(;
గొతుకంబున(బాతకము గడించితి(గాని,
హెచ్చు పుణ్యము సంగ్రహింప నైతి ;
నవనిలో నేను జన్మించినందు కేమి
సార్థకము గానరా దాయె స్వల్ప మైన. భూ... 34

అంత్యకాలమునందు నాయాసమున నిన్ను(
దల(తునో, తల(పనో ? తల(తు నిపుడె ;
నరసింహ ! నరసింహ ! నరసింహ ! లక్ష్మీశ !
దానవాంతక ! కోటిభానుతేజ !
గోవింద ! గోవింద ! గోవింద ! సర్వేశ !
పన్నగాధిపశాయి ! పద్మనాభ !
మధువైరి ! మధువైరి ! మధువైరి ! లోకేశ
నీలమేఘశరీర ! నిగమవినుత !
ఈ విధంబున నీనామ మిష్టముగను
భజన సేయుచు నుందు నాభాపమందు. భూ... 35

ఆయు రారోగ్య పుత్రార్థ సంపద లన్ని
గలుగ(జేసెడి భారక ర వీవె ;
చదువు లెస్సగ నేర్పి, సభలో గరిష్ఠాధి
కార మొందించెడి ఘను(డ వీవె ;
నడక మంచిది పెట్టి, నరులు మెచ్చెడునట్టి
పేరు రప్పించెడి పెద్ద వీవె ;
బలు వైన వైరాగ్య భక్తిజ్ఞానము లిచ్చి
ముక్తి(బొందించెడు మూర్తి వీవె ;

అవనిలో మానవుల కన్నియాస లిచ్చి
వ్యర్థులను జేసి, తెలిపెడివాఁడ వీవె భూ... 36

కాయ మెంత భయానఁ గాపాడినం గాని.
ధాత్రిలో నది చూడ దక్కఁబోదు;
ఏవేళ నేరోగ మేమరించునొ? సత్త్వ
మొందఁగఁ జేయు మేచందమునను;
ఔషధంబులు మంచి వనుభవించినఁ గాని,
కర్మ క్షీణం బైనఁ గాని విడదు;
కోటివైద్యులు గుంపు గూడి వచ్చినఁ గాని
మరణ మయ్యెడు వ్యాధి మాన్పలేరు;
జీవుని ప్రయాణ కాలంబు సిద్ధ మైన,
నిలుచునా దేహ మిం దొక్కనిమిష మైన? భూ... 37

జందె మింపుగ వేసి సంధ్య వార్చిన నేమి?
బ్రహ్మ మందక కాఁడు బ్రాహ్మణుండు;
తిరుమణి శ్రీచూర్ణ గురుతేఖ లిడినను.
విష్ణు నొందక కాఁడు వైష్ణవుండు;
బూదిని నుదుటను బూసికొనిన నేమి?
శంభు నొందక కాఁడు శైవజనుఁడు;
కాషాయవస్త్రాలు గట్టి, కప్పిన నేమి?
యాశ పోవక కాఁడు యతివరుండు;
ఇట్టి లౌకిక వేషాలు గట్టుకొనిన,
గురుని జెందక సన్ముక్తి దొరకఁబోదు భూ... 38

నరసింహ! నే నిన్ను నమ్మినందుకుఁ జాల
నెనరు నాయం దుంచు నెమ్మనమున;
నన్ని వస్తువులు నిన్నడిగి వేసట పుట్టె;
నింక నైనఁ గటాక్ష మియ్య వయ్య?

సంతసంబున నన్ను స్వర్గమందే యుంచు.
భూమియందే యుంచు భోగిశయన!
సయముగా వైకుంఠనగరమందే యుంచు,
నరకమందే యుంచు నళిననాభ!
ఎచట నన్నుంచినం గాని యెపుడు నిన్ను
మఱచిపోకుండ నీ నామ స్మరణ నొసఁగు భూ... 39

దేహ మున్నవఱకు మోహసాగరమందు
మునుఁగుచుందురు శుద్ధమూఢజనులు;
సలలితైశ్వర్యముల్ శాశ్వతం బనుకొని,
షడ్భ్రమలను మానఁజాల రెవరు;
సర్వకాలము మాయసంసార బద్ధు లై,
గురుని కారుణ్యంబుఁ గోరుకొనరు;
జ్ఞానశక్తి విరక్తు లైన పెద్దలఁ జూచి,
నిందఁ జేయక తాము నిలువలేరు;
మత్తు లైనట్టి దుర్జాతి మనుజు లెల్ల
నిన్ను గనలేరు మొదటికే నీరజాక్ష! భూ... 40

ఇలలోన నే జన్మ మెత్తినప్పటినుండి
బహు గడించితి నయ్య పాతకములు;
తెలిసి చేసితిఁ గొన్ని; తెలియఁజాలక చేసి
బాధ నొందితి నయ్య పద్మనాభ!
అనుభవించెడు నప్పు డతిప్రయాసం బంచుఁ
బ్రజలు చెప్పఁగఁ జాల భయము గలిగె;
నెగిరిపోవుటకునై యే యుపాయం బైనఁ
జేసి చూత మటన్న జేతకాదు;
సూర్యశశినేత్ర! నీచాటుఁ జొచ్చినాఁడ;
కలుషములు ద్రుంచి న న్నేలు కష్ట మనక. భూ... 41

తాపసార్చిత ! నేను పాపకర్ముఁడ నంచు
నాకు వంకలఁ బెట్టఁబోకు జుమ్మి ;
నాఁటికి శిక్షలు నన్ను చేయుటకంటె
నేఁడు సేయుము నీవు నేర్తు మనక ;
అతిభయంకరు లైన యమదూతలకు నన్ను
నొప్పగింపకు మయ్య యురగశయన !
నీ దాసులను బట్టి నీవ దండింపంగ
వద్దు వద్దన రెంత పెద్ద లైనఁ ;
దండ్రి వై నీవు పరపీడఁ దగులచేయ
వాసి గల పేరు కపకీర్తి వచ్చు నయ్య ! భూ... 42

ధరణిలోపల నేను తల్లిగర్భమునుండి
బుట్టినప్పటినుండి పుణ్య మెఱుఁగ ;
నేకాదశీవ్రతం బెన్నఁ డుండఁగ లేదు ;
తీర్థయాత్రల కైన దిరుగ లేదు ;
పారమార్థిక మైనపనులు సేయఁగ లేదు ;
భిక్ష మొక్కని కైన బెట్టలేదు ;
జ్ఞానవంతుల కైనఁ బూని మ్రొక్కఁగ లేదు ;
ఇతరదానము లైన నియ్య లేదు :
నళినదళనేత్ర ! నిన్ను నే నమ్మినాను ;
జేరి రక్షింపవే నన్ను శీఘ్రముగను. భూ... 43

అడవిపక్షుల కెవ్వఁ డాహార మిచ్చెను ?
మృగజాతి కెవ్వఁడు మేఁత బెట్టె ?
పనచరాదులకు భో జన మెవ్వఁ డిప్పించె ?
జెట్ల కెవ్వఁడు నీళ్లు చేఁది పోసె ?
స్త్రీలగర్భంబున శిశువు నెవ్వఁడు పెంచె ?
ఫణుల కెవ్వఁడు పోసె బరఁగ పాలు ?

మధుపాళి కెవ్వఁడు మకరంద మొసరించెఁ ?
బసుల కెవ్వఁ డొసంగెఁ బచ్చిపూరి ?
జీవకోట్లను బోషింప నీవె కాని,
వేఱె యొక దాత లేఁ డయ్య పెదకిచూడ. భూ... 44

దనుజారి ! నావంటి దాసజాలము నీకు
కోటిసంఖ్య గలారు కొదువ లేదు ;
బంట్లసందడివల్ల బహుపరా కై నన్ను
మఱచిపోకుము భాగ్యమహిమచేత ;
దండిగా భృత్యులు దగిలి నీ కుండంగ
బక్కబం బేపాటి పనికి నగును :
నీవు మెచ్చెడి పనుల్ నేను జేయఁగ లేక
యింత వృథాజన్మ మెత్తినాను ;
భూజనులలోన నే నప్రయోజకుఁడను
గనుక నీ సత్కటాక్షంబు గలుగఁజేయు. భూ... 45

కమలలోచన ! నన్ను గన్నతండ్రివి గాన
నిన్ను నేమఱకుంటి నేను విడక ;
యుదరపోషణకునై యొకరి నే నాశింప
నేర ; నా కన్నంబు నీవు నడపు ;
పెట్టలే నంటివా, పిన్న పెద్దలలోనఁ
దగవు కిప్పుడు దీయఁ దలఁచినాను :
ధనము భారం బై నఁ దలకిరీటము లమ్మ ;
కుండలంబులు పైఁడి గొలుసు లమ్మ ;
కొనకు నీ శంఖ చక్రముల్ కుదువఁ బెట్టి
గ్రాసము నొసంగి పోషించు కపట ముడిగి. భూ... 46

కువలయశ్యామ ! నీకొలువు చేసిన నాకు
జీత మెందుకు ముట్టఁ జెప్పవైతి ?

కువలయశ్యామ ! నీకొలువు చేసిన నాకు
జీత మొందుకు ముట్ట(జెప్పవైతి ?
మంచిమాటలచేత(గొంచె మియ్య(గ లేవు ;
కలహ మౌ ని(క(జుమ్మి ఖండితముగ ;
నీవు సాధువు గాన నింతపర్యంతంబు
చనువుచే నిన్నాళ్లు జరుపవలసె,
ని(క నే సహింప నీ విపుడు న న్నే మైన
శిక్ష చేసిన(జేయు సిద్ధ మయితి ;
నేడు కరుణింపకుంటివా నిశ్చయముగ
దెగ(బడితి(జూడు నీతోడ జగడమునకు, భూ... 47

హరి ! నీకు(బర్యంక మైన శేషు(డు చాల(
బవనము భక్షించి బ్రతుకుచుండు ;
ననువుగా నీకు వాహన మైన ఖగరాజు
గొప్ప పామును నోట గొఱుకుచుండు ;
నది గాక నీ భార్య యైన లక్ష్మీదేవి
దినము పేరంటంబు దిరుగుచుండు ;
నిన్ను భక్తులు పిల్చి నిత్యపూజలు చేసి
ప్రేమ(బక్వాన్నముల్ పెట్టుచుండ్రు ;
స్వస్థముగ నీకు గ్రాసము జరుగుచుండ(
గాసు నీచేతి దొక టైన గాదు వ్యయము. భూ... 48

పుండరీకాక్ష ! నా రెండు కన్నుల నిండ
నిన్ను(జూచెడి భాగ్య మెన్న(డయ్య ?
వాసిగా నా మనోవాంఛ దీరెడునట్లు
సొగసుగా నీరూపు చూప వయ్య !
పాపకర్ముని కంట(బడక పోవుద మంచు(
బరుష మైన ప్రతిజ్ఞ(బట్టినావె ?

వసుధలో(బతితపావను(డ వీ వంచు నే(
బుణ్యవంతులనోట(బొగడ వింటి ;
నేమిటికి విస్తరించె నీ కింత కీర్తి ?
ద్రోహి నైనను నా కీవు దొరకరాదె ? భూ... 49

పచ్చిచర్మపు(దిత్తి పస లేదు దేహంబు
లోపల నంతట రోయ రో(త ;
సరములు శల్యముల్ నవరంధ్రములు రక్త
మాంసంబు కండలు మైలతిత్తి ;
బలు వైన యెండ వానల కోర్వ దెం తైన
దాళలే దా(కలి దాహములకు ;
సకలరోగములకు సంస్థాన మయి యుండు ;
నిలువ నస్థిర మైన నీటిబుగ్గ ;
బొందిలో నుండు ప్రాణముల్ పోయినంత(
గాటికే గాని కొఱ గాదు గవ్వ కైన. భూ... 50

బలురోగములకు నీపాదతీర్థమె కాని,
వలపు మందులు నాకు వలదు వలదు ;
చెలిమి సేయుచు నీకు సేవ జేసెద(గాని,
నీ దాసకోటిలో నిలుప వయ్య !
గ్రహభయంబునకు(జక్రము(దలంచెద(గాని,
ఘోరరక్షలు గట్ట(గోర నయ్య !
పాముకాటుకు నిన్ను భజన(జేసెద(గాని
దానిమంత్రము నేను తలప(నయ్య !
దొరికితివి నాకు దండి వైద్యు(డవు నీవు ;
వేయికష్టాలు వచ్చిన వెఱువ నయ్య. భూ... 51

కూటికోసరము నే(గొఱగాని జనులచే(
బలు గద్దరింపులు పడ(గ వలసె ;

దారా సుత భ్రమ దగిలియుండఁగఁ గదా
దేశదేశములెల్లఁ దిరుగవలసెఁ ;
బెను దరిద్రత పైని బెనఁగియుండఁగ గదా
చేరి నీచుల సేవ చేయవలసె ;
నభిమానములు మది నంటియుండఁగఁగదా
పరులఁ జూచిన భీతి పడఁగవలసె ;
నిటుల సంసారవారిధి నీఁదలేక
వేయివిధముల నిన్ను నే వేఁడుకొంటి. భూ... 52

సాధు సజ్జనులతో జగడమాడిన గీడు,
కవులతో వైరంబు గాంచఁ గీడు,
పరనుదీనులఁ జిక్కఁ బట్టి కొట్టిన గీడు,
భిక్షగాండ్రను దుఃఖపెట్టఁ గీడు,
నిరుపేదలను జూచి నిందఁ జేసిన గీడు,
పుణ్యవంతులఁ దిట్టఁ బోసగుఁ గీడు,
సద్భక్తులను దిరస్కార మాడిన గీడు,
గురు ద్రవ్యము దోఁచుకొనిన గీడు,
దుష్టకార్యము లొనరించు దుర్జనులకు
ఘనతరం బైన నరకంబు గట్టిముల్లె. భూ... 53

పరుల ద్రవ్యముమీఁద భ్రాంతి నొందిన వాఁడు,
పరకాంతల నపేక్షపడెడు వాఁడు,
అర్థుల విత్తంబు లపహరించెడు వాఁడు,
దాన మియ్యంగ వద్దనెడు వాఁడు,
సభలలోపల నిల్చి చాటి చెప్పెడి వాఁడు,
పక్షపు సాక్ష్యంబు పలుకు వాఁడు,
విష్ణుదాసులఁ జూచి వెక్కిరించెడి వాఁడు
ధర్మసాధులఁ దిట్టఁ దలఁచు వాఁడు,

ప్రజల జంతుల హింసించు పాతకుండు
కాలకింకర గదలచే గట్ట మొందు. భూ... 54

నరసింహ ! నాతండ్రి ! న న్నేలు, న న్నేలు !
కామితారము లిచ్చి కావు కావు ;
దైత్యసంహార ! చాల దయ యుంచు, దయ యుంచు ;
దీనపోషక ! నీవె దిక్కు దిక్కు ;
రత్నభూషితవక్ష ! రక్షించు రక్షించు ;
భువనరక్షక ! నన్ను బ్రోవు బ్రోవు ;
మారకోటిస్వరూప ! మన్నించు మన్నించు !
పద్మలోచన ; చేయి పట్టు పట్టు ;
సురవినుత ! నేను నీచాటు జొచ్చినాను ;
నా మొ ఱాలించి కడతేర్చు నాగశయన ! భూ... 55

సీతక్తులను గనుల్ నిండ జూచియు రెండు
చేతుల జోహారు సేయు వాడు,
నేర్పుతో నెవ రైన నీకథల్ చెప్పంగ
వినయ మందుచు జాల వినెడి వాడు.
తన గృహంబునకు నీదాసులు రా, జూచి
పీటపై గూర్చుండ బెట్టు వాడు,
నీసేవకుల జాతినీతు లెన్నక చాల
దాసోహ మని చేర దలచు వాడు,
పరమభక్తుండు, ధన్యుడు భానుతేజ !
వాని గనుగొన్న బుణ్యంబు వసుధలోన. భూ... 56

పంజరంబున గాకి బట్టి యుంచిన లెస్స
పలుకునే విం తైన చిలుకవలెను ;
గార్దభంబును దెచ్చి కళ్ళె మింపుగ వేయ
దిరుగునే గుఱ్ఱంబు తీరుగాను :

ఎనుఁబోతు నొగి మావటీడు శిక్షించిన
నడుచునే మదవారణంబు వలెను ;
పెద్దపిట్టకు మేఁత బెట్టి పెంచిన గ్రొవ్వి
సాగునే వేఁటాడు డేగవలెను ;
కుజనులను దెచ్చి నీసేవకొఱకు బెట్ట
వాంఛతోఁ జేతురే భక్తవరులవలెను భూ... 57

నిగమాదిశాస్త్రముల్ నేర్చినద్విజుఁ డైన,
యజ్ఞకర్తగు సోమయాజి యైన,
ధరణిలోపలఁ బ్రభాత స్నానపరుఁ డైన,
నిత్యసత్కర్మాదినిరతుఁ డైన,
నుపవాసనియమంబు నొందు సజ్జనుఁ డైన,
గావివస్త్రముఁ గట్టు ఘనుఁడు నైన,
చండిషోడశ మహాదానపరుం డైన,
సకలయాత్రలు సల్పు సరసుఁ డైన,
గర్వమునఁ గష్టపడి నిన్నుఁ గాన కున్న
మోక్షిసామ్రాజ్య మొందఁడు మోహనాంగ ! భూ... 58

పక్షివాహన ! నేను బ్రతికి నన్నిదినాలు
కొండెగాండ్రను గూడి కుమతి నైతి;
నన్నవస్త్రము లిచ్చి యాదరింపుము నన్నుఁ;
గన్నతండ్రివి నీవె కమలనాభ !
మరణ మయ్యెడినాఁడు మమతతో నీయొద్ది
బంట్లఁదోలుము ముందు బ్రహ్మజనక ;
ఇనజఘటావళి యీడిచికొనిపోక
కరుణతో నాయొద్దఁ గావ లుంచు;
కొనకు నీసన్నిధికిఁ బిల్చుకొనియు నీకు
సేవకునిఁ జేసికొన వయ్య శేషశయన ! భూ... 59

నీకు దాసుఁడ నంటి, నిన్ను నమ్మిక యుంటిఁ
గాన నాపై నేఁడు కరుణఁ జూడు;
దోసి లొగ్గితి నీకు ద్రోహ మెన్నఁగ బోకు;
పద్మలోచన! నేను పరుఁడఁ గాను;
భక్తి నీపై నుంచి భజనఁ జేసెదఁ గాని,
పరుల వేడఁను జుమ్మి, వరము లిమ్ము;
దండిదాతవు నీవు తడవు సేయక కావు;
ఘోరపాతకరాశిఁ గొట్టి వైచి,
శీఘ్రముగఁ గోర్కి లీడేర్చు; చింత దీర్చు;
నిత్యమును నన్నుఁ బోషించు; నెనరు నుంచు. భూ... 60

విద్య నేర్చితి నంచు విఱ్ఱవీఁగఁగ లేదు;
భాగ్యవంతుఁడ నంచు బలుక లేదు;
ద్రవ్యవంతుఁడ నంచు దఱుచు నిక్కఁగ లేదు;
నియతి దానము లైన నెఱప లేదు;
పుత్రవంతుఁడ నంచు బొగడుచుండఁగ లేదు;
భృత్యవంతుడనంచు బొగడ లేదు,
కార్యవంతుఁడ నంచు సంతసింపఁగ లేదు;
కార్యవంతుఁడ నంచు గడప లేదు;
నలుగురికి మెప్పుగా నైన నడువ లేదు;
నళినదళనేత్ర ! నిన్ను నే నమ్మినాను. భూ... 61

అతిలోభులను భిక్ష మడుగఁ బోవుట రోఁత:
తనద్రవ్య మొక రింట దాఁచ రోఁత;
గుణహీనుఁ డగువాని కొలువుఁ గొల్చుట రోఁత;
యెరులపంచలక్రింద నుండ రోఁత;
భాగ్యవంతునితోడఁ బంత మాడుట రోఁత:
గుఱి లేనిబంధులఁ గూడ రోఁత;

ఆదాయములు లేక యప్పు దీయుట రోత;
జారచోరులఁ గూడి చనుట రోత;
యాదిలక్ష్మీశ ! నీబంట నైతి నయ్య !
యింక నెడఁబాఁపు జన్మం బదెన్న రోత. భూ... 62

వెట్టివానికి నేల వేదాక్షరంబులు ?
మోటువానికి మంచిపాట లేల ?
పసులకాఁపరి కేల పరతత్త్వబోధలు ?
విటకానికేటికో విష్ణుకథలు ?
వదరుబుంతల కేల వ్రాఁతపుస్తకములు ?
తిరుగుఁదిమ్మరి కేల దేవపూజ ?
ద్రవ్యలోభికి నేల దాతృత్వగుణములు ?
దొంగబంటుకు మంచి సంగ తేల ?
క్రూరజనులకు నీమీఁదఁ గోరి కేల ?
ద్రోహి పాపాత్మనకు దయాదుఃఖ మేల ? భూ... 63

నా తండ్రి ! నా దాత ! నాయిష్టదైవమా !
నన్ను మన్నన సేయు నారసింహా !
దయ యుంచు నామీఁదఁ దప్పు లన్ని క్షమించి;
నిగమగోచర !నాకు నీవె దిక్కు;
నేదురాత్మీఁడ నంచు నీమనంబునఁ గోప
గింపఁబోకుము స్వామి ! కేవలముగ;
ముక్తిదాయక ! నీకు మ్రొక్కినందుకు నన్నుఁ
గరుణించి రక్షించు కమలనాభ !
దండిదొర వంచు నీవెంటఁ దగిలినాను:
నేఁడు ప్రత్యక్ష మై నన్ను నిర్వహింపు. భూ... 64

వేమారు నీకథల్ వినుచునుండెడివాఁడు,
పరులముచ్చటమీఁద భ్రాంతి పడఁడు:

అగణితంబుగ నిన్ను(బొగడ నేర్చిన వా(డు,
చెడ్డమాటల నోడ(జెప్ప(బోడు;
ఆస క్తిచేత ని న్ననుసరించెడి వా(డు,
ధనమదాంధులవెంట(దగుల(బో(డు
సంతసంబున నిన్ను స్మరణ(జేసెడి వా(డు,
చెల(గి నీచులపేరు దల(ప(బో(డు;
నిన్ను నమ్మిన భక్తుండు నిశ్చయముగ(
గోరి చిల్లరవేల్పుల(గొల్వ(బో(డు. భూ... 65

నే నెంత వే(డిన నీకేల దయ రాదు ?
పలుమాఱు పిలిచిన(బలుక వేమి ?
పలికిన నీ కున్న పద వేమి పోవును ?
మో మైన(బొడచూప వేమి నాకు ?
శర ణు(జొచ్చినవాని సవరించవలె(గాక,
పరిహరించుట నీకు బిరుదు గాదు;
నీ దాసులను నీవు నిర్వహింపక యున్న(
బరు లెవ్వ రగుదురు పంకజాక్ష :
దాత దైవంబు తల్లియు(దండ్రి వీవె;
నమ్మియున్నాను నీ పాద నళినములను, భూ... 66

వేదముల్ చదివెడు విప్రవర్యుం డైన,
రణము సాధించెడు రాజు లైన,
వర్తక కృషికు(డౌ వైశ్యముఖ్యుం డైన(,
బరిచరించెడి శూద్రవర్య(డయిన,
మెచ్చు ఖడ్గము(బట్టి మెఱయుమ్లేచ్ఛుం డైన,
ప్రజల కక్క-అపడు రజకు(డైన,
చర్మ మమ్మెడు హీన చండాల నరు(డైన,
నీ మహీతలమందు నెవ్వ(డైన,

నిన్ను(గొనియాడు చుండెనా నిశ్చయముగ
వా(డు మోక్షాధికారి యీ వసుధలోన భూ... 67

సకల విద్యలు నేర్చి సభ జయింప(గ వచ్చు.
శూరు(డై రణమందు(బోరవచ్చు.
రాజరా జై పుట్టి రాజ్య మేల(గ వచ్చు.
హేమ గోదానంబు లియ్య వచ్చు.
గగనమం దున్న చుక్క-ల నెంచ(గా వచ్చు.
జీవరాసులపేళ్ళు చెప్పవచ్చు.
నష్టాంగయోగము లభ్యసింప(గ వచ్చు.
కఠిన మౌ రాల మింగంగ వచ్చు.
దామరసగర్భ హరపురందరుల కైన
నిన్ను వర్ణింప(దర మౌనె నీరజాక్ష! భూ... 68

నరసింహ! నీవంటి దొరను సంపాదించి,
కుమతి మానవుల నే(గొల్వ్యాల;
నెక్క-వై శ్వర్యంబు లియ్యలే కున్నను,
బొట్టకు మాత్రము పోయరాదె?
ఘనముగా దిది నీకు గరుణను బోషింపు;
గష్ట మెంతటి స్వల్ప కార్యమయ్య?
పెట్టజాలక యేల భిక్ష మెత్తించెదు?
నన్ను బీదను జేసినా వ దేమి?
విమల! కమలాక్ష! నే నిట్లు శ్రమపడంగ(
గన్నులకు(బండు వై నీకు(గాన(బడునె? భూ... 69

వసరుహనాభ! నీవంక(జేరితి నేను;
గట్టిగా ననుం(గావు కావు మనుచు
వచ్చినందుకువేగ వరము లియ్యక కాని,
లేవ(బోయిన నిమ్ను లేవ నియ్య(;

గూర్చుండ బెట్టి నీకొంగు గట్టిగ బట్టి
పుచ్చుకొందును జూడు భోగిశయన;
యీవేళ నీ కడ్డ మెవరు వచ్చినగాని,
వారికై నను లొంగి వడక బోను;
కోపగాడను నీవు నా గుణము దెలిసి,
యిప్పుడే నన్ను రక్షించి యేలుకొమ్ము. భూ... 70

ప్రహ్లాదు డేపాటి పై డికానుక లిచ్చె?
మదగజం బె న్నిచ్చె మౌ క్తికములు?
నారదుం డె న్నిచ్చె నగలు రత్నంబు? ల
హల్య నీ కేయగ్రహార మిచ్చె?
నుడుత నీ కేపాటి యూడిగంబులు చే సె?
ఘనవిభీషణు డేమి కట్న మిచ్చె
పంచపాండవు లేమి లంచ మిచ్చిరి నీకు?
ద్రౌపది నీకెంత ద్రవ్య మిచ్చె?
నీకు వీరందఱయి నట్లు నేను గాన?
యెందుకని నన్ను రక్షింప విందువదన! భూ... 71

వాంఛతో బలిచక్రవ ర్తి దగ్గఱ జేరి
భిక్ష మె త్తితి వేల బిడియపడక?
యడవిలో శబరి తియ్యని ఫలా లందియ్య
జేతు లొగ్గితి వేల సిగ్గుపడక?
వేడ్క-తో వేవేగ విదురు నింటికి నేగి
విందు గొంటి వ దేమి వెలితి పడక?
నటుకు లల్పము కుచేలుడు గడించుక చేర
బొక్క- సాగితి వేల లెక్క-గొనక?
భక్తులకు నీవు పెట్టుట భాగ్య మౌను;
వారి కాశించితివి తిండి వాడ వగుచు. భూ... 72

స్తంభమం దుదయించి దానవేంద్రునిఁ ద్రుంచి
కరుణతో బ్రహ్లాదుఁ గాచినావు:
మకరిచేఁ జిక్కి సామజము దుఃఖించంగఁ
గృప యుంచి వేగ రక్షించినావు;
శర ణంచు నా విభీషణుఁడు నీ చాటున
వచ్చి నప్పుడె లంక నిచ్చినావు;
ఆ కుచేలుఁడు చేరెఁడటుకు లర్పించిన
బహుసంపదల నిచ్చి పంపినావు;
వారివలె నన్నుఁ బోషింప వశము గాదె ?
యింత వలపఁ జేల ? శ్రీ కాంత ! నీకు. భూ... 78

వ్యాసుఁ డే కులమందు వాసిగా జన్మించె ?
విదురుఁ డేకులమందు వృద్ధిఁ బొందె ?
కర్ణుఁ డేకులమందు ఘనముగా వర్ధిల్లె ?
నా వసిష్ఠుం డెందు నవతరించె ?
నింపుగా వాల్మీకి యే కులంబునఁ బుట్టె ?
గుహుఁ డను పుణ్యుఁ డే కులమువాఁడు ?
శ్రీహరికుఁ డెచ్చటఁ జెలఁగి జన్మించెను ?
శబరి యే కులమందు జన్మ మొందె ?
నే కులంబున వీరంద పెచ్చినారు ?
నీకృపాపాత్రులకు జాతి నీతు లేల ?. భూ... 74

వసుధాస్థలంబున వర్ణహీనుఁడు గాని,
బహుళ దురాచార పరుఁడు గాని,
తడసి కా సియ్యని ధర్మశూన్యుఁడు గాని,
చదువ నేరని మూఢజనుఁడు గాని,
సకల మానవులు మెచ్చని కృతఘ్నుఁడు గాని,
చూడ సొంపును లేని కుంత గాని,

యప్రతిష్ఠలకు లో నైన దీనుఁడు గాని,
మొదటి కే మెఱుఁగని మోటు గాని,
ప్రతిదినము నీదు భజనచే బరగునట్టి
వాని కేవంక లే దయ్య ! వచ్చు ముక్తి. భూ... 75

ఇభకుంభములమీఁది కెగిరెడి సింగంబు
ముట్టునే కుఱుచైన మూషికమును ?
నవచూతపత్రముల్ నమలుచున్న పికంబు
గొఱుకునే జిల్లేడు కొనలు నోట ?
నరవింద మకరంద మనుభవించెడి తేఁటి
పోవునే పల్లేరు పూల కడకు ?
లలితమైన రసాల ఫలముఁ గోరెడి చిల్క
మెసవునే భ్రమత నుమ్మెత్తకాయ ?
నిలను నీ కీర్తనలు పాడ నేర్చినతఁడు
పరుల కీర్తనఁ బాడునే యరసి చూడ ?భూ... 76

సర్వేశ ! నీ పాద సరసిజద్వయమందుఁ
జిత్త ముంపఁగ లేను జెదరకుండ;
నీ వైన చయ యుంచి నిలిచి యుండెడునట్లు
చేసి నన్నిపు డేలు సేవకుఁడను ;
వనజలోచన ! నేను వట్టి మూర్ఖుఁడఁ జుమ్మి;
నీ స్వరూపముఁజూడ నేర్పు వేగ:
తన కుమారుల కుగు తలి పోసినయట్లు
భక్తిమార్గం బను పాలు పోసి,
ప్రేమతో నన్నుఁ బోషించి పెంచుకొనుము
ఘనత కెక్కించు నీదాస గణములోన. భూ... 77

జీమూతవర్ణ ! నీమోముతో సరి రాక
కమలారి యతికళంకమును బడసె;

సొగ సైన నీనేత్రయుగముతో సరి రాక
నళినబృందము నీళ్ళ నడుమ జేరె;
గరిరాజవరద ! నీ గళముతో సరి రాక
పెద్ద శంఖము బొబ్బ పెట్ట దొడగె;
శ్రీపతి ! నీదివ్య రూపుతో సరి రాక
పుష్పబాణుడు నీకు బుత్రు డయ్యె;
నిందిరాదేవి నిన్ను మోహించి విడక
నీకు బట్టంపుసతి యయ్యె నిశ్చయముగ.భూ... 78

హరిదాసులను నింద లాడకుండిన జాలు,
సకల గ్రంథమ్ములు చదివినట్లు;
భిక్ష మియ్యంగ దప్పింప కుండిన జాలు
జేముట్టి దానంబు చేసినట్లు;
మించి సజ్జనుల వంచింపకుండిన జాలు,
నింపుగా బహుమాన మిచ్చినట్లు;
దేవాగ్రహారముల్ దీయ కుండిన జాలు.
గనకకంబపు గుళ్ళు గట్టినట్లు;
ఒకరి వర్ణాశనము ముంచ కున్న జాలు,
బేరు కీర్తిగ సత్రముల్ పెట్టినట్లు. భూ... 79

ఇహలోకసౌఖ్యము లిచ్చ గించెద మన్న
దేహ మెప్పటికి దా స్థిరత నొంద:
దాయుష్య మున్న పర్యంతంబు పటుతయు
నొక్కతీరున నుండ దుర్వీలోన!
బాల్యయౌవన సుదుర్భల వార్ధకములను
మూటిలో మునిగెడి ముటికికొంప;
భ్రాంతితో దీని గాపాడుద మనుకొన్న;
గాలమృత్యువుచేత గోలుపోవు;

నమ్మరా దయ్య ! యిది మాయ నాటకంబు;
జన్మ మిఁక నొల్ల; న న్నేలు జలజనాభ ! భూ... 80

భావంబు నీ నామభజన గోరుచు నుండు;
జిహ్వా నీకీర్తనల్ చేయఁ గోరు;
హస్తయుగ్మంబు ని న్నర్చింపఁ గోరును;
కర్ణముల్ నీమీ ది కథలు గోరు;
తనువు నీ సేవయే ఘనముగాఁ గోరును;
నయనముల్ నీ దర్శనంబుఁ గోరు;
మూర్ధమ్ము నీ పదంబుల మ్రొక్కఁగాఁ గోరు;
నాత్మ నీ దై యుండు నరసి చూడ;
స్వప్నముల నైన నేవేళ సంతతమును
బుద్ధి నీపాదములయందుఁ బూని యుండు. భూ... 81

పద్మాక్ష మమతచేఁ బరము నందెద మంచు
విఱ్ఱవీఁగుదు మయ్య వెఱ్ఱిపట్టి;
మా స్వతంత్రం బైన మదము కండ్లకుఁ గప్పి
మొగము పట్టదు కామ మోహమునకు;
బ్రహ్మదేవుం డైనఁ బైఁడి దేహము గల్గఁ
జేసివేయక మమ్ముఁ జెఱిచె నతఁడు;
తుచ్ఛ మైనటువంటి తో లెముకలతోడ
ముఱికి చెత్తలు చేర్చి మూట కట్టె;
ఈ శరీరాలు పడిపోవు నెఱుఁగ కేము
కాముకుల మైతి; మిఁక మిమ్ముఁ గానలేము. భూ... 82

గరుడవాహన ! దివ్య కౌస్తుభాలంకార !
రవికోటితేజ ! సారంగవదన !
మణిగణాన్విత హేమ మకుటాభరణ ! చారు
మకరకుండల లసన్మందహాస !

కాంచనాంబర ! రత్న కాంచీవిభూషిత !
సురవరార్చిత ! చంద్ర సూర్యనయన
కమలనాభ ! ముకుంద ! గంగాధరస్తుత !
రాక్షసాంతక ! నాగ రాజశయన !
పతితపావన ! లక్ష్మీశ ! బ్రహ్మజనక !
భక్తవత్సల ! సర్వేశ ! పరమపురుష !...భూ 83

పలుమారు దశరూపములు ధరించితి వేల ?
నేకరూపము(బొంద వేల నీవు ?
నయమున క్షీరాబ్ధి నడుమ(జేరితి వేల ?
రత్నకాంచన మందిరములు లేవె ?
పన్నగేంద్రుని మీ(ద(బవ్వళించితి వేల ?
జలతారు పట్టెమంచములు లేవె ?
పెక్కలు గల పక్షి నెక్కసాగితి వేల ?
గజతురం గాందోళికములు లేవె ?
వనజలోచన ! యిటువంటి వైభవములు
సొగసుగా నీకు(దో(చెనో ? సుందరాంగ ! భూ... 84

తిరుపతి స్థలమందు దిన్న(గా నే నున్న
వేంకటేశు(డు మే(త వేయలే(డె ?
పురుషోత్తమమునకు(బోయిన(జాలు జ
గన్నాథు(డన్నంబు(గడపలే(డె ?
శ్రీరంగమునకు నే(జేరబోయిన(జాలు
స్వామి గ్రాసము పెట్టి సా(క లే(డె ?
కాంచీపురములోన(గదిసి నే కొలు వున్న
గరివరదు(డు పొట్ట గడప లే(డె ?
యెందు(బోవక నేను నీ మందిరమున
నిలిచితిని; నీకు నామీ(ద నెనరు లేదు. భూ... 85

తార్క్ష్యవాహన ! నీవు దండిదాత వ టంచు
గోరి వేడుక నిన్ను గొల్వవచ్చి
యర్థి మార్గమును నే ననుసరించితి నయ్య !
లా వెనుబదినాల్గు లక్ష లైన
వేషముల్ వేసి నా విద్యాప్రగల్భత
జూప సాగితి నీకు సుందరాంగ !
యానంద మైన నే నడుగవచ్చిన దిచ్చి
వాంఛ దీర్పుము నీలవర్ణ !వేగ;
నీకు నా విద్య హర్షంబు గాక యున్న
తేపతేపకు వేషముల్ దేను జూమ్మి ! భూ... 86

ఆమరేంద్రవినుత ! నే నతి దురాత్ముడ నంచు
గలలోన నైనను గనుల బడవు ;
నీవు ప్రత్యక్ష మై నిలువ కుండిన మానె
దొడ్డగా నొక యుక్తి దొరకె నయ్య !
గట్టికొయ్యను దెచ్చి ఘనముగా ఖండించి,
నీ స్వరూపము చేసి నిలుపుకొంచు,
ధూప దీపము లిచ్చి తులసితో బూజించి
నిత్య నైవేద్యముల్ నేమముగను,
నడుపుచును నిన్ను గొలిచెద నమ్మి బుద్ధి
నీ ప్రపంచంబు గలిగె నా కింతె చాలు. భూ... 87

భువనేశ గోవింద ! రవికోటిసంకాశ !
పక్షివాహన ! భక్తపారిజాత !
యంభోజభవ రుద్ర జంభారి సన్నుత :
సామగానవిలోల ! సారసాక్ష !
వనధిగంభీర ! శ్రీవత్సకౌస్తుభవక్ష !
శంఖ చక్ర గదాఽసి శార్ఙ్గ హస్త !

దీనరక్షక ! వాసుదేవ ! దైత్యవినాశ !
నారదార్చిత ! దివ్యనాగశయన !
చారునవరత్న కుండల శ్రవణయుగళ !
విబుధవందితపాదాబ్జ ! విశ్వరూప ! భూ... 88

నాగేంద్రశయన ! నీనామమాధుర్యంబు
మూఁడుకన్నుల సాంబమూర్తి కెఱుక ;
పంకజాతాక్ష ! నీబలపరాక్రమ మెల్ల
భారతీపతి యైన బ్రహ్మ కెఱుక ;
మధుకైటభారి ! నీమాయా సమర్థత
వసుధలో బలిచక్రవర్తి కెఱుక ;
పరమాత్మ ! నీ దగు పక్షపాతిత్వంబు
దశశతాక్షుల పురందరున కెఱుక ;
వీరి కెఱు కగు నీకథల్ వింత లెల్ల
నరుల కెఱు కన్న నెవ రైన నవ్విపోరె ! భూ... 89

అంద జే మైన ని న్నడుగ వచ్చేద రంచు
క్షీరసాగరమందుఁ జేరినావు ;
నీచుట్టు సేవకుల్ నిలువ కుండుటకు నై
భయదసర్పము మీఁదఁ బండినావు ;
భక్తబృందమువెంటఁ బడి చరించెద రంచు
నెగసి పోయెడి పక్షి నెక్కినావు ;
మౌనులు నీద్వార మాసింప కుంటకు
మంచియోధుల కావ లుంచినావు ;
లావుగలవాఁడ వైతి ; వేలాగు నేను
నిన్నుఁ జూతును ; నాతండ్రి ! నీరజాక్ష ! భూ... 90

నీకథల్ చెవులలో నోఁకుట మొదలుగాఁ
బులకాంకురము మేనఁ బుట్టువాఁడు,

నయ మైన నీదివ్య నామకీ ర్తనలోన
మగ్నుఁ డై దేహంబు మఱచువాఁడు,
ఫాలంబుతో నీదు పాదయుగ్మమునకుఁ
బ్రేమతో దండ మర్పించువాఁడు,
హా పుండరీకాక్ష ! హా రామ ! హరి ! యంచు
వేడ్క-తోఁ గేకలు వేయువాఁడు,
చిత్తకమలంబునను నిన్ను జేర్చువాఁడు,
నీదులోకంబునం దుండు నీరజాక్ష ! భూ... 91

నిగమగోచర ! నేను నీకు మె ప్పగునట్లు
లెస్పగాఁ బూజింపలేను సుమ్మి !
నాకుఁ దోచిన భూషణములు పెట్టెద నన్నుఁ
గౌస్తుభమణి నీకుఁ గలదు ముందె ;
భక్ష్య భోజ్యముల నర్పణముఁ జేసెద నన్ను
నీవు పెట్టితి సుధ నిర్జరులకుఁ ;
గలిమి కొద్దిగఁ గానుకల నొసంగెద నన్ను
భార్గవీదేవి నీభార్య యయ్యె ;
నన్ను గలవాఁడ వఖిల లోకాధిపతివి ;
నీకు భూషాదులను పెట్ట నెంతవాఁడ ? భూ... 92

నవసరోజదళాక్ష ! నన్ను బోషించెడి
దాతవు నీ వంచు ధైర్యపడితి ;
నా మనంబున నిన్ను నమ్మినందుకుఁ దండ్రి !
మేలు నా కొనరింపు నీలదేహ !
భళిభళీ ! నీయంత ప్రభుపు నెక్కడఁ జూడఁ
బుడమిలో నీ పేరు పొగడవచ్చు ;
ముందుఁ జేసిన పాపమును నశింపఁగఁ జేసి,
నిర్వహింపుము నన్ను నేర్పుతోడఁ ;

బరమసంతోష మాయె నాప్రాణములకు
నీబుణము, దీర్చుకొననేర నీరజాక్ష ! భూ... 93

ఫణుల పుట్టలమీఁద బవ్వళించినయట్లు,
పులుల గుంపునఁ జేరఁ బోయినట్లు,
మకరివర్గం బున్న మడుఁగు జొచ్చినయట్లు,
గంగదాపున నిండ్లు గట్టినట్లు,
చెదలుభూమిని మంచిచాపఁ బఱచినయట్లు,
తోలుతిత్తిని బాలు పోసినట్లు,
వెఱ్ఱివానికి బహువిత్త మిచ్చినయట్లు,
కమ్మగుడిసె మందు గాల్చినట్లు,
స్వామి ! నీ భక్తవరులు దుర్జనులతోడఁ
జెలిమిఁ జేసిన యట్లైన జేటు వచ్చు. భూ... 94

దనుజసంహార ! చక్రధర ! నీకు దండంబు ;
లిందిరాధిప ! నీకు వందనంబు ;
పతితపావన ! నీకు బహు నమస్కారముల్ ;
నీరజాతదళాక్ష ! నీకు శరణు ;
వాసవార్చిత ; మేఘవర్ణ ! నీకు శుభంబు ;
మందరధర ! నీకు మంగళంబు ;
కంబుకంధర ! శార్ఙ్గధర ! నీకు భద్రంబు ;
దీనరక్షక ! నీకు దిగ్విజయము ;
సకల వైభవములు నీకు సార్వభౌమ !
నిత్యకల్యాణములు నగు నీకు నెపుడు ! భూ... 95

మత్స్యావతార మై మడుఁగులోపలఁ జొచ్చి,
సోమకాసురుఁ ద్రుంచి చోద్యముగను
దెచ్చి వేదము లెల్ల మెచ్చ దేవత లెల్ల
బ్రహ్మ కిచ్చితి వీవు భళి ! యనంగ ;

నా వేదముల నంది యాచార నిష్ఠల
ననుభవించుచు నుందు రవనిసురులు ;
సకలపాపంబులు సమసిపోవు నటంచు
మనుజు లందఱు నీదుమహిమఁ దెలియ
కుందు, రరవిందనయన ! నీయునికిఁ దెలియు
వారలకు వేగ మోక్షంబు వచ్చు ననఘ ! భూ... 96

కూర్మావతారి వై కుధరంబు క్రిందను
గోర్కెతో నుండవా కొమరు మిగుల ?
వారాహమూర్తి వై వనభూములను జొచ్చి
శిక్షింపవా హిరణ్యాక్షు నపుడు ?
నరసింహమూర్తి వై నరభోజను హిరణ్య
కశిపుని ద్రుంచవా కాంతి మీఱ ?
వామనరూపి వై వసుధలో బలిచక్ర
వర్తి నణంపవా వైర ముంచి ?
యిట్టి పను లెల్లఁ జేయఁగా నెవ్వరికిని
దగును నరసింహ ! నీ కిది దగును గాక ! భూ... 97

లక్ష్మీశ ! నీదివ్యలక్షణ గుణముల
వినఁజాల కెప్పుడు వెఱ్ఱి నైతి ;
నావెఱ్ఱిగుణములు నయముగా ఖండించి
నన్ను రక్షింపు మో నళిననేత్ర !
నిన్ను నే నమ్మితి నితరదైవముల నే
నమ్మ లే దెప్పుడు నాగళయన :
కాపాడినను నీవె ; కష్ట పెట్టిన నీవె ;
నీపాదకమలముల్ నిరతి నేను
నమ్మి యున్నాను ; నీపాదనళినభక్తి
వేగ దయ చేసి రక్షింపు వేదవేద్య ! భూ... 98

అమరేంద్రవినుత ! ని న్ననుసరించినవారు
ముక్తి బొందిరి వేగ ముదముతోడ ;
నీ పాదపద్మముల్ నెఱ నమ్మి యున్నాను,
నాకు మోక్షం బిమ్ము నళిననేత్ర !
కాచి రక్షించు నన్ గడతేర్చు వేగమే,
నీ సేవకునిఁ జేయు నిశ్చయముగఁ ;
గాపాడినను నీకుఁ గైంకర్య పరుఁడ నై
చెలఁగి నీ పనులను జేయువాఁడ ;
ననుచుఁ బలుమాఱు వేఁడెద నబ్జనాభ !
నాకుఁ బ్రత్యక్ష మగు నిన్నె నమ్మినాను భూ... 99

శేషప్ప యను కవి చెప్పిన పద్యముల్
చెవుల కానంద మై చెలఁగుచుండు ;
నే మనుజుం డైన నెలమి నీ శతకంబు
భక్తితో విన్న సత్ఫలము గలుగుఁ ;
జెలఁగి యీ పద్యముల్ చేర్చి వ్రాసినవారు
కమలాక్షు కరుణను గాంతు రెపుడు ;
నింపుగాఁ బుస్తకం బెపుడుఁ బూజించిన
దురితజాలంబులు తొలఁగిపోవు ;
నిద్ధి పుణ్యాకరం బని యెపుడు జనులు
కష్ట మనక పఠించినఁ గలుగు ముక్తి ;
భూషణవికాస ! శ్రీధర్మపుర నివాస !
దుష్టసంహార ! నరసింహ ! దురితదూర ! 100

సంపూర్ణము

భాస్కర శతకము

ఈశతకమును మారన కవి రచించినట్టి ప్రతీతి. భాస్కర శతక తాళ పత్ర ప్రతులు కొన్నిటిలో మారన వెంకయ్య కృత మని యుండుటచే, గత శతాబ్దిలోని బ్రౌన్ దొర అట్లు భావించినాడు. మారన యింటిపేరో, తండ్రి పేరో, కవిపేరో స్పష్టముగా తెలియుట లేదు. మార్కండేయ పురాణము నాంధ్రీకరించిన మారన కవి కలడు. కాని ఆత డీత డనుటకు వీలు లేదు. ఉభయులకును విశేష కాలవ్యత్యాస మున్నది. పైగా ఆతడు శతక మేమియు రచించినట్టు తెలియదు.

భాస్కర శతకము ఏకక ర్తృకము కా దని రెండు కథలు తెలుపుచున్నవి. మొదటిది ఒకానొక బ్రాహ్మణ పుత్రు లిరువురు భాగములు కుదరక, భాస్కరు డను ప్రభువుకడకు బోయి తగవు తీర్పు మని కోరిరి. కవితాప్రియు డైన భాస్కరుడు వారు విద్వత్కవు లని తెలిసికొని, చెరి యొక శతకము రచించి తెచ్చినపిదప తీర్పు చెప్పుదు ననెను. అవకాశము లే దని వారు విన్నపింపగా, ఒక్కశతక మైన రచించి ప్రభువు తెమ్మనెను. సోదరులు ప్రభువు సన్నిధిలో పూర్వార్ధ మొకడు, ఉత్తరార్ధము రెండవవాడును చెప్పుచు, శతకము పూరించిరి. ప్రభువు వారి సమాధాన పరచి, కొంత ద్రవ్యము కూడ బహూకరించి పంపె నట. ఈకథ విశ్వాసయోగ్యముగా లేదు. విరోధము కల సోదరులు పద్యము లలో పూర్వోత్తరార్ధ పూరణమున నైకమత్యముతో వ్యవహరించుట విచిత్రము. నిజ మగుచో పంపిణీలోకూడ సమాధాన మేల కలగరాదు? పూర్వార్ధముకన్న నుత్తరార్ధ రచనయే యెక్కువ సొగుసుగా నున్నది.

రెండవ కథ: బ్రాహ్మణపుత్రు లిరువురిలో పెద్దవాడు విద్వాంసుడు. చిన్నవాడు శ్రద్ధగా చదువక యూరక తిరుగుచుండ, పెద్దవా డొకనాడు తమ్ముని తో "నీవు విద్వాంసుడ వయిన పిదప ఇంటికి రావచ్చును" అని వానిని వెడల గొట్టెను. వాడు యాత్రికుల గుంపులో గలిసి కాశికి బోయి విద్వత్కవి యయి, ఇంటికి వచ్చి తలుపు తీయు మనెను. పరీక్షించిన పిదప తలుపు తీయ నెంచి అన్న పద్య పూర్వార్ధము చెప్పి, ఉత్తరార్ధము పూరింపు మనె నట. భాస్కరో

పాసకు డగు తమ్ముడు పద్యము పూరించుచు చివర భాస్కరా యని మకుట ముంచెను. ఇట్లు శతకము పూర్తియయిన పిదప అన్న తలపు తీసి, తమ్ము నాదరించెను.

ఈకథయు విశ్వాసయోగ్యము కాదు. తమ్ముని శక్తిని పరీక్షించుటకు రెండు మూడు పద్యములు చాలక శతకము నిండుగా కావలెనా?

ప్రతి పద్యమున పూర్వోత్తరార్ధములు అర్థాంతర న్యాసముతో దృష్టాంత ములతో నూతనముగా నుండుటవలన నిరువురుకవులు శతకమును రచించినట్లు కొందరు భ్రమపడి యుందురు. అంచుచే పై కథలు పుట్టి యుండ వచ్చును.

గ్రంథ మేకకవి విరచిత మనుటకు కారణములు:

శ్రీ గల భాగ్యశాలికడఁ జేరఁగ వత్తురు తారుఁ దారె దూ
రాగమనప్రయాసమున కాదట నోర్చియు నైన నిల్వ ను
ద్యోగము చేసి రత్న నిలయుం డని కాదె సమస్త వాహినుల్
సాగరుఁ జేరు పెల్ల మునిసన్నుత, మద్గురుమూర్తి భాస్కరా!

రాకొమరుల్ రసజ్ఞునిఁ దిరంబుగ మన్నన నుంచినట్లు భూ
లోకమునందు మూఢుఁ దమలోపల నుంపరు, నిక్కమే కదా!
చేకొని ముద్దుగాఁ జదువు చిల్కను బెంతురు గాక, పెంతురే
కాకము నెవ్వ రైన శుభకారణ, సన్మునిసేవ్య, భాస్కరా!

పై పద్యములలోని సంబోధనలు భగవత్పరములు, కాని ప్రభు పరములు గానేరవు. ప్రభువు మానవుడు, భాస్కరుడు మునిసన్నుతుడు, గురుమూర్తి, శుభకారణుడు. భాస్కరు డను ప్రభు పున్నట్లు కానబడదు. లేని ప్రభువును సంబోధించి రన్న సోదరులు కూడ లేనివారే!

ఇంచుక నేర్పు చాలక విహీనత జెందిన నాకవిత్వమున్
మించువహించె నీకతన మిక్కిలి: యెట్లన దోలుబొమ్మలన్
మంచివివేకి వాని తెరమాటున నుండి ప్రశస్తరీతి నా
డించిన నాడవే జనులడెందము నింపవె ప్రీతి భాస్కరా!

ఇందు నాకవిత్వము అని యుండుటచేత ఒక్కడే రచించె ననుట స్పష్టము.

ఏకకవిక ర్తృక మీశతక మనుటకు పుక్కిటిపురాణ కథ యొకటి కొంత బల మిచ్చుచున్నది.

సూర్యోపాసకు డైన కవి యొకడు అరణ్యములో రెండుచెట్ల కడ్డముగా దూలము కట్టి, 108 చేరులు కల ఉట్టి దానికి వ్రేలదీసి అందు గూరుచుండి భాస్కరు నుపాసించుచుండెను. భాస్కర భగవాను డతనిని పరీక్షింప నెంచి, దృష్టి పోగొట్టెను. కవి ఒక్కపద్యము చెప్పి ఒకచేరు కోయుచు, 108 పద్యము చెప్పి తుది చేరు కూడ కోసి వేసెను. నిరాలంబముగా నింగికిని భూమికిని నడుమ వ్రేలాడుచుండె నట. భాస్కరు డతనిభక్తికి మెచ్చి కోరినవరము లిచ్చె నట. కథ యెట్టిది యయినను, కవి యొకడే యనియు, సంబోధనము భాస్కరభగవానునకే యనియు స్పష్ట మగుచున్నది.

కవినివాసస్థానమును నిర్దేశించుటకు తగినయాధారములు లేవు. శతకము అకారాది క్రమముగా నిబద్ధ మయినను కవిపేరు కాని, యన్యవిషయములు గాని తెలియుట లేదు.

క్రూరమనస్కు లౌ పతుల గొల్చి వసించిన మంచివారికిన్
వారిగుణంబె పట్టి చెడువర్తన వాటిలు ; మాధురీజలో
దారలు గౌతమీ ముఖమహానదు లంబుధి గూడినంతనే
క్షారము జెందవే మొదలికట్టడ లన్నియు దప్పి భాస్కరా !

ఘనబలసత్త్వ మచ్చుపడ గల్గినవానికి హాని లేనిచో
దన దగుసత్త్వమే చెఱచు దన్ను, న డెట్లన నీరు లావుగా
గను వసియించినన్ జెరువుకట్టకు సత్త్వము చాల కున్నచో
గనుమలు పెట్టి నట్టనడిగండి తెగంబడ కున్నె భాస్కరా !

ఈపద్యములలో ఒకచోట గౌతమీ ముఖ మహానదు లనియు, మరియొకచో లావుగా అనియు కనబడుచున్నది. ఒకప్పు డొకడు నాతో "నిమ్మలో పుల్ల లావు" అన్నాడు ; అనగా నిమ్మకాయ ఊరుగాయలో పులుపు హెచ్చని అర్థము. అతడు విశాఖపట్టణము, శ్రీకాకులము మండలములలోని వాడు. లా వనగా హెచ్చని అర్థము కదా వీనిని బట్టి కవి గోదావరీ నదికి ఉత్తరభాగమునను, పై మండలములలోనూ నివసించి యుండును.

కొందరు భాస్కర శతకములోని భాషనుబట్టి కవి రాయలసీమవాడనియు, విశేషించి కడప మండలమువాడనియు ఒకప్పుడు వాదించినారు.

ఈశతకము అతిప్రాచీనము లైన తాటియాకులపై లిఖించి యున్నప్రతులలోకూడ లభ్య మగుచుండుటచే ప్రాచీన మైన దని చెప్పవచ్చును.

దక్షుడు లేని యింటికిఁ బదారము వేఁకొకచోటనుండి వే
లక్షలు వచ్చుచుండినఁ బలాయన మై చనుఁ గల్ల కాదు ప్ర
త్యక్షము వాగులున్ వఱద లన్నియు వచ్చిన నీరు నిల్చునే
యక్షయ మైన గండి తెగినట్టి తటాకములోన భాస్కరా !

ఈపద్యము అప్పకవీయమునం దుదాహరింపబడి యున్నది. అప్పకవి క్రీ.శ. 1660 శతాబ్దికి ఇంచుమించుగా పూర్వు డనవచ్చును.

వెట్టి - ఉచితము ; నిబద్ధి - సత్యము ; చేకురనోటు - చేకూరినదా ? ; చిల్లకిత్తు - ఇందుపగింజ ; కాకుచేసి - అగౌరవించి, చీకాకుపరిచి ; జతకాదు - జతపడదు, జరుగదు. ఈ ప్రయోగములను బట్టి కవి గోదావరీనదికి ఉత్తరదిక్కునే యుండెడివా డని నిర్ణయింపవచ్చును. ఈ ప్రయోగములు పై ప్రాంతములోనివే.

"ఓటిపుట్టి బుడుంగున మునుగ కుండునే ?" ఇందలి పుట్టిఅను పదమును తుంగభద్రవైపున వాడుదురు. పుట్టి యనగా తోలు కప్పిన గుండ్రని పేప కుటిక. నదులు దాటుట కుపయోగింతురు. గోదావరీ మండలములో కూడ "నీ పుట్టి ఏమి మునిగినది ?" అని వాడుదురు.

ఇందలి 76 పద్యము ఇరావత చరిత్రము.

91 పద్యము వేమన్న చెప్పిన 'చిత్తశుద్ధి గల్గి చేసిన పుణ్యంబు' అను పద్యమున కనుకరణము.

92 పద్యము సంస్కరింపని ఒకానొక చాటువున కనువాదము.

102 పద్యమున శకటరేఫ నియమము లేదు. పోతనామాత్యుని భాగవతము నీవిషయమున నంగీకరింపని అప్పకవికి ఇట్టిపద్యము గల శతకము ఎట్లు లాక్షణిక మైనదో !

శతకమునందలి కొన్ని పద్యములలో దృష్టాంతముల ముందు ప్రశ్న రూపము లగు అదెట్టు, ఎట్లు, అదెట్లకో అను శబ్దములు గలవు. వీనిని బట్టి ఒకరు ఇంకొకరిని ప్రశ్నించినట్టు తోపవచ్చును. ఇందువలన కవు లిద్దరేమో అను సంశయము తోపవచ్చును.

వలనుగ(గానలందు(బ్రతివర్షమునం బులి నాలుగైదు పి
ల్లల గను, దూడ నొక్కటి నిలం గను ధేనువు, రెండుమూ(డు నే(
డుల కటు లైన బెబ్బులికుటుంబము లల్పము లాయె ; నాలమం
దలు గడు వృద్ధి చెందవె ; యధర్మము ధర్మము(దెల్ప భాస్కరా !

తక్కిన పద్యములలో వలె గాక ఇందు దృష్టాంతము ముందే చెప్పి యున్నది. 103 వద్యము కూడ ఇట్లే యున్నది. కవు లిరువు రైనపక్షమున తక్కిన పద్యములలో వలెనే పూర్వభాగము చెప్పినకవి ఉత్తరభాగము చెప్పెడి కవికి వీనియందు కూడ తా విచ్చి యుండును. కావున కవి యొకడే.

ప్రాచ్యలిఖిత భాండాగారము 13_7_22 సంఖ్య గల భాస్కర శతకము తుదిలో నిట్లున్నది. భాగ్యచారిత్ర బడహైదరసాధ్య-

పుత్రసరసగుణసాంద్రా-
అవరంగ తగతు-
హాసురతానుసాధ్యా-

ఈపద్యశకలమున హైదరు ఔరంగజీబుల పేర్లు కనబడుచున్నది. ఈ పద్యము దేనిలోనిదో, దానియభిప్రాయ మేమో తెలియుట లేదు.

11_2_2 సంఖ్యలో ఇట్లున్నది :

ఇది శ్రీ సూర్యనారాయణ వరప్రసాదలబ్ధ కవితామహత్యమున మారవి కత్వంబును (కృతంబగు) భాస్కర శతకము. అష్టోత్తరశత (వృత్తములు) సంపూర్ణం, శ్రీ సూర్యనారాయణ సమర్పణ మస్తు !

కాని అందు 106 పద్యములే కలవు. తాటియాకుప్రతి యందలి పై గద్య వలన భాస్కరశతక కర్త సూర్యోపాసకు డనియు, తత్ప్రసాదలబ్ధ కవితా మహత్త్వముకలవా డనియు, కవినామము మారవి యనియు స్పష్టము. భారవి

వలె ఈతడు సూరవి అని పేరు పెట్టుకొన్నా డేమో. పెట్టుడుపే రైనచో కారణ మనూహ్యము. ఒకవేళ మారవి యన్నది "తఖల్లుస్" అగునేమో. మ - లక్ష్మీ; రవి - సూర్యనారాయణ అని పదవిభాగము చేసి, కవి లక్ష్మీనారాయణ అయి ఉండు నని ఊహింపవచ్చును. కాని ఈతిరుగుడుకన్న మారన అనుటయే సహజము.

ఈకవిపేరు మారన అనుటకన్న మారన వెంకయ్య అనుటయే సమంజస మనిపించును. మారన ఇంటిపేరు కావచ్చును; కాదా మారనకుమారుడు వెంకయ్య అనవచ్చును. వెంకయ్య, వెంకమ్మలు ఆంధ్రదేశమున నిండి యున్నారు.

శ్రీ

భాస్కర శతకము

శ్రీగల భాగ్యశాలికడఁ జేరఁగ వత్తురు తారు దారె దూ
రాగమన ప్రయాసమున కాదట నోర్చియు నైన నిల్వ ను
ద్యోగము చేసి రత్ననిలయుం డని కాదె సమస్తవాహినుల్
సాగరుఁ జేరు పెల్ల మునిసన్నుత మద్గురుమూర్తి భాస్కరా। 1

చ. అంగన సమ్మరాదు తనయంకెకు రాని మహాబలాఢ్యు వే
భంగుల మాయ లొడ్డి చెఱుపం దలపెట్టు వివేకి యైన సా
రంగధరుం బదంబులు కరంబులుఁ గోయఁగఁ జేసెఁ దొల్లి చి
త్రాంగి యనేకముల్ నుడువరాని కుయుక్తులు పన్ని భా... 2

చ. అక్కఱపాటు వచ్చు సమయంబునఁ జుట్టము లొక్క రొక్కరిం
మక్కువ నుద్ధరించుటలు మైత్రికిఁ జూడఁగ యుక్తమే సుమీ
యొక్కట నీటిలో మెరక నోడల బండ్లును బండ్ల నోడలున్
దక్కక వచ్చుచుండుట నిదానముగాదె తలంప భా ... 3

చ. అడిగిన యట్టి యాచకులయాశ లెఱుంగక లోభవర్తి యై
కడపిన ధర్మదేవత యొకానొకయప్పుడు సీదు వాని కె
య్యెడల న దెట్లు పాలు తమ కిచ్చునె యెచ్చట నైన లేఁగలం
గుడువఁగ నీనిచోఁ గెరలి గోవులు తన్ననుగాక భా ... 4

చ. అతిగుణహీనలోభికిఁ బదార్థము గల్గిన లేకయుండినన్
మితముగఁ గాని కల్మి గలమీఁదట నైన భుజింపఁ డింపుగా
సత మని నమ్మి దేహమును సంపద నేఱులు నిండి పాఱినన్
గతుకఁగ జూచుఁ గుక్క తనకట్టడ మీఱిక యెందు భా ... 5

చ. అదను దలంచి కూర్చి ప్రజ నాదర మొప్ప విభుండు కోరినన్
గదివి పదార్థ మిత్తు రటు కానక వేగమె కొట్టి తెం డనన్

మొదటికి మోస మౌఁ బొదుఁగు మూలము గోసినఁ బాలు గల్గునే
పిదికినఁ గాక భూమిఁ బఱుబృందము నెవ్వరి కైన భా ... 6

చ. అనఘుని కైనఁ జేకురు ననర్ఘుని గూడి చరించినంతలో
మన మెరియింగ నప్పు డవమానము కీడు ధరిత్రియందు నే
యనువున నైనఁ దప్పవు యథార్థము తా నది యెట్టు లన్నచో
నినుమునుగూర్చి యగ్ని నలయింపదె సమ్మెటపెట్టు భా ... 7

చ. అలఘుగుణ ప్రసిద్ధుఁ డగు నట్టి ఘనుం డొకఁ డిష్టుఁ డై తనున్
వలచి యొకింత కే మిడిన వానికి మిక్కిలి మేలు చేయఁగా
తెలిసి కుచేలుఁ డొక్కకొణి దెం డటుకుల్ దన కిచ్చినన్ మహా
ఫలదుఁడు కృష్ణుఁ డత్యధికభాగ్యము లాతని కీఁడె భా ... 8

చ. అవనివిభుండు నేరుపరి యై చరియించినఁ గొల్చువార లె
ట్లవగుణు లైన నేమి పను లన్నియు జేకుఱు వారిచేతనే
ప్రవిమలనీతిశాలి యగు రామునికార్యము మర్కటంబులే
తవిలి యొనర్పవే జలధి దాఁటి సురారులఁ ద్రుంచి భా... 9

ఉ. ఆదర మింత లేక నరుఁ డాత్మ బలోన్నతి మంచివారికిన్
భేదము చేయుటం దనదు పేర్మికిఁ గీ డగు మూల మెట్లమ
ర్యాద హిరణ్యపూర్వకశి పన్ దనుజుండు గుణాఢ్యుఁ డైన ప్ర
హ్లాదున కెగ్గు చేసి ప్రళయంబును బొందఁడె మున్ను భా... 10

ఉ. ఆరయ నెంత నేరుపరి యై చరియించిన వానిదాపునన్
గౌరవ మొప్పఁ గూర్చు నుపకారి మనుష్యుఁడు లేక మేలు చే
కూర ద టెట్లు హత్తుగడ గూడునె చూడఁ బదాఱువన్నె బం
గారములోన నైన వెలిగారము గూడక యున్న భా ... 11

ఉ. ఈక్షితి నర్థకాంక్ష మది నెప్పుడు పాయక లోకు లెల్ల సం
రక్షకుఁ డైన సత్ప్రభునిరాకల గోరుదు రెందుఁ జంద్రికా
పేక్షఁ జెలంగి చంద్రుఁ డుదయించు విధంబునకై చకోరపుం
బక్షులు చూడవే యెదు రపారముదంబును బూ బిభా... 12

ఉ. ఈ జగమందు, దా మనుజు(డెంత మహాత్ము(డె యైన దైవ మా
తేజము తప్ప(జూచునెడ(ద్రిమ్మరి కోల్పడు నెట్ల నన్మహా
రాజకుమారు(డైన రఘురాము(డు కాల్నడ(గాయ లాకులున్
భోజన మై తగ న్వనికి(బోయి చరింప(డె మున్ను భా... 13

చ. ఉరుకరుణాయుతుండు సమయోచిత మాత్మ(దలంచి యుగ్రవా
క్పరుషత(జూపినన్ ఫలము గల్గుట తథ్యము గాదె యంబుదం
బురిమిన యంతనే కురియ కుండునె వర్షము లోకరక్షణ
స్థిరతర పౌరుషంబున నశేషజనంబు లెఱుంగ భా... 14

చ. ఉరుగుణవంతు(డొండు తన కొం డపకారము సేయునప్పుడుం
బరహితమే యొనర్చు నొకపట్టున నైనను గీడు(జేయ(గా
నెఱు(గడు నిక్కమే కద య దెట్లన(గవ్వము బట్టి యెంతయున్
దరువ(గ(జొచ్చినం బెరు(గు తాలిమి నీయదె వెన్న భా... 15

చ. ఉరుబలశాలి నంచు(దను నొల్లని యన్యపతివ్రతాంగనా
సురతము గోరునే కడ సు మ్మని భూతికి(బ్రాణహాని యౌ
శిరములు గూల రాఘవునిచే దశకంఠు(డు ద్రుంగి పోవ(డే
యెఱు(గక సీత కాసపడి యిష్టుల భృత్యుల(గూడి భా... 16

ఉ. ఊరక వచ్చు(బాటుపడ కుండిన నైన ఫలం బదృష్ట మే
పార(గ(గల్గువానికి(బ్రయాసము నొందిన దేవదానవుల్
వారటు లుండ(గా నడుమ వచ్చినశౌరికి(గల్గె(గాదె శృం
గారపు(బ్రోవు లక్ష్మియును(గౌస్తుభరత్నము రెండు భా... 17

ఉ. ఊరక సజ్జనుం డొదిగి యుండిన నైన దురాత్మకుండు ని
ష్కారణ మోర్వ లేక యపకారము చేయుట వానివిద్య గా
చీరలు నూఱుటంకములు చేసెడి వైనను బెట్టె నుండ(గా
జేరి చినింగిపో(గొఱుకు చిమ్మట కేమి ఫలంబు భా... 18

ఉ. ఎట్టుగ(బాటుపడ్డ నొకయించుక ప్రాప్తము లేక వస్తువుల్
పట్టుపడంగ నేరవు నిబద్ధి సురావళి(గూడి రాక్షసుల్

గట్టు పెకల్చి పాల్కడలి గవ్వము చేసి మధించి రంతయున్
వెట్టియ కాక యే మనుభవించిరి వా రమృతంబు భా... 19

చ. ఎడపక దుర్జనుం డొరుల కెంతయు గీ డొనరించు గాని యే
యెడలను మేలు సేయ డొక యించుక యైనను జీడపుర్వు దా
జెడ దిను నంతె కాక పుడిసెండుజలం బిడి పెంపనేర్చునే
పొడ వగుచున్న పుష్పఫల భూరుహ మొక్కటి నైన భా... 20

ఉ. ఎడ్డెమనుష్యు డే మెఱుగు నెన్ని దినంబులు గూడి యుండినన్
దొడ్డగుణాఢ్యునందు గల తోరపు వర్తన లెల్ల బ్రజ్ఞ నే
ర్పడ్డ వివేకికీతి రుచిపాకము నాలుక గా కెఱుంగునే
తెడ్డది కూరలో గలయ ద్రిమ్మరుచుండిన నైన భా... 21

ఉ. ఎప్పు డదృష్టతామహిమ యించుక పాటిలు నప్పు డింపు సొం
పొప్పుచు నుండు గాక యది యొప్పని పిమ్మట రూపు మాయగా
నిప్పున నంటియున్న యతినిర్మలినాగ్ని గురు ప్రకాశముల్
దప్పిన నట్టిబొగ్గునకు దా నలు పెంతయు బుట్టు భా... 22

ఉ. ఏగతి బాటుపడ్డ గలదే భువి నల్పునకున్ సమగ్రతా
భోగము భాగ్యరేఖ గల పుణ్యునకున్ బలె భూరిసత్త్వసం
యోగమదేభకుంభయుగళోత్థితమాంసము నక్కకూన కే
లాగు ఘటించు సింహము దలంచిన జేకుఱు గాని భా... 23

ఉ. ఏడ ననర్హు డుండు నట కేగు ననర్హుడు నర్హుడు న్నచో
జూడగ నొల్ల డెట్లన నశుద్ధగుణస్థితి నీగ పూయముం
గూడిన పుంటిపై నిలువ గోరినయట్టులు నిల్వనేర్చునే
సూడిద బెట్టు నెన్నుదుటి చొక్కపు గస్తురిమీద భా... 24

ఉ. ఏల సమస్తవిద్యల నొకించుక భాగ్యము గల్గియుండినన్
జాలు ననేకమార్గములు సన్నుతి కెక్క న దెట్లొకో యనన్
బాలకు నేడ విద్యలు తిరంబుగ దేవరరూపు చేసినన్
వ్రాలి నమస్కరించి ప్రసవంబులు వెట్టరె మీద భా... 25

ఉ. ఒక్కడె చాలు నిశ్చలబలోన్నతుఁ డెంతటి కార్య మైనఁ దాఁ
జిక్కఁ నొనర్పఁ గౌరవు లసంఖ్యులు పట్టినధేనుకోటులం
జిక్కఁగ నీక తత్ప్రబలసేన ననేక శిలీముఖంబులన్
మొక్కపడంగఁ జేసి తుద ముట్టఁడె యొక్కకిరీటి భా... 26

ఉ. కట్టడ దప్పి తాము చెడుకార్యముఁ జేయుచునుండిరేని దో
బుట్టినవారి నైన విడిపోవుట కార్యము దౌర్మదాంధ్యముం
దొట్టిన రావణాసురునితో నెడఁబాసి విభీషణాఖ్యుఁ డా
పట్టున రాముఁ జేరి చిరపట్టము గట్టుకొనండె భా... 27

ఉ. కట్టడ యైన యట్టి నిజకర్మము చుట్టుచు వచ్చి యేగతిం
బెట్టునొ పెట్టిన ట్లనుభవింపక తీఱదు కాళ్లు మీఁదుగాఁ
గిట్టక వ్రేలుఁ డంచుఁ దల క్రిందుగఁ గట్టిరె యెవ్వరైన నా
చెట్టున గబ్బిలంబులకుఁ జేరిన కర్మము గాక భా... 28

ఉ. కట్టడ నైనికాలములఁ గాదు శుభం బొరు లెంత వారు చే
పట్టిన నైన మర్త్యునకు భాగ్యము రా దను మెల్లఁ గల్ల కా
దె ట్టని పల్కినన్ దశరథేశ వసిష్ఠులు రామమూర్తికిన్
బట్టము కట్టఁ గోరి రది పాయక చేకుఱె నోటు భా... 29

ఉ. కానక చేరఁ బోల దతికర్కఁడు నమ్మిక లెన్ని చేసినం
దా నది నమ్మి వానికడ దాయగ బోయిన హాని వచ్చు న
చ్చో నది యె ట్లనం గొఱఁకు చూపుచు నొడ్డినబోను మేలుగాఁ,
బో నని కాన కాసపడి పోవుచుఁ గూలదె కొక్కు భా... 30

ఉ. కానిప్రయోజనంబు సమకట్టదు తా భువి నెంత విద్య వాఁ
డైనను దొడ్డరాజు కొడు కైన న దెట్లు మహోపపట్టి వి
ద్యానిధి సర్వవిద్యలకుఁ దానె గురుండు వినాయకుండు దా
నేనుఁగురీతి నుండియు న దేమిటి కాడఁడు పెండ్లి భా... 31

ఉ. కామితవస్తుసంపదలు గల్గు ఫలం బొరు లాసపడ్డచో
నేమియుఁ బెట్టడేని సిరి యేటికి నిష్ఫల మున్నఁ బోయినన్

భ్రామిక పడ్డలోకులకు బండగ నేమది యెండిపోవగా
నేమి ఫలంబు చేదు విడ దెన్నటి కైన ముసిండి భా... 32

ఉ. కారణ మైన కర్మములు కాక దిగంబడ వెన్ని గొందులం
దూరిన నెంతవారలకు దొల్లి పరీక్షితు శాపభీతు డై
వారధి నొప్పునుప్పరిగపై బదిలంబుగ దాగి యుండినం
గ్రూరభుజంగదంతహతి గూలడె లోకు లెఱుంగ భా... 33

చ. కులమున నక్కడ నకుంఠితధార్మికు డొక్కడొక్కడే
కలిగెడు గాక పెందఱుచు గల్గగ నేరరు చెట్టుచెట్టునన్
గలుగగ నేర్చునే గొడుగుకామలు చూడగ నాడనాడ నిం
పలరగ నొక్కటొక్కటి నయంబున జేకుఱుగాక భా... 34

ఉ. క్రూరమనస్కు లౌ పతుల గొల్చి వసించిన మంచివారికిన్
వారిగుణంబె పట్టి చెడువర్తన వాటిలు మాధురీజలో
దారలు గౌతమీముఖ మహానదు లంబుధి గూడినంతనే
క్షీరము జెందవే మొదలికట్టడ లన్నియు దప్పి భా... 35

ఉ. గిట్టుట కేడ గట్టడ లిఖించును నచ్చట గాని యెండుచో
బుట్టదు చావు జానువుల పున్కల నూడిచి కాశి జావ గా
లట్టినశూద్రకున్ భ్రమల గప్పుచు దద్విధి గుట్టు మౌచు నా
పట్టున గొంచు మట్టికడ బ్రాణము తీసెగ దయ్య భా... 36

చ. ఘనబలసత్త్వ మచ్చుపడ గల్గినవానికి హాని లేనిచో
దన దగుసత్త్వమే చెఱుచు దన్ను న దెట్టిన నీరు లావుగా
గను వసియించినన్ జెరువుగట్టకు సత్త్వము చాల కున్నచో
గనుమలు పెట్టి నట్టనడిగండి తెగంబడ కున్నె భా... 37

చ. ఘను డగునట్టివాడు నిజకార్యసముద్ధరణార్థ మై మహిం
బనివడి యల్పమానవుని ప్రార్థన చేయుట తప్పు గాదుగా
యనఘత గృష్ణజన్మమున నావసుదేవుడు మీద నెత్తుగా
గనుగొని గాలిగానికడ కాళ్ళకు మ్రొక్కడె నాడు భా... 38

చ. ఘను డొకవేళ గీడ్పడిన గ్రమ్మఱ నాతని లేమి వాపగా
గను గొన నొక్కసత్ర్పభువు గాక నరాధము లోప రెందఱుఁ
బెనుచెఱు వెండినట్టితటి బెల్లున మేఘుడు గాక నీటితో
దనుప దుషారముల్ శతశతంబులు చాలు నటయ్య భా... 39

ఉ. చంద్రకళావతంసుకృప చాలనినాడు మహాత్ము డైన దా
సాంద్రవిభూతి బాసి యొక జాతివిహీనుని గొల్చియుంట యో
గీంద్రనుతాంఘ్రిపద్మ మతిహీనత నొందుట కాదు గా హరి
శ్చంద్రుడు వీరబాహుని నిజంబుగ గొల్వఁడె నాడు భా... 40

ఉ. చక్క దలంపఁగా విధివశంబున నల్పునిచేత నైన దా
జిక్కి యవస్థలం బొరలు జెప్పఁగ రాని మహాబలాఢ్యుఁడుఁ
మిక్కిలి సత్త్వసంపదల మీఱినగంధగజంబు మావటీ
డెక్కి యదల్చి కొట్టి కుదియించిన నుండడె యోర్చి భా... 41

చ. చదు వది యెంత గల్గిన రసజ్ఞత యించుక చాలకున్న నా
చదువు నిరర్థకంబు గుణసంయుతు లెవ్వరు మెచ్చ రెచ్చటం
బదనుగ మంచికూర నలపాకము చేసిన నైన నందు నిం
పొదవెడు నుప్పు లేక రుచి పుట్టఁగ నేర్చునటయ్య భా... 42

చ. చాలఁ బవిత్రవంశమున సంజనితుం డగునేని యెట్టి దు
శ్శీలుని నైన దత్కులవిశేషముచే నొకపుణ్యఁ డెంతయుం
దాలిమి నుద్ధరించును సుధానిధి బుట్టఁగ గాదె శంభు డా
హాలహలానలంబు గళమందు ధరించుట పూని భా... 43

ఉ. చేరి బలాధికుం డెటిఁగి చెప్పినకార్యము చేయకుండినఁ
బారము ముట్టలేఁ డొకనెపంబున దాఁ జెడు నెట్టి ధన్యుఁడున్
బోరక పాండుపుత్రులకు భూస్థలి భాగము పెట్టు మన్న కం
సారిని గాకుచేసి జెడఁడాయెనె కౌరవభర్త భా... 44

ఉ. చేసిన దుష్టచేష్ట నది చెప్పక నేర్పున గప్పిపుచ్చి తా
మూసిన యంతటఁ బయలు ముట్టక యుండ ద దెట్లు రాగిపై

బూసినబంగరుం జెదరిపోవఁ గడంగిన నాఁడు నాఁటికిన్
దాసినరాగి గానఁబడదా జను లెల్ల నెఱుంగ భా... 45

చ. తగిలి మదంబుచే నెదిరిఁ దన్ను నెఱుంగక దొడ్డవానితోఁ
బగ గొని పోరు సెల్ల నతిపామరుఁ డై చెడు టింతె కాక తా
నెగడి జయింపనేరఁ డది నిక్కము తప్పదు ధాత్రిలోపలన్
దెగి యొకకొండతోఁ దగరు దీకొని తాఁకిన నేమి భా... 46

చ. తడవఁగ రాదు దుష్టగుణ మొక్కటి దత్త్వ మెఱుంగక యెవ్వ రైన నా
చెడుగుణ మిట్లు వల్వ దని చెప్పిన గ్రక్కున గోపచిత్తుఁ డై
కడుఁ దెగఁజూచుఁగా మరుగఁ గాఁగిన తై లము నీటిబొట్టుపైఁ
బడునెడ నాక్షణం బెగసి భగ్గున మండక యున్నె భా... 47

చ. తనకు ఫలంబు రా దని యెదం దలపోయఁడు కీర్తి గోరు నా
ఘనగుణశాలి లోకహితకార్యము మిక్కిలి భార మైన మే
లనుకొని పూను శేషుఁడు సహస్రముఖంబుల గాలి గ్రోలి తా
ననిశము మోవఁడే మణి మహాభర మైన ధరిత్రి భా... 48

చ. తనకు సదృష్టరేఖ విశదంబుగఁ గల్గినఁ గాని లేనిచో
జనునకు నెయ్యెడ బరుల సంపదవల్ల ఫలంబు లేదు గా
కనుఁగవ లెస్సఁగా దెలిసి గల్గినవారికిఁ గాక గ్రుడ్డికిన్
గనుపడు నెట్లు వెన్నెలలు గాయఁగ నం దొకరూపు భా... 49

ఉ. తాలిమితోడుతం దగవు తప్పక నేర్పరి యొప్పు తప్పులం
బాలన సేయఁ గా కటనుపాయవిహీనుఁడు సేయనేర్చునే
పాలును నీరు వేరుపఱుపంగ మరాళ మెఱుంగుఁ గాక మా
ర్జాల మెఱుంగునే తదురుచారురసజ్ఞత బూనఁ భా... 50

ఉ. తాలిమితోడఁ గూరిమిఁ గృతఘ్నున కెయ్యెడ నుత్తమోత్తము
ల్మే లొనరించినన్ గుణము మిక్కిలి కీ డగుఁ బాము పిల్లకున్
బా లిడి పెంచిన న్విషము పాయఁగ నేర్చునె దానికోటలం
జాలగ నంతకంత కొకచాయను హెచ్చును గాక భా... 51

చ. తెలియనికార్య మెల్ల(గడతేర్చుట కొక్కవివేకి(జేకొనన్
వలయు న పైన దిద్దుకొనవచ్చు(ప్రయోజన మాంద్య మేమియుం
గలుగదు ఫాలమందు(దిలకం బిడునప్పుడు చేత నద్దమున్
గలిగిన(జక్క(జేసికొను(గాదె నరుం డది చూచి భా... 52

ఉ. దక్షు(డు లేనియింటికి(బదార్థము వేతొకచోటనుండి వే
లక్షలు వచ్చుచుండిన(బలాయన మై చను(గల్ల గాదు ప
త్యక్షము వా(గులున్ వఱద లన్నియు వచ్చిన నీరు నిల్చునే
యక్షయ మైనగండి తెగి నట్టి తటాకములోన భా... 53

ఉ. దానపరోపకారగుణధన్యత చిత్తములోన నెప్పుడున్
లేని వివేకశూన్యునకు లేములు వచ్చినవేళ సంపదల్
పూనినవేళ నొక్క సరి పోలును జీ(కున కర్ధరాత్రియం
దైన న దేమి పట్టవగ లైన న దేమియు లేదు భా... 54

ఉ. దానము సేయ(గోరిన వదాన్యున కీయ(గ శక్తి లేనిచో
నైన(బరోపకారమున కై యొకదిక్కున(దెచ్చి యైన నీ(
బూనును మేఘు(డంబుధికి(బోయి జలంబుల(దెచ్చి యీయ(డే
వాన సమస్తజీవులకు వాంఛిత మిం పెసలార భా... 55

ఉ. దానము చేయనేరని యధార్మికు సంపద యుండి యుండియున్
దానె పలాయనం బగుట తథ్యము బూరుగుమాను గాచినన్
దాని ఫలంబు లూరక వృథా పడిపోవవె యెండి గాలిచే(
గానలలోన నేమిటికి గాక యభోజ్యము లౌట భా... 56

చ. నడవక చిక్క లేమి యగునా(డు నిజోదర పోషణార్థమై
యడిగి భుజించుట ల్నరుల కారయ వ్యంగ్యము కాదు పాండవుల్
గడుబలశాలు లేవురు నఖండవిభూతి(దొలంగి భిక్షముల్
గుడువరె యేకచక్రపురి(గుంతియు(దా మొకచోట భా... 57

చ. నుడువుల నేర్పు చాలని మనుష్యు(డెరుంగక తప్పనాడినం
గడు(గృపతో(జెలంగుదురు కాని యదల్పరు తజ్జులెల్ల ద

ప్పడుగులు పెట్టుచు న్నడచుసప్పుడు బాలు ముద్దు సేయఁగాఁ
దొడఁగుదు రింతె కాని పడద్రోయుదురే యెవరైన భా... 58

ఉ. నేరిచి బుద్ధిమంతుఁ డతినీతి వివేకము దెల్పినం జెడం
గారణ మున్నవాని కది గైకొనఁగూడదు నిక్కమే దురా
చారుఁడు రావణాసురుఁ డసహ్యము నొందడె చేటు కాలముం
జేరువ యైననాడు నిరసించి విభీషణుబుద్ధి భా... 59

చ. నొరిగినవేళ నెంతటి ఘనుండును ద న్నొక రొక్కనేర్పుతో
నగపడి ప్రోది సేయక తనంతట బల్మికి రాఁడు నిక్క మే
జగమున నగ్ని యైనఁ గడు సన్నగిలంబడి యున్న నింధనం
బెగయఁగ ద్రోచి యూఁదక మ పెట్లు రవుల్కొన నేర్చు భా... 60

ఉ. పండితు లైనవారు దిగువం దగ నుండఁగ నల్పుఁ డొక్కఁ డు
ద్దండత బీత మెక్కిన బుధప్రకరంబుల క్షేమి యై గ్గగున్
గొం డొకకోఁతి జెట్టుకొనకొమ్మల నుండఁగ గ్రింద గండ భే
రుండమదేభ సింహనికురుంబము లుండవె చేరి భా... 61

ఉ. పట్టుగ నిక్కుచుఁ మదముఁ బట్టి మహాత్ముల దూలనాడినం
బట్టినకార్యముల్ చెడును బ్రాణము పోవు నిరర్ధదోషముల్
పుట్టు మహాత్ముఁ గా దని కుబుద్ధి నొనర్చిన యజ్ఞతంత్రముల్
ముట్టక పోయి దక్షునికి మోసము వచ్చెఁ గదయ్య భా... 62

చ. పరహిత మైన కార్య మతిభారము తోడిది యైనఁ బూను స
త్పురుషుఁడు లోకము ల్పొగడఁ బూర్వమునం దొక రాలవర్ష
మ్మురియఁగ జొచ్చినఁ గదిసి గొబ్బున గోజనరక్షణార్థమై
గిరినొక కేల నెత్తె నఁట కృష్ణుఁడు ఛత్రము భాతి భా... 63

చ. పలుచని సీచమానవుఁడు పాటిఁ దలంపక నిష్ఠురోక్తులం
బలుకుచునుండుఁ గాని మతిభాసురుఁ డైన గుణప్రపూర్ణుఁ డ
ప్పలుకుల బల్కఁబోవఁడు నిబద్ధిగ నెట్లన వెల్తికుండఁ దాఁ
దొలఁకుచునుండుఁ గాని మఱి దొల్కనె నిండుఘటంబు భా... 64

చ. పలుమఱు సజ్జనుండు ప్రియభాషలు పల్కఁ గఠోరవాక్యముల్
పలుకఁ డొకానొకప్పు డవి పల్కినఁ గీడును గాదు నిక్కమే
చలువకు వచ్చి మేఘుఁ డొకజాడను దా వడగండ్ల రాల్చినఁ
శిల లగు నోటు వేగిరమె శీతలనీరము గాక భా... 65

ఉ. పాపపుఁ ద్రోవవాని కొకపట్టున మేను వికాస మొందినన్
లోపల దుర్గుణంబె ప్రబలుం గద నమ్మఁగ గూడ దాతనిన్
బాపర కాయకున్ ననుపు పైపయిఁ గల్గినఁ గల్గు గాక నే
రూపున దానిలోఁ గల విరుద్ధపుఁ జేఁదు నశించు భా... 66

ఉ. పూనినభాగ్యరేఖ చెడిపోయిన పిమ్మట నెట్టినూనవుం
డైనను వాని నెవ్వరుఁ బ్రియంబున బల్కరు పిల్వ రెచ్చటం
దా నది యెట్లొకో యనినఁ దథ్యము పుష్పము వాడి వాసనా
హీనత నొంది యున్న యెడ నెవ్వరు ముట్టుదు రయ్య భా... 67

ఉ. పూరితసద్గుణంబు గల పుణ్యున కించుక రూపసంపదల్
దూరము లైన వానియెడ దొడ్డగఁ జూతురు బుద్ధిమంతు లె
ట్లారయ గొగ్గు లైన మఱి యందులమాధురిఁ జూచి కాదె ఖ
ర్జూరఫలంబులుం బ్రియము జొప్పడ లోకులు గొంట భా... 68

ఉ. ప్రల్లఁదనంబుచే నెఱుకపా టొక యింతయు లేక యెచ్చటన్
బల్లిదుఁ డైన సత్ప్రభు నబద్ధము లాడినఁ ద్రుంగిపోదు రె
ట్లల్ల సభాస్థలిం గుమతు లై శిశుపాలుఁడు దంతవక్త్రుఁడుం
గల్లలు కృష్ణునిం బలికి కాదె హతం బగు టెల్ల భా... 69

ఉ. ప్రేమను గూర్చి యల్పునకుఁ బెద్దతనంబును దొడ్డవానికిం
దా మతితుచ్ఛపుంబని నెదం బరికింపక యీయరాదు గా
వామకరంబుతోడఁ గుడువం గుడిచేత నపానమార్గముం
దోమఁగ వచ్చునే మిగులఁ దోఁచనిచేఁతలు గాక భా... 70

ఉ. ఫల మతిసూక్ష్మ మైనను నృపాలుఁడు మంచిగుణాఢ్యుఁ డైనచో
నెలమి వివేకు లాతని కపేక్ష యొనర్తు ర దెట్లు చంద్రికా

విలసన మైన(దా మనుభవింప(జకోరము లాస(జేరవే
చలువ గలట్టివా(డగుట(జందురు నెంతయు(గోరి భా... 71

ఉ. బంధుర సద్గుణాఢ్యు(డొకపట్టున లంపట మొంది యైన దు
స్సంది దలంప(డన్యులకు(జాలహితం బొనరించు(గాక శ్రీ
గంధపు(జెక్క రాగిలుచు(గాదె శరీరుల కుత్సవార్థమై
గంధము లాత్మ(బుట్ట(దఱుగంబడి యుండుట లెల్ల భా... 72

చ. బలము దొలంగు కాలమున(బ్రాభవసంపద లెంతధన్యు(డున్
నిలుపుకొనంగ నోప(డది నిశ్చయ మర్జును(డీశ్వరాదులం
గెలిచినవా(డు బోయలకు(గీడ్పడి చూచుచు(గృష్ణభార్యలం
బలువుర నీయ(డే నిలువ(బట్ట సమర్థు(డు కాక భా... 73

చ బలయుతు(డైనవేళ నిజబంధు(డు తోడ్పడు(గాని యాత(డే
బలము తొలంగెనేని తనపాలిటిశత్రు వ డెట్లు పూర్ణు(డై
జ్వలను(డు కాన(గాల్చు తఱి సఖ్యము(జూపును వాయుదేవు(డా
బలియు(డు సూక్ష్మదీప మగుపట్టున నార్పదె గాలి భా... 74

చ. బల్లిదు(డైన సత్ప్రభువు పాయక యుండినగాని రచ్చలో(
జిల్లరవారు మూఁఅుగురు సేరిన(దేజము గల్గ దెయ్యెడ
జల్లని చందురుం డెడసి సన్నపు(జుక్కలు కోటి యున్న రం
జిల్లనె వెన్నెలల్ జగము చీ(కటు లన్నియు(బాయ భా... 75

చ. భుజబలశౌర్యవంతు లగు పుత్రుల(గాంచిన వారి కెయ్యెడన్
నిజహృదయేప్సితార్థములు నిక్కము చేకుఱు(గుంతిదేవికిన్
విజయబలాఢ్యు(డర్జును(డు వీరపరాక్రమ మొప్ప దేవతా
గజమును దెచ్చి తల్లి వ్రతకార్యము దీర్ప(డె తొల్లి భా... 76

చ. భూనుతు లైన దేవతలు పూర్వము గొందఱు వావివ ర్తనల్
మాని చరింపరో యనుచు మానవు లట్ల చరింప(బోల దం
భోధు లన్నియుం దనదుపుక్కిట(బట్టె నగస్త్యు(డంచు నా
పూనిక కెవ్వ(డోపు నది పూర్వమహ త్త్వము సుమ్ము భా... 77

ఉ. భూపతి కాత్మబుద్ధి పుది(బుట్టనిచోట(బ్రజాను లెంత ప్ర
జా పరిపూర్ణు లైన(గొనసాగదు కార్యము కార్యదక్షు లై
యోపిన ద్రోణభీష్మకృపయోధు లనేకులు గూడి కౌరవ
క్ష్మాపతికార్య మే మయిన(జాలిరె చేయ(గ వారు భా... 78

ఉ. భూరిబలాఢ్యు(డైన(దలపోయిక విక్రమశక్తిచే నహం
కారము నొందుటల్ తగవు గా దత(డొక్కెడ మోసపోవు(గా
వీరవరేణ్యు(డర్జును(డు వింటికి నే నధికుండ నంచు(దా
నూరక వింటి నె క్కిడ(గ నోప(డు కృష్ణు(డు లేమి భా... 79

ఉ. భ్రష్టున కర్హవంతు లగు బాంధవు లెందఱు గల్గినన్ నిజా
దృష్టము లేదు గావున దరిద్రత(బాప(గ లేరు సత్కృ పా
దృష్టిని నిల్పి లోకుల కతిసిరసంపద లిచ్చులక్ష్మి యా
జ్యేష్ఠ క దేటికిం గలుగ(జేయదు తోడనె పుట్టి భా... 80

చ. మది(దను నాసపడ్డయెడ మంచి గుణోన్నతు(డెట్టిహీనునిన్
వదల(డు మేలుపట్టున నవశ్యము మున్నుగ నాదరించు(గా
త్రిదశవిమానమధ్యమున(దెచ్చి కృపామతి సారమేయము
మొదల నిడండె ధర్మజు(డు మూ(గి సురావళి చూడ భా... 81

చ. మాటల కోర్వ(జాల(డభిమానసమగ్రు(డు ప్రాణహాని యౌ
జోటుల నైన(దా నెదురు చూచుచు నుండు(గొలంకు లోపల
న్నీట మునింగినప్పు డతినీచము లాడిన రాజరాజు పో
రాట మొనర్చి నేల(బడ(డాయెనె భీమునిచేత భా... 82

ఉ. మానవనాథు(డాత్మరిపుమర్మ మెఱింగినవాని నేలినం
గాని జయింపరే(డరుల(గార్ముకదక్షు(డు రామభద్రు(డా
దానవనాయకుం గెలువ(దా నెటు లోపు(దదీయనాభికా
స్థానసుధ న్విభీషణు(డు తార్కొని చెప్పకయున్న భా... 83

ఉ. మానవు(డాత్మ కిష్ట మగుమంచి ప్రయోజన మాచరించుచో(
గానక యల్పు(డొక్క(డది గా దని పల్కిన వానిపల్కుకై

మానఁగఁ జూడఁ డాపని సమంచితభోజనవేళ నీఁగ కా
లూనిన వంటకంబు దినకుండఁగ నేర్పగునోటు భా... 84

చ. మానిని చెప్పు నె ట్లొజ్జుకమాలినవాఁడటు చేసినన్ మహా
హీని ఘటించు నే ఘనుఁ కైన నసంశయ మూర్విపైఁ గృపా
హీనతఁ బల్కినన్ దశరథేశ్వరుఁ డంగనమాటకై గుణా
భోనిధి రాముఁ బాసి చనిపోవఁడె శోకముతోడ భా... 85

చ. మును పొనరించుపాతక మమోఘము జీవుల కెల్లఁ బూని యా
వెనుకటి జన్మమం దనుభవింపక తీఱదు రాఘవుండు వా
లిని బడనేసి తా మగుడ లీల యదూద్భవుఁడై కిరాతుచే
వినిశిత బాణపాతమున వీడ్కొనఁడే తనమేను భా... 86

ఉ. రాకొమరుల్ రసజ్ఞుని దిరంబుగ మన్నన నుంచినట్లు భూ
లోకమునందు మూఢుఁ దమలోపల నుంపరు నిక్కమే కదా
చేకొని ముద్దుగాఁ జదువుచిల్కను బెంతురు గాక పెంతురే
కాకము నెవ్వ రైన శుభకారణ సన్మునిసేవ్య భా... 87

ఉ. లోకములోన దుర్జనులలోఁతు నెఱుంగక చేరరాదు సు
శ్లోకుఁడు చేరినం గవయఁజూతురు చేయుదు రెక్కసక్కెముల్
కోకిలఁ గన్నచోట గుమి గూడి యసహ్యపుఁ గూతలార్చుచుం
గాకులు తన్నవే తఱిమి కాయము తల్లడ మంద భా... 88

ఉ. లోను దృఢంబు గాని పెనులోభిని నమ్మి యసాధ్యకార్యముల్
కానక పూనునే నతఁడు గ్రక్కునఁ గూలును నోటిపుట్టిపై
మానవుఁ డెక్కి పోవ నొకమాటు బుటుక్కున ముంపకుండునే
తా నొకలోఁతునం గెడసి దానిఁ దరింపఁగ లేక భా... 89

ఉ. వంచన యింత లేక యెటువంటి మహాత్ముల నాశ్రయించినం
గొంచెమె కాని మేలు సమకూడ దదృష్టము ట్రేనివారికిఁ
సంచితబుద్ధి బ్రహ్మ నిశంబును వీపునఁ మోచునట్టి రా
యంచకు దుంపతూండ్లు దిననాయెఁ గదా ఫల మేమి భా... 99

ఉ. వట్టుచు దండ్రి యత్యధమవ ర్తను డైనను గాని వానికిం
బుట్టిన పు త్త్రికుండు తనపుణ్యవశంబున దొడ్డధన్యు డౌ
నెట్టన మట్టివిత్తు మును పెంతయు గొంచెము దాన బుట్టు నౌ
చెట్టు మహోన్నతత్వమును జెందడె శాఖల నిండి భా... 91

చ. వలనుగ గానలందు బ్రతివర్షమునం బులి నాలుగైదుపి
ల్లల గను దూడ నొక్కటి నిలం గను ధేనువు రెండుమూడు నే
డుల కటు లైన బెబ్బులి కుబుంబము లల్పము లాయె నాలమం
దలు గడు వృద్ధి చెందవె యధర్మము ధర్మము దెల్ప భా... 92

చ. వలవదు క్రూరసంగతి యవశ్య మొకప్పుడు సేయబడ్డచో
గొలదియె కాక యెక్కువలు గూడవు తమ్ములపాకు లోపలం
గలసిన సున్న మించుకయ కాక మఱించుక యెక్కువై నచో
నలుగడ జుఱ్ఱు చుఱ్ఱు మని నాలుక పొక్కక యున్నె భా... 93

ఉ. వానికి విద్యచేత సిరి వచ్చె న టంచును విద్య నేర్చగా
బూనిన బూను గాక తనపుణ్యము చాలక భాగ్య రేఖకుం
బూనగ నెవ్వ డోపు సరిపో చెవి పెంచును గాక దృష్టతా
హీనుడు కర్ణభూషణము లెట్లు గణింపగ నోపు భా... 94

ఉ, సంతతపుణ్యశాలి నొకజాడను సంపద వాసిపోయి తా
నంతట బోక నెట్టుకొని యెప్పటియట్ల వసించియుండు మా
సాంతమునందు జందురుని నన్నికళల్ పెడబాసి పోయినం
గాంతి వహింపడోటు తిరుగంబడి దేహమునిండ భా... 95

చ. సకల జనప్రియత్వము నిజంబుగ గల్గినపుణ్యశాలి కొ
క్కొకయెడ నాప దైన దడ వుండదు వేగమె పాసిపోవు గా
యకలుషమూర్తి యైన యమృతాంశుడు రాహువు తన్ను మ్రింగిన న్
డకటక మాని యుండడె దృఢస్థితి నెప్పటియట్ల భా... 96

ఉ. సన్నుతకార్యదక్షు డొకచాయ నిజప్రభ యప్రకాశ మై
యున్నపు డైన లోకులకు నొండొకమే లొనరించు స త్త్వసం

పన్నఁడు భీముఁ డాద్విజుల ప్రాణము కావఁడె యేకచక్రమం
దెన్నికగా బకాసురుని నేపున రూ పడఁగించి భా... 97

చ. సరసగుణ ప్రపూర్ణనకు సన్నపుదుర్గుణ మొక్కవేళయం
దొరసిన నిట్లు నీకుఁ దగునో యని చెప్పిన మాననేర్చుఁగా
బురద యొకించు కంత తముఁ బొందినవేళలఁ జిల్లవిత్తుపై
నొరసిన నిర్మలత్వమున నుండవె నీరను లెల్ల భా... 98

చ. సరసదయాగుణంబు గల జాణ మహిం గడు నొచ్చి యుండియుం
దఱుచుగ వాని కాసవడి డాయంగ వత్తురు లోకు లెట్లనం
జెఱకురసంబు గానుఁగను జిప్పిలిపోయినమీఁదఁ బిప్పియై
ధరఁ బడియున్నఁ జేరవె ముదంబునఁ జీమలు పెక్కు భా... 99

ఉ. సారవివేకవర్తనల సన్నుతి కెక్కిన వారిలోపలం
జేరినయంత మూఢులకుఁ జేపడ దానడ యెట్టులన్నఁ గా
సారములోన హంసములసంగతి నుండెడి కొంగపిట్ట కే
తీరునఁ గల్గనేర్చును దదీయగతుల్ దలపోయ భా... 100

ఉ. స్థానము తప్పివచ్చునెడఁ దా నెటువంటి బలాఢ్యుఁడుఁ నిజ
స్థాపకుఁడైన యల్పునికతంబున నైనను మోసపోవుఁ గా
కానలలోపల న్వెడలి గంధగజం బొకనాఁడు నీటిలోఁ
గానక చొచ్చినఁ మొసలికాటుకు లోఁబడకున్నె భా... 101

చ. సిరిగలవాని కెయ్యెడలఁ జేసిన మే లది నిష్ఫలం బగున్
నెఱి గుఱి గాదు పేదలకు నేర్పునఁ జేసిన సత్ఫలం బగున్
వఱపున వచ్చి మేఘుఁ డొకవర్షము వాడిన చేలమీఁదటం
గురిసినఁ గాక యంబుధులఁ గుర్వఁగ నేమి ఫలంబు భా... 102

చ. సిరివలెనేని సింహగుహచెంత వసించిన జాలు సింహముల్
కరుల వధింపఁగా నచటఁ గల్గును దంతచయంబు ముత్యముల్
హరువుగ నక్క బొక్కకడ నాశ్రయ మందిన నేమి గల్గెడుం
గొరిసెలు దూడతోఁకలును గొమ్ములు నెమ్ములుఁ గాక భా... 103

చ. స్థిరతరధర్మవర్తన, బ్రసిద్ధికి నెక్కినవాని నొక్కము
ష్కరు, డతినీచవాక్యములఁ గా దని పల్కిన నమ్మహాత్ముఁడుం
గొఱత వహింప, డయ్యెడ నకుంఠితపూర్ణసుధాపయోధిలో
సరుగుచు, గాకి రెట్ట యిడినందున నేమి కొఱంత భా... 104

చ. సిరి గలనాఁడు లభ్య మగు చిత్తమునందు, దలంచి నంతనే
నరులకు నెట్టికార్య మయినన్ జత కాదు బహుప్రయత్నముల్
జరిపిన నైన ప్రేమియెడ సత్యము సు మ్మిది 'చేతి కందు పం
డరయఁగ నోఁటి కందదు గదా' యను సామ్యముపోల్కి భా... 105

చ. స్ఫురతర కీర్తిమంతు లగుపుత్రులఁ గాంచిన, గాక మూఢ ము
ష్కరుల, గనంగ, దేజములు గల్గవు గా మణికీలితాంగులా
భరణము లంగుళంబుల శుభస్థితి, బెట్టిన, గాక గాజు టుం
గరములు పెట్టినందున వికాసము గల్గు నటయ్య భా... 106

ఉ. సేనగ వాంఛితాన్నము భుజింప, గలప్పుడు గాక ప్రేనిచో
మేనులు డస్సి యుంట నిజమే కద దేహుల కగ్నిహోత్రుఁ డౌ
నే నిజభోజ్యముల్ గుడుచునేనియు, బుష్టి వహించు ప్రేని నా,
డూని విభూతిలో నడఁగి యుండఁడె తేజము దప్పి భా... 107

ఉ. హీనకులంబునందు జనియించినవారికి సద్గుణంబు లె
న్నేనియు, గల్గియున్న నొకనేరము చెందక పోదు పద్మముల్
భూనుతి, గాంచియుం బురద, బుట్టుటవల్ల సుధాకరోదయం
బైన నసహ్య మొందవె ప్రియంబున, జూడఁగ లేక భా... 109

ఉ. ఇంచుక నేర్పు చాలక విహీనత, జెందిన నా కవిత్వమున్
మించు వహించె నీకతన మిక్కిలి యెట్లన, దోలుబొమ్మలన్
మంచివివేకి వాని తెరమాటున నుండి ప్రశస్తరీతి నా
డించిన నాడవే జనులడెందము నింపవె ప్రీతి భాస్కరా! 110

భాస్కర శతకము సంపూర్ణము.

ఆంధ్ర నాయక శతకము

ఇది సంపూర్ణముగా సీసపద్య శతకము.

క్రీ.శ. 17 శతాబ్దిలో శ్రీకాకుళక్షేత్రమున సుప్రసిద్ధ ఆంధ్రవిష్ణు దేవాల యాదులు శిథిలము లై పూజలు, ఉత్సవములు తగ్గిపోయినవి. ఆవల కాసుల పురుషో త్తమ కవి ఆంధ్రనాయక శతకము రచించి ఈవిషయ ముద్ఘాటించినాడు.

కాశ్యపగోత్రుడ కాసులవంశ చం
ద్రముడ అప్పలరాజ రమణమాంబి
కూర్మితనూజుండ గురువు లౌ అద్దంకి
తిరుమలాచార్య శ్రీ చరణపద్మ
భవ్యతీర్థమరంద పానద్విరేఫాయ
మానమానసుడను మాన్యహితుడ
పురుషో త్తమాఖ్యుండ పూదండవలె నీకు
శతకంబు గూర్చితి శాశ్వతముగ.
చిత్తగింపుము మీపాద సేవకుడను
భావజవిలాస, హంసలదీవివాస,
లలిత కృష్ణాబ్ధి సంగమస్థల విహార,
పరమ కరుణాస్వభావ, గోపాలదేవ !

దీనిని బట్టి పురుషో త్తముడు కాశ్యపగోత్రుడు, కాసుల వంశములోనివాడు భట్టు రాజు, తల్లి రమణాంబ, తండ్రి అప్పలరాజు. అద్దంకి తిరుమలాచార్యులు ఈతని గురువు. పురుషో త్తముడు వై ష్ణవమత ప్రవిష్టుడు అనిస్పష్టము.

ఈతనికాలము తెలిసికొనుట కవకాశము కానవచ్చుచున్నది. కృష్ణా మండలములోని దేవరకోట ప్రభు వైన శ్రీ రాజా అంకినీడు బహద్దరు వారి ఆస్థానకవిగా పురుషో త్తము డుండె నని తద్వంశీయులవద్ద నిదర్శనములు కలవు. రాజా అంకినీడు బహద్దరు క్రీ.శ. 1791 లో రాజ్యమునకు వచ్చి ఇరువదేండ్ల కాలము పరిపాలన చేసినాడు. కావున పురుషో త్తమ కవి కూడ క్రీ.శ. 1800 ప్రాంతమునన్న వా డని చెప్పవచ్చును.

శతక మొక్కటి "మనసా హరిపాదము
లాశ్రయింపవే" యని యల్లినాడ
గరిమ "రామా భక్త కల్పద్రుమా" యని
యొప్పుగా శతకంబు జెప్పినాడ
సలరులదండ మీ కనగ హంసలదీవి
గోపాల శతకంబు గూర్చినాడ
యుష్మదంకితముగా నూహించి శతకమే
నంచితంబుగ రచియించినాడ
భవదనుగ్రహకవితచే బ్రబలినాడ
నవని కాసుల పురుషోత్తమాఖ్య వాడ
చిత్రచిత్ర ప్రభావ, దాక్షిణ్యభావ,
హతవిమతజీవ, శ్రీకాకుళాంధ్ర దేవ!

దీనినిబట్టి "మనసా హరిపాదము నాశ్రయింపవే," రామా, భక్తకల్పద్రుమా, హంసలదీవి గోపాలా, శ్రీకాకుళాంధ్రదేవ అను శతకములు ఈతడు రచించి నట్లు సుస్పష్టము. ఈతని కృతులలో ఆంధ్రనాయక శతకమే కడపటిదిగా కానపబడుచున్నది.

పైవానిలో 'మనసా! హరిపాదము లాశ్రయించవే' అను మకుటము కల శతకము లభింపలేదు. కాని ఇదే కొంచెము మార్పుతో మనసా! హరిపాదము లాశ్రయింపుమా అను మకుటముతో తాడేపల్లి పానకాలరాయ కవి రచించిన శతకము దొరకుచున్నది. పానకాల రాయ కవి బహుశతకములు నిర్మించిననూ ఆయనకాలనిర్ణయమునకు అనుకూలించు విషయములు తగి నన్ని లేవు. జన్మ స్థానము తాడేపల్లి అయిననూ ఆతడు కొండవీటిలో నుండెడివాడు. ఆయన రచించిన పార్థసారథి శతకము వలన తత్కాలము కొంతవర కూహింప వచ్చును.

తిరువడికేణి పట్టణపతీ గుణనీరధి పార్థసారధీ! అని అందలి 107 పద్యములో కలదు. చెన్నపట్టణమున పార్థసారధికోవెల ఉన్నపేట తిరువళిక్కేణి.

క్రీ.శ. 1740 ప్రాంతమున శ్రీ పార్థసారధిస్వామివారికి అంకితముగా కృతులు వెలసినవి. కావున పానకాలరాయుడు క్రీ.శ. 1750 ప్రాంతమువా డని

చెప్పవచ్చును. మానస బోధ శతకమున గల క్రిందిపద్యమును కాసుల పురుషోత్తమ కవి అనుసరించినాడు.

అప్పనంబులు గొను నఖిల దిజ్మండలే
శ్వరులచే వేంకటాచలనివాసు
నరుదుగా నరువదా రవసరంబుల మహా
భోగంబు గొను నీలభూధవుండు
పానకంబాలు సాఁబాలు భక్తుల కిచ్చి
యెసఁగును మంగళాద్రీశ్వరుండు
పుట్టకొలంది యై పూతగా గొను మంచి
గందంబు సింహనగప్రభుండు
సాటి సాముల రీతి నిచ్చోట నీవు
మూర్తిమంతంబు జూపక కీర్తి గలదె
చిత్రచిత్ర ప్రభావ, దాక్షిణ్యభావ,
హతవిమతజీవ, శ్రీకాకుళాంధ్ర దేవ!
దీనినిబట్టి పానకాలరాయ కవి కృతియే ఆద్య మని చెప్పనొప్పును.

భక్తకల్పద్రుమ శతకము:

ఈ శతకము పంచచామర వృత్తములలో రచిత మై సులభశైలిలో సుగ్రాహ్య మై యున్నది.

మొ రాలకింప వయ్య నీకు మ్రొక్కెదన్ రఘూద్వహా!
బిరాన నామది న్వసించి ప్రేమ నుంచి నూట్పదార్
వరాలు శాలు విచ్చి నట్లు వచ్చు కీర్తి నీ కహో
పరాకు భద్రశైలరామ! భక్తకల్పకద్రుమా!

ధరాధరేంద్ర మౌని పూజితా, ధరాసుతాయుతా
ధరాధరేంద్రధీర హీరతారహారచారు కం
ధరా ధరాధిపాధిపాత్ర ధౌప్రభాంతకంధరా!
పరాకు భద్రశైలిరామ, భక్తకల్పకద్రుమా!

శ్రీకాకుళేశ్వరునకు పూజలు, ఉత్సవములు జరుగునప్పుడు పురుషోత్తమ కవి పర్యటనము చేసి, తనకవితాప్రభావముచే దేవాలయము మరల నూతన కళలతో తేజరిల్లునట్లు చేసినాడు.

ధర నూట యెనుబది తిరుపతులందు శ్రీ
కాకుళం బరయ ప్రఖ్యాతియేని
ఆంధ్రనాయకు డన నఖిలదేశంబుల
నిన్ను గీర్తించుట నిజమయేని
వైఖానసోక్తికి వంచన రాకుండ
నెఱులు చూపినమాట నిజమయేని
వైకుంఠుడవు స్వయంవ్యక్తిగా నర్చావ
తార మొందితి వంట తథ్యమేని
వివిధపూజోత్సవములు నిర్విఘ్నములుగ
జేసికొనకున్న నీకు ప్రసిద్ధి కలదె ?...

"కీర్తి నిందగ వర్ణించి గేలి పఱుతు" అని ప్రతిజ్ఞ చేసి, పురుషోత్తముడు తనపంతము నెగ్గించుకొన్నాడు.

సీసపద్యపాదములు నాలుగింటిలోను చర్యలను చెప్పి గీతమున భావము నిమిడ్చుట నీతని రచనాలక్షణములలో ప్రధాన మైనది. గీతపంక్తులు రెండును సీసమునకు శీర్షము పెట్టిన ట్లుండును.

తెలియ నవ్యక్తుడవు కావు తెలిసికొన్న
నిట్టివా డని తెలియలే దెవ్వరికిని... పద్యము 27
ఒకరికన్న గుణాధికు లొకరు మీర
లింత చక్కన దెలిసె మీయింటివరుస... 28
పరువు కలవాడ వేని ప్రాబలుకులందు
తెలియ వరిముల్లము క్కంత కలవొ లేవొ... 29

శ్రుతియందలి నీవారశూకవత్తన్వీ పీతాభాస్వత్కణూపమా అను వాక్కుల నిది యనుసరించుచున్నది.

ఈ శతకము విన్నవెనుక రాజా ఆంకినీడు దేవాలయోద్ధరణ కావించి, శ్రీకాకుళాంధ్ర నాయకునకు నిత్యపూజాదికము లేర్పాటు కావించి, ప్రాచీనవైభవ మినుమడింప జేసెను.

పురుషోత్తమ కవి విరచిత మైన హంసలదీవి గోపాలశతకమున మనోహరభావము లున్నవి.

తనకుఁ గశేబరంబునకు భేదజ్ఞాన
మతి లేనివాని నిర్మలత యెంత ?
తనువు వర్జించునంతట జీవుఁ డే మౌనొ
తెలియనివాని తా త్త్వికత యెంత ?
కన్నతండ్రిని జగత్కర్తను నాత్మలో
బోధ సేయనివాని బుద్ధి యెంత ?
భవజరామరణాది భయనివారణ మైన
పదము చేరనివాని భాగ్య మెంత ?
ఏమి జేరని నను బ్రోచు టిదియె వింత !
భావజవిలాస, హంసలదీవివాస,
లలితకృష్ణాబ్ధి సంగమస్థల విహార !
పరమకరుణాస్వభావ, గోపాలదేవ !

శ్రీ

ఆంధ్రనాయక శతకము

శ్రీమదనంత లక్ష్మీయుతోరఃస్థల,
చతురాననాండ పూరిత పిచండ,
ధర చక్ర ఖడ్గ, గదా శరాసనహస్త,
నిఖిల వేదాంత వర్ణిత చరిత్ర,
సకల పావన నదీ జనక పాదాంభోజ,
రమణీయ ఖగకులోత్తమ తురంగ,
మణిసౌధవ ర్ణణామండ లోరగతల్ప,
వరకల్పకోద్యాన వన విహార,
భాను సితభాను నేత్ర, సౌభాగ్యగాత్ర,
యోగిహృద్ధేయ, భవనైక భాగధేయ,
చిత్ర చిత్ర ప్రభావ, దాక్షిణ్యభావ,
హత విమతజీవ, శ్రీకాకుళాంధ్రదేవ! 1

వైజయంతీదామ, వర్ణిత సుత్రామ,
శోభననామ, లోకాభిరామ,
కువలయశ్యామ, వికుంఠపట్టనధామ,
శ్రుతిహితనామ, దైవతలలామ,
కృతదైత్య సంగ్రామ, గీతార్థ పరిణామ,
యదుకులాంబుధిసోమ, అఘవిరామ,
సంగర జిత భౌమ, రంగద్భుణస్తోమ,
త్రిభువన క్షేమ వర్ధిష్ణుకామ,
దాసులము గామ? నీ పేరు దలచుకోమ?
కొసరితిమి ప్రేమ, కోరిన కోర్కెలీవ? చిత్ర... 2

మానుషహార్యక్ష, మార్తాండ సోమాక్ష,
త్రిభువనాధ్యక్ష, కౌంతేయపక్ష,
మదనకోటి విలాస, మంజుల దరహాస,
శ్రీహృన్నివాస, కౌశేయవాస,
కార్ముకోదండ పిచండ భృతాజాండ,
వినుతవేదండ, రవిప్రచండ,
దీన శరణ్య, విద్విట్ భేద నైపుణ్య,
భక్తానుగణ్య, దిక్పృభువరేణ్య,
సిద్ధసంకల్ప, అవికల్ప, శేషతల్ప,
నిష్కలంక, నిరాతంక, నిరుపమాంక, చిత్ర... 3

గోవింద, ముచికుంద సేవిత పాదార
విందా, నిత్యానంద, విశ్వతుంద,
శ్రీమంత, విజయలక్ష్మీకాంత, నిర్మల
స్వాంత, భక్తోద్యాన వనవసంత,
అఘనాశ, కోటిసూర్యప్రకాశ, వరేశ,
విజితాశ, సన్మనోంబుజ నివేశ,
సద్గుణ గేహ, వాసవనీల సమదేహ,
బంధురోత్సాహ, సుపర్ణవాహ,
పండితస్తోత్ర చారిత్ర, పద్మనేత్ర,
మధుర మంజులభాష, సమస్తపోష చిత్ర... 4

శ్రీకాకుళము భక్తలోక చింతామణీ
శ్రీకాకుళము సుకృతాకరంబు
శ్రీకాకుళము ధరాలోక వైకుంఠంబు
శ్రీకాకుళము మర్త్యసేవితంబు
శ్రీకాకుళము వేదసిద్ధాంత మహిమంబు
శ్రీకాకుళము హతవ్యాకులంబు

శ్రీకాకుళము మహాక్షేత్రావతంసంబు
శ్రీకాకుళము సర్వసిద్ధికరము
తెలియ శ్రీకాకుళంబు నీ దివ్యదేశ
మాంధ్రనాయక నీవె శ్రీహరివి నిజము చిత్ర... 5

ఇంద్రనీలచ్ఛాయ లీను నెమ్మేనిపై
గనకాంబరప్రభ గ్రందుకొనగ
బర్వసుధాంశు శోభాసముజ్జ్వలవక్త్ర
మున నూర్ధ్వపుండ్రము ముద్దు గుల్క
నెగుభుజంబుల ధగద్ధగితాంగద ద్యుతుల్
మూర్ధరత్నకిరీటమున జరింప
వర్ణితోరస్థలి వైజయంతిక కౌస్తు
భాంతర శ్రీదేవియంద మమర
రమ్మ దర్శన మిమ్మ ఘోరములఁ జిమ్మ
మభయ మిమ్మ భవత్తత్త్వ మానతిమ్మ చిత్ర... 6

కలిగినప్పుడె కన్న తలిదండ్రు లెన్న నే
నిసువు మాటాడంగ నేర్చె జగతి
బయలిజగంబు లంబకు నిజోదరమునం
దేబిడ్డ చూపించె నిద్ధరిత్రి
దొడలపై ముద్దుగా నిడుకొన్న జనని కే
పసిపిల్ల కొండంతబరువు దోచె
దల్లిచెంగటనుండి యిల్లిల్లు జొచ్చి యే
కుట్టి డింతుల బిల్మి గూడ నేర్చె
నాబుడుత వీవెరా యబ్బ! యబ్బురంపు
కతలమారివి నీ వెఱుంగనివి గలవె? చిత్ర... 7

వర మిచ్చినట్టి శంకరుని కెగ్గు దలంచు
భస్మాసురుని పేరు బాపినావు

తనయిల్లు గాచు నుగ్రుని బోరుటకు బిల్చి
బాణచేతులు తెగ బటికినావు
తొలుమిన్క లజుని మ్రుచ్చిలి గొన్న సోమకు
జపి విద్యలు ధాత కంపినావు
బలిమి దైత్యులు సుధాకలశము న్గొన వారి
వంచించి సురలకు బంచినావు
నిఖిలదైవత కార్యముల్ నిర్వహించు
నీకు నిజకార్యము భరంబె నిర్వహింప: చిత్ర... 8

అచట లే వని కదా యరచేత జఱచె గ్రు
ద్ధత సభా స్తంభంబు దానవేంద్రు
డచట లే వని కదా యస్త్రరాజం బేసె,
గురుసుతుం డు త్తరోదరమునందు
నచట లే వని కదా యతికోపి ననిచె
బాండవు లున్నవనికి గౌరవకులేంద్రు
డచట లే వని కదా యాత్మీయసభను ద్రౌ
పదివల్వ లూడ్చె సర్పధ్వజుండు
లేక యచ్చోటులను గల్గలేదె ముందు
కలవు కేవల మిచ్చోట గల్గు టరుదె చిత్ర... 9

అంచితాఖండదీ పారాధనల చేత
దీపించు నెప్పుడు దేవళంబు
అగరుసాంబ్రాణి ధూపార్పణంబులచేత
భవనం బ దెప్పుడు బరిమళించు
నతినృత్యగీత వాద్యస్వనంబులచేత
నెప్పుడు గోవెల యెసక మెసగు
నఖిలోపచార సమర్పణంబులచేత
మెఱయు నెప్పుడు దిరుమేను కళల

నిపు డొకించుక లోభిత్వ మెనసి నట్లు
దో(చుచున్నా(డ విట్టియద్భుతము గలదె చిత్ర... 10

భక్తి(జేసిన శిలాప్రతిమ మాత్రమె కాని
హరి యిందు(గలుగునా యనెడువారు
స్వామి యిం దుండిన సత్యంబు(జూపక
యుండునే యని పల్క్-చుండువారు
బుద్ధావతారంబు(బూనినా(డఖిలంబు(
గని కనన ట్లుండు ననెడువారు
దేవతామహిమంబు దెలియునో యేమేమి
నడువ నున్నదొ యని నుడువువారు
నీకు నిత్యోపచారముల్ లేకయున్న
లోకు లి ట్లాడుకొండ్రు పరా కి దేమి చిత్ర... 11

ధర నూటయెనిమిది తిరుపతులందు శ్రీ
కాకుళం బరయ(బ్రఖ్యాత మేని
యాంధ్రనాయకు(డ వం చఖిలదేశంబుల
నిన్ను(గీర్తించుటే నిజమయేని
వైఖానసోక్తికి వంచన రాకుండ
నెరులు చూపినమాట నిజమయేని
వైకుంఠు(డవు స్వయంవ్యక్తిగా నర్చావ
తార మొందినమాట తథ్యమేని
వివిధపూజోత్సవములు నిర్విఘ్నములుగ(
జేసికొనకున్న నీకు(బ్రసిద్ధి గలదె చిత్ర... 12

మానితంబుగ గరుత్మద్ధ్వజారోహణం
బెప్పు డొనర్తువో చెప్పు మయ్య!
గరిమతో నీ తిరుక్-కళ్యాణసంభ్రమం
బెప్పు డెప్పుడొ వేగ చెప్పు మయ్య

రమతో మహోన్నతరథ మెక్కి తిరువీథు
లెప్పు డేతెంతువో చెప్పు మయ్య
ధరణి నభ్యాగతదానప్రజాబృంద
మెప్పుడు బలియునో చెప్పు మయ్య
వత్సరోత్సవ వీక్షణవాంఛ జనుల
కెపుడు ఫలియించునో యానతీయు మయ్య చిత్ర... 13

తగునట్లు తిరుమేను తా నామతింపుచు
మిన్న పీతాంబరం బున్న దనుచు
గమలతో బుట్టిన కౌస్తుభం బది పోవ
దక్కి సొమ్మది నీకు తక్కి ననుచు
లలితరత్నద్యుతి మొలచినట్లు కిరీట
ముత్తమాంగము బాయ కున్న దనుచు
మండితమాణిక్యకుండలంబులు కర్ణ
యుగళితో బుట్టిన ట్లున్న వనుచు
నిండుకొన్నావు గడియించు నేరుపరివె
ష్రావలువ ష్రారువాణముల్ ష్రాతి యేమి? చిత్ర... 14

వంచన గాదె దివ్యక్షేత్రపతులలో
మంత్రార్థకృత్యము ల్మాని యున్న ?
నపకీర్తిగాదె లోకాలోకములయందు
వత్సరోత్సవములు వదలి యున్న ?
నగుబాటు గాదె యన్యమతస్థజనులలో
నిజదాసకోటి మన్నింపకున్న ?
బరిపాటి గాదె యల్పజ్ఞానమతులలో
దేవతామహిమంబు దెలుపకున్న?
నేటిదా నీప్రతిష్ఠ వర్ణించి చూడ
బాడి దప్పిన బలునిందపాలు గావె? చిత్ర... 15

తిరునాళ్ళతఱి వచ్చె, బరిపరివిధముల
నెలమి సామగ్రి, జేయింప వేమి?
సేవకు లందందు సేవింప భావింప
తిరువీథుల రథంబు, ద్రిప్పవేమి?
వృజిన మెల్ల, దొలంగు నిజ మంచు, బ్రజ లెంచు
పరమప్రసాదంబు, బంచవేమి
దివ్య దేశం బిది తీర్థంబు సార్థంబు
చక్రతీర్థము కృప సలుప వేమి?
హితము గావించి నీయన్వయంబు లెత్తి
కీర్తి నిందఁగ వర్ణించి గేలిపఱతు చిత్ర... 16

చెల్లింప, దగునె వ్రేపల్లెలో, గల వెట్టి
గొల్లయిల్లాండ్రను గొల్లగొనఁగ?
మెక్కఁంగ, దగునె ము న్నెక్కిండ్లలో నుట్ల
కెక్కి పాల్వెన్నలు దొక్కి నిండ?
ముచ్చిల, దగునె మళ్ళుచ్చి జలక మ్మాడు
మచ్చెకంటుల కోక లిచ్చకముగ?
మ్రొక్కఁంగ, దగునె ముం దొక్కపువ్వునకు, దా,
గక్కసించినయాలి కక్కజముగ
నిట్టి నగుబాటుపనులు నీ వెన్ని కలుగ,
జేసినాఁడవు మంచిప్రసిద్ధకుఁడవె చిత్ర... 17

అబ్బుకో, గలవొ కాయక్లేశ మొనరించు,
దేవాసుర ల టుండ దివ్యరమను
దోచుకో, గలవొ చే సాచి లోకము లాచి
బలిమహాదాత వైభవము లెల్ల
రా, దీయ, గలవొ సత్రాజిత్తు, డీకున్న
మణిశమంతక మొక మమత, గొల్పి

నాటించఁ గలవొ సన్న కసన్ననె వనంబు
పెట్టు మ్రా న్పెకలించి పెరటిలోనఁ
దెచ్చుకొన వేమి వస్త్రాన్నదీపధూప
గంధ తాంబూలముల కైన గడన దెలిసె చిత్ర... 18

తలను బించెపుదండ ధరియించవలె గాని
మణికిరీటము బెట్ట మనుజపతివె?
గళమున వనమాలికలు పూనవలెఁ గాని
హారము వ్వేయ దేశాధిపతివె?
కరమున మురళి చక్కఁగఁ బూనవలెఁ గాని
ఖాతాసిఁ బూనంగ క్షత్రియుఁడవె?
తనువు గోక్షీరవాసన గుప్పవలెఁ గాని
చందనం బలఁద రాజవె తలంప?
నెల్లలోక మెఱింగిన గొల్లవాఁడ
వేది కుల మింత రాజస మేమి నీకు? చిత్ర... 19

కన్నవారల మున్ను గారాగృహంబున
విడిచి పాఱితివి నీ కడిమి యేమి?
పగవాఁడు పురిటిలోఁ బట్టి నెత్తుకపోవఁ
దమకించుచున్న నీధైర్య మేమి?
ముద్దుమన్మని గోప్యముగ నొండు బంధింపఁ
దెలియన ట్లున్న నీ తెగువ యేమి?
వైరిఘాటికి నోడి వనధిమధ్యమునందు
నిలు గట్టుకొన్న నీ బలిమి యేమి?
విఱిగి తిరి గెన్నఁడెన్నఁడో తఱి యెఱింగి
యొరుల నడఁచితి వది యేమి భరము నీకు? చిత్ర... 20

భిల్లాంగనాదంతపీడిత ఫలభుక్తి
హేయంబు దోఁచలే దింత నీకు

సంక్రందనాత్మజ స్యందన సారథ్య
మెరుసుగా దోచదే దింత నీకు
గోపాలకానేక గోవత్సపాలనం
బెగ్గుగా దోచదే దింత నీకు
ప్రజబాలికా ముక్తవస్త్రాపహరణము
హీన మై తోచదే దింత నీకు
నుచ్చనీచంబు లెఱుగక యిచ్చ జేయు
చేష్ట లివి భక్తహితమతి జేసి తండ్రు చిత్ర... 21

విమతభూపతు లెట్లు విముఖు లై పాటిరో
రాజపీఠం బెక్కరాని నీకు
కుంభినీధవు లెట్లు కూతుంద్ర నిచ్చిరో
కుల మొల్లకయె నీకు గోపకునకు
సుందరీమణు లెట్లు చూచి మోహించిరో
కప్పగు మైచాయ గలుగు నీకు
దాసజనం బెట్లు దాస్యంబు సలిపిరో
తిరియువానిని మారు తిరియు నీకు
మమత నీలీల లటు సూచి బ్రమసి రేమొ
తగుదువే యిట్టిఘనతకు దంభభూప చిత్ర... 22

విక్రమాక్రమితభూచక్ర డౌ హేమాక్ష
పొం గణంచుటలు కోణంగితనము
కరగతామృతకుంభ గర్వితాసురకోటి
దూలగొట్టుటలు గయ్యాళితనము
కుచపూర్ణ విషదుగ్ధకుటిల యౌ పూతన
పేరు మాయించుట పిల్లతనము
కంసపురీ ద్వారగమనావరోధి యౌ
మదకరి నీడ్చుట మకురుతనము

వడిగలతనంబులా యివి? గడన యేమి
కొద్దిపను లివి నీ కిది పెద్దతనమె? చిత్ర... 23

కెరలి కంసుఁడు నిన్ను నటకఁ గాచినవాని
బారి సోదరిఁ ద్రోచి పాటినావు
సరిపోర నరకు నొంచఁగ లేక చేతివి
ల్లాలిచే నిడి దండ నలరినావు
తెగడి బంధువు లాజిఁ దిట్టి కొట్టఁగ నోర్చి
పై దర్పిఁ జేపట్టి వచ్చినావు
దర్పకోద్ధతి కెంతొ తత్తరపడి నిజ
స్త్రీపదాబ్జములఁ జే మోపినావు
నీపరాక్రమ మిట్టిది నిఖిలజగము
లాజ్ఞ మీఱక నిల్చుట యద్భుతంబు, చిత్ర... 24

వ్రేపల్లెలో గొల్లవెలఁదులు గొట్ట రా
దొడిదొడి యిల్లిల్లుఁ దూఱలేదొ
రాసకేళికయందు రమణులా యెందఱో
చుట్టి పట్టినఁ బాఱఁ జూడలేదొ
పదియాఱు వేల గోపకుమారికలు తేరి
పాఱఁ జూచిన మతి బ్రమయలేదొ
ప్రణయవాదంబున భార్య లా యెనమండ్రు
గసరివేసినఁ గూర్మిఁ గొసరలేదొ
తలిరుబోఁడుల యెదుటఁ దత్తరము గలుగ
నీవు పరరాజముఖమున నిలువ గలవె. చిత్ర... 25

ఆలు నిర్వాహకురాలు భూదేవి యై
యఖిలభారకుఁ డనునాఖ్యఁ దెచ్చె
నిష్టసంపన్నురా లిందిర భార్య యై
కామితార్థదుఁ డన్న ఘనతఁ దెచ్చెఁ

గమలగర్భుఁడు సృష్టికర్త తనూజుఁ డై
బహుకుటుంబకుఁ డన్న బలిమిఁ దెచ్చెఁ
గలుషవిధ్వంసిని గంగ కుమారి యై
బతితపావను, డన్న ప్రతిభఁ దెచ్చె
నాంధ్రు బిడ్డలు దెచ్చుప్రఖ్యాతి గాని
మొదటినుండియు నీవు దా మోదరుఁడవె. చిత్ర... 26

కడలి రాయనిముద్దుకన్నియఁ బెండ్లాడి
యూఁచఁగా నిల్లట ముండు టేమి
సహజ నొక్కర్తెను షండ పాండవునకుఁ
బెండ్లిఁ జేసితి నీవు పెద్ద వేమి
చిరరతిప్రౌఢను జిన్నబిడ్డ కీవు
గూర్చితి వారీతి గూడు నేమి
యుగములనాటి పెన్మగువను ముసలన్న
కొగిఁ జేసితివి తగుం దగు మటేమి
తెలియ నవ్యక్తుఁడవు గావు తెలిసికొన్న
నిట్టివాఁ డని తెలియలే దెవ్వరికిని చిత్ర... 27

నీజ్యేష్ఠపుత్త్రిఁ డెన్నికకు రాని యశాశ్వ
తపుఁ బను ల్సేయు సంతతము జగతి
వేరొక ముద్దుకుమారుఁ డందటి మోహ
లతల స్త్రీపురుషుల లంకెఁ బెట్టు
సీతలోదరి లోకమాత పక్షపక్ష
దృష్టిఁ జంచలవృత్తిఁ దిరుగుచుండు
నీ వనన్యకృతాది నిబిడమాయావిధా
నుల జేయు దెవ్వరిఁ దొలఁగనీక
నొకరికంటె గుణాధికు లొకరు మీరు
ఇంతచక్కన దెలిసె మీయింటివరుస. చిత్ర... 28

సకలంబు నీవ యై యొకమ్రియాకుపై
నిచ్చ బరుండునా డెంత గలవొ!
తన బిడ్డ డని యశోదా దేవి పొత్తుల
నిడుక ముద్దాడునా డెంత గలవొ!
తక్కలమార త్త దక్కించుకొనగ ని
న్నెత్తుక పెంచునా డెంత గలవొ!
భయలేశ మెఱుగక బల్పాముపడగపై
గంతులు వైచునా డెంత గలవొ!
పరువు గలవాడ వేమి ప్రాబల్యా లంచు
దెలియ వరిముక్కా ముల్లంత గలవొ! లేవొ! చిత్ర... 29

కల్లరు ల్గాని వ్రేపల్లెవా రందఱు
హరింప నచట నీయాట సాగె
మధురాపురీవరమనుజు లామోదించి
మన్నింప నచట నీయాట సాగె
ద్వారకాపట్టణధన్యులు నినుఁ గోరి
కొల్వఁగా నచట నీకొల్వు సాగెఁ
గరిపురధర్మజుం డురురాజసభ నిన్ను
భూషింప నచట నీమురువు సాగె
నెరుక మాలినవారుఁ నీపరువు దలఁతు
రేమి నీపొంకములు సాగు నేమి యచట? చిత్ర... 30

దూడలలోఁ బెరదూడ మేయఁగఁ జూచి
యట్టె పట్టుక చావఁగొట్టవలెనె
పొడవ రా వేగ నాబోఁతుకొమ్ములు పట్టి
విడువక దానిపే రుడుపవలెనె
ముక్కతోఁ జెనకిన కొక్కరాయనిఁ బట్టి
వెర వొప్పఁగా మెడ విఱువవలెనె

తన్నఁ బో తని మృగాధమ మంచు నెంచక
తొడరి గార్భమును ద్రుంపవలెనె
యేమి ఘనకార్యములు చేసి తిద్దరిత్రి
నెన్నటికి నీ వొనర్చిన విట్టిపనులె చిత్ర... 31

కవ్వడి కెంత చక్కఁగ బోధ చేసిన
నితరహింసాకర్మ మిష్టపఱుప
రాయబారం బెంత రసికత నడపిన
ననికి భారతుల నాయత్త పఱుప
విశ్వరూపం బెంత విమలతఁ జూపిన
నోర్వని కురురాజు నులుకు పఱుప
విలుఁ బట్ట నని యెంతొ చెలిమిగఁ బలికిన
నవల సుయోధను నాసపఱుప
పోరు చంపక చుట్టముల్ పోర నీల్గఁ
జూచుచుంటివి యేనాఁటి చుట్ట మీవు? చిత్ర... 32

శ్రీమద్వికుంఠపురీ వరేశుఁడ వయ్యు,
గొల్లపల్లెల నుండఁ గోరు టేమి
యక్షీణలక్ష్మి కటాక్షవీక్షుఁడ వయ్యుఁ
ద్రోవ లే కింటింటఁ దోఁచ నేమి
భూరి చతుర్దశ భువనావనుఁడ వయ్యుఁ
గడువేడ్కఁ దొట్టులఁ గాయ నేమి
సన్మునిదేవతా సంభావితుఁడ వయ్యు
నాలగాపరులతో నాడ నేమి?
గొప్పలో గొప్పవాఁడవు కొలదిలోనఁ
గొలదివాఁడవు ని న్నెట్లు గొలువ వచ్చు? చిత్ర 33

దుర్యోధనుం డవధ్యుఁడ వంచు మానెఁ గా
కలుక బంధింపఁగాఁ దలఁప లేదె?

గోపాలుఁడవు పూజఁ గొందువేరా యని
సభ నిన్నుఁ దిట్టఁడే చైద్యుఁ డెదిరి?
నీలాంచనంబులఁ బోలు చిహ్నాలు దాల్చి
తానె నీ వనఁడె యుద్ధతినిఁ బొండ్రుఁ?
డెవ్వరుఁ బట్టరే రేను బట్టెద నంచు
యవనుండు దరుమఁడే యాహవమున
నృపులు కొందఱు వెఱచిరే నీకు మున్ను
ప్రాణముల కాసపడరేని భండనమున చిత్ర... 34

రాజు లెవ్వరుఁ బ్రత్యుభోజన మిడకున్న
దాసునింట భుజించి తనియలేదొ?
బంధువు లెవ్వరు గంధ మీ కుండిన
మువ్వంకలది పూయ మురియలేదొ?
దొర లెవ్వరును బూలసరము లీకుండినఁ
దెలిసి మాలికుఁ డీగ నలరలేదొ?
ప్రభువు లెవ్వరు వస్త్రబహుమాన మీ కున్నఁ
దెచ్చి యిచ్చిన చాకి మెచ్చలేదొ?
పాటి సేయంగ నేరాజు బందుగుఁడవొ?
మున్నె నీపస దెలిసిన దెన్న నేమి? చిత్ర... 35

నాఁగలి రోఁక లన్నకు నిచ్చి శంఖాది
పంచాయుధము లీవు పట్టినావు
తాటిపెకెక్కెంబు కోల్తలపెద్ద కెత్తించి
గరుడధ్వజం బీవు గట్టినావు
వెలరాని కఱవోని వలువ జేష్ఠున కిచ్చి
కనకాంబరం బీవు గట్టినావు
మద్య మగ్రజునకు మత్తిలఁ దావించి
జున్ను బాల్ పెరుఁగు వీవు జుట్టినావు

తగువరివె యన్నదమ్ముల ధర్మ మీవె
తీర్పవలెఁ గాని మటియొండు తీర్పఁగలఁడె చిత్ర... 36

అప్పనంబులు గొను నఖిలదిజ్మండలే
శ్వరులచే వేంకటాచలనివాసుఁ
డరుదుగా నరువదా అవసరంబులు మహా
భోగంబుఁ గొనునీలభూధ్రవరుఁడు
పానకం బాలు సాఁబాలు భక్తుల కిచ్చి
యెసఁగును మంగళాద్రీశ్వరుండు
పుట్టకొలంది మైపూఁతఁగాఁ గొను మంచి
గందంబు సింహనగ ప్రభుండు
సాటిసాములరీతి నిచ్చోట నీవు
మూర్తిమంతంబుఁ జూపక కీర్తి గలదె? చిత్ర... 37

బొచ్చెచేఁపకు నైన మచ్చరం బున్నది
తాఁబేటి కైన సత్త్వంబు గలదు
డీకొన్న నడవిపందికిఁ గల్గు రోసంబు
తెరనోటినరుఁ డైనఁ దెగువ సేయుఁ
బొట్టివానికి నైన దిట్టతనం బుండు
బాపని కైన దర్పంబు గలదు
చుంచురాజున కైన శూరత్వ మున్నది
ముసలికి నైనఁ జేపుష్టి గలదు
సిద్ధ మాభీరుఁడవు నీవె బుద్ధి నెంచఁ
గలికి వై యేమి సేయఁ గలవొ కాని చిత్ర... 38

మును నందగోవత్సములఁ గాయునప్పుడు
సనుసయించిరె కంజజాది సురలు?
విటచోరచేష్టల వ్రేపల్లెఁ దిరుగు నీ
దగుమ్రోల నచ్చర లాడినారె?

నరరథాశ్వముల సంగరవీథి దోలునా
డెంచి దిక్పతులు భావించినారె?
మగధేశుదాడికి మథుర వీడిననాడు
దేవర్షు లెల్ల గీర్తించినారె?
యల్పునిగ నెంచినారె లోకైకనాథ
నాథునిగ నెంచినారె మున్ధరణి? జెపుమ చిత్ర... 39

పూతనాకుచ కుంభపూర్ణవిషస్తన్య
పాయివై బ్రదికిన భాగ్య మేమి?
కాళియాశీవిషగ్రసన ప్రమాదంబు
గడచి జీవించిన ఘనత యేమి?
చాణూరమల్లదో స్తంభ ఘట్టన కోర్చి
లబ్ధజయుడ వైన లాభ మేమి?
సాళ్వరాజామోఘ శక్తిప్రయోగంబు
మరలించుకొనిన సామర్థ్య మేమి?
బడుగుదాసరివలె నన్నవస్త్రములకు
బరుల కాశింతు విచట నీపంత మేమి? చిత్ర... 40

పట్టి గొల్లది రోట గట్ట నోపినసీకు
రోసంబు లే దన్న నీసు గలదె?
జారచోరాదిచేష్టల బ్రవర్తిల్లు నీ
కపకీర్తి యన్న భయంబు గలదె?
భార్యచే దన్నులు బడ్డవానికి నీకు
లజ్జ లే దని యన్న లాఘవంబె?
కుండంటు లే దని కొసరి మెక్కిన నీకు
హీనత లెంచిన న్యూన మగునె?
కోరి దాసులు ని న్నెంత దూరుచున్న
బంత మున్నదె నీ కిసుమంత యైన? చిత్ర... 41

కడు దొంగతనమున(గని తల్లి వైచిన(
దనబిడ్డనిగ(బెంచె నిను యశోద
జనని గర్భము దించుకొనిన వేఱొకతల్లి
కడుపు(జేసికొనంగ(గలిగెనన్న
తండ్రి వివాహయత్నము సేయ నొల్లక
తగులుక వచ్చె నీధర్మపత్ని
యన్న రారాజు కీనున్న నీసోదరి
యింటికి జోగిరా నంటుకొనియె
నిట్టి నీసంప్రదాయంబు గుట్టు బెట్టు
రట్టు సేయుదు(గనుము నాభట్టుతనము చిత్ర... 42

పక్షింబు గల దండ్రు పాండుపుత్రులయందు
పాండవుల్ పడినట్టి పాటు లేమి!
పూర్వజన్మమునందు(బూజించె గజ మండ్రు
గజరాజు పొందిన గాసి యేమి!
యల కుచేలునకు బాల్యస్నేహితు(డ వండ్రు
నెఱి(గుచేలు(డు పడ్డనెవ్వ లేమి!
ప్రహ్లాదు(డాజన్మభక్తియుక్తుం డండ్రు
ప్రహ్లాదు(డొందిన బాధ లేమి!
యెంతయాలస్యమున వారి నేలినా(డ
విట్టిదే నీదయారసం బెంచి చూడ చిత్ర... 43

అనఘ మౌ విప్రసత్రాన్న మెంగిలి(జేసి
తీవె మున్ క్రతుభోక్త నేనె యనుచు
సవతితల్లికొమాళ్ళ సమయించి తండబీ(
దరుగని రాక్షసాంతకు(డ ననుచు
బంధువు లన్యోన్య వైరానుహతులుగా
నడచితి భూభారహారి ననుచు

బలిమి నన్యస్త్రీల బట్టితి వెందఁబో
నస్ఖలద్బ్రహ్మచర్యమతి ననుచు
లోకమున నడ్డ మెవ్వరు లేకయునికి
హద్దు లే కిట్లు నడచితి వఖుకు మాలి. చిత్ర... 44

ఆది యోగ్యంతరం గాలానబంధంబు
వదలించుకొన నీకు వశము గాదొ;
వేదాంత సకృద చుంబితల మంత్రావర్ణ
నల గుహలుండి రా నలవి గాదొ;
నిమి షార్ధనిమిషాది నిత్యవేళాచక్ర
గతి నిరోధించి రా గ్రమము గాదొ;
వక్రకంటక పంకవక్త్రోరజనమనః
కాపథంబులను గా ల్మోపరాదొ;
యేమి యాలస్య మిది నీకు నేల సకల
జంతుసంతాన రక్షావిచక్షణునకు. చిత్ర... 45

కఠిన స్తనంబుల ఘట్టించి దట్టించి
జడలచే మోది నుద్దొడల నదిమి
పలుగంట్లు చేసి గోరుల నాటి దొమ్మిగా
యువతీసహస్రంబు లుపరతాది
బంధనంబుల నిన్ను బైకొని తమి రేచి
రమియింప నిదురింప రాక నాటి
బడలిక దీఱ నాపగ రాని సుఖనిద్ర
బవళించియున్నట్టి భావ మిచట
దోచుచున్నది సంపుల్లతోయజాక్ష;
మేల్ బళా; యింక జా గేమి మేలుకొనవె; చిత్ర... 46

నీబొడ్డుదమ్మిలోనికి జొచ్చి చూచిన
నలువకు నీలోతు దెలియకున్నె ?

బహుసహస్రాంగనా గృహముల నినుఁ గన్న
మునిరాజు సీమాయఁ గనకయున్నె ?
నీవిశ్వరూప మెన్నిక జేసి కొడఁగన్న
నరుఁడు నీయురువు దా నెఱుఁగకున్నె ?
తనమనఃపీఠి ని న్ననిశ మారాధించు
హరుఁడు భవత్తత్త్వ మరయకున్నె ?
గువ మేటికి నీమర్మ మెఱుఁగ రనుచుఁ
దెలిసినమహాత్ములకు నైనఁ దెలియకున్నె. చిత్ర... 47

పురుషాకృతిగ నిన్ను గురుతుఁ బట్టఁగ రాదు
స్త్రీమూర్తి వనుచును జెప్ప రాదు
పరఁగ నపుంసకభావ మెన్నఁగ రాదు
రూపంబు గల్గు నెఱుంగ రాదు
గుణవంతుఁడ వ టంచు గణుతింపఁగా రాదు
మర్యాద దెలియ నేమతికి రాదు
కులజుఁడ వనుచు నిక్కువముఁ జెప్పఁగ రాదు
స్థల మెక్కుడనొ కాని తెలియ రాదు
వస్తునిర్దేశ మొనరింప వశము గాని
నిన్ను వర్ణింపరా దయా నిశ్చయముగ. చిత్ర... 48

నమ్ముదు రేరీతి నారదు నాత్మజు
మానిని జేసిన మాయవానిఁ ?
దలఁతు రేరీతి నల్దలలదయ్యము నోలి
బొడ్డుదమ్మునిఁ గన్న పురుషమణిని ?
భూషింతు రేరీతి పుష్పబాణవిరోధి
విషయభ్రమితుఁ జేయు వేసగాని ?
భాషింతు రేరీతి బ్రహ్మాదిమశకప
ర్యంతంబు గలిగిన వింతవాని ?

ని న్నెఱిఁగెఱింగి యందఱు సన్నుతింతు
రెవ్వరికి నీవు కావలె నెంచి చూడ? చిత్ర... 49

ఎక్కడ నీకన్న దిక్కు లే నట్లు ని
న్నర్చింతు రబ్జగర్భాది సురలు
మఱి యెందు గతి లేనిమాడ్కి మహామును
ల్నీయందె లక్ష్యము ల్నిలుపు కొందు
రిలఁ దరణోపాయ మెందున లేనట్లు
సజ్జనుల్ నీకథల్ చదువుకొండ్రు
పగతుర మెయ్యేడ బ్రతికెద మన్నట్లు
దునిసిరి నీచేత దనుజు లెల్ల
దత్త్వ మరసిన శుద్ధబుద్ధస్వరూప
మింత యధికార మెన్నటి దేమి చెపుమ. చిత్ర... 50

ఆడించెదవు బొమ్మలాటవాఁడును బోలె
సర్వచరాచరజంతువులను
కనుకట్టు గజ్జెదు గారడీఁడును బోలె
మిథ్యాప్రపంచంబు తథ్యముగను
వేర్వేఱఁ దోఁతువు వేషధారియుఁ బోలెఁ
బహువిధదేవతాభద్రకళలఁ
దెలివి మాన్పుదువు జక్కులవాని చందానఁ
బ్రజల సంపద్రంగవల్లిఁ జేర్చి
యిట్టివే కద నీవిద్య లెవ్వి యైన
నింక నేమిట ఘనుఁడవో యెఱుఁగరాదు. చిత్ర... 51

కూరిమి నల తంతెగొట్టు సన్న్యాసితో
ముచ్చటించెద వేమి పుణ్యమూర్తి
సాటిగా వెలిగొండవీటి జంగమచెల్మిఁ
బరింతు వేనాఁటి బాంధవుండు

వెలిపాపపాన్పుపై వేడ్కతో బవళింతు
పది యేమి భోగిభోగాంతరంబు
పొరుగిండ్ల కేప్రొద్దు బో రా దలచునింతి
బాయకుండెద వేమి భాగ్యలక్ష్మి
మంచిసహవాసములు గల్గె నెంచి చూడ
నీకె తగు నట్టివారితో నెనరు నెఱప. చిత్ర... 52

అఖిలపోషకుండ వ న్నాఖ్య మాత్రమె కాని
కర్తవు నీవె భోక్తవును నీవె
యఖిరుండ వను ప్రఖ్యాతి మాత్రమె కాని
చర్చింప వేఱొండు సాక్షి గలడె
సుగుణాబ్ధి వని నిన్ను స్తుతి యొనర్చెఁ కాని
నిర్గుణుం డెవ్వఁడు నీకు మించ
విశ్వాత్మ్మఁడ వ టంచు వినుతించుటయె కాని
చొచ్చి ని న్నెవ్వఁడు చూచినాఁడు
వినుకలులె గాని నిన్ను నీవిశ్వములను
మొద లెఱుంగుదురే నిజంబునకుఁ బిల్వ. చిత్ర... 53

ఒకగుణంబున నీవె సకల ప్రపంచంబుఁ
గల్పించితి వభూతకల్పనముగ
వేఱొకగుణముచే విశ్వవిశ్వప్రాణ
రక్షణం బొనరింతు వక్షయముగ
మఱి యొండు గుణముచే మండలంబులు గూడఁ
జెఱపివేయుదువు నిశ్శేషముగను
నిర్గుణంబున నీవె నిరవకాశంబుగాఁ
బట్టక యుందువు బయలు మెఱసి
గుణ మొకటి గాదు తెలిసినగుణము లేదు
చేరి నినుఁ గొల్వరాదు వచింపరాదు. చిత్ర... 54

జీవిని జీవి భక్షింప జేసితి వింతె
కొని పెట్టినావె చేతనుల కెల్ల ?
జేసినంత భుజింప జేసినా వింతె కా
కెక్కువ లెవ్వరి కిచ్చినావు ?
కర్మసూత్రంబున గట్టి త్రిప్పెదవు గా
కిచ్చ నొక్కనిం బోవనిచ్చినావె ?
వెస బృథక్ప్రతుల వేఱుబెట్టితివి గా
కందటి కైకమత్స్య మిడినావె ?
తెలిసె నీరక్షకత్వంబు దేవదేవ !
వేఱె గతి లేక నిన్ను సేవింప వలసె. చిత్ర... 55

నీరుపట్టుగ నుంట నారాయణుఁడ వంద్రు
నారాయణాఖ్యాధికార మేమి ?
బలిసి యంతట నీవె గలుగ విష్ణుఁడ వందు
రావిష్ణునామప్రభావ మేమి ?
ముగురు నీవై వెలుంగఁగ గేశవుఁడ వంద్రు
కేశవాభిఖ్యాప్రకాశ మేమి ?
సిరికి మగఁడ వై మెరయ శ్రీపతి వంద్రు
శ్రీపతినామప్రసిద్ధి యేమి ?
పెట్టుపేరు లనేకముల్ పుట్టుపేరు
గుఱు తెఱింగిన నీమూల మెఱుఁగవచ్చు. చిత్ర... 56

వేఁడని చూడక విపినవహ్నిజ్వాలఁ
ద్రావెదో తేనియఁ ద్రావినట్లు
భార మం చనక గోవర్ధనపర్వతం
బెత్తెదో పూబంతి యెత్తినట్లు
విషపుంజ మనక నాభీలాజగరజిహ్వఁ
జింపెదో ప్రాబట్టఁ జింపినట్లు

వెస నసాధ్యం డని వెరవక నరకుని
నటికెదో పార్శ్వ(ట నటికినట్లు
భక్తసంరక్షణ త్వరా పరవశతను
జేసినా వేమొ యూరక సేయ(గలవె ? చిత్ర... 57

వత్సాపహారణగర్వము మాని యజు(డు దా
నపరాధి ననుచు సాష్టాంగ మెఱ(గె
భవు(డు బాణున కాజి బాసట యై వచ్చి
భక్తుని(బ ట్టిచ్చి ప్రణతి(జేసె
వజ్రి శిలావృష్టి వర్షించి లజ్జించి
తప్పు(జేసితి నంచు దండ మిడియె
సమవ ర్తి భీతి నంజలి(జేసి యాత్మలో
కస్తితు గురుపుత్రు(గాను కీచ్చె
క్షోణి(బుట్టుక మాలిన గొల్లవాని
నిన్ను నావేల్పు లోడింప నేర రేమి ? చిత్ర... 58

కొన ముట్ట హెచ్చుతగ్గుల ప్రా(తసుద్దుల
తాతపు స్తక మొక(డాతతాయి
మ్రుచ్చిలి నీటిలో(జొచ్చి డా(గిన వాని
పావన మేమి వెంబడిగ(బెద్ద
కోఅమీనంబ వై యాతొండుసంద్రము
ల్నిముసంబులో నీ(ది నెమకి వాని
డొక్క ప్రక్కలుగా(గఱుక్కున బరి(గోసి
కడ లేనినుడువు లెక్కటికి నోట
మాట వెళ్ళనివానికి మగుడ నిచ్చి
యింతపనికిని నవతార మెత్తి తీవు. చిత్ర... 59

అబ్ధిపయఃపాత్ర మద్రికాణంధాన
మహిరాజగుణము దా రమర(గూర్చి

యమృతాభిలాష దేవతాసురుల్ మథియింప
గిరి మున్గ, గచ్చపాకృతి వహించి
నిర్వహించుట గాని సర్వకాశ్యపులలో,
బజ్జ్ఞభేదము, జేసి పల్మ తూప
కొల్పి దైత్యులనోరు, గొట్టి యాదిత్యుల
కమృతాన్న మిడితి వాయమరులందు,
బక్షపాతివి గావె ? యభక్తి, బడిరి
నమ్ముదురె యానిశాటు లెన్నటికి నిన్ను. చిత్ర... 60

ఉక్కున, బసిడికన్ రక్కసు, డొక, డు ప
ల్దిక్కు లోరిచి బొల్లిపక్కు మావు
నెక్కు రౌ తెక్కడ, జిక్కెడు నంచు నీ
యిక్కువ లరయంగ, గిక్కురించి
నక్కతి విలక్రింద, జొక్కపు, బంది వై
కొక్కరింపుచు నాత, డక్కడికిని
మొక్కరింప, గ, జొర, బొక్క లేకట వాని
డొక్కగఱుక్కున, జెక్కపట్టి
నొక్కు పుడ మింత నీటిపై కెక్క, దీయ
మక్కువ దనర్ప నది యేమి రక్కరింపు. చిత్ర... 61

అయవారు చదివించినట్లుగా, జదువక
మఱి కొటి తిటక వెఱపు, గొనక
తనయు, డెంతో పరధ్యానంబుగా నున్న,
దండ్రి వ ల్దని చెప్ప, దగ, డె ధాత్రి
నీకు, గోపం బేమి నృహరిరూపంబున
స్తంభంబులో, బుట్టి చటులనేత్ర
దంష్ట్రానఖప్రభ దహనకీలల, బోలి
భగ్గు రనంగ, బై, బడి హిరణ్య

కశిపుఁ దునుమాడి ప్రహ్లాదుఁ గరుణ నేలి
తండఁటి కసహ్య మయ్యె ని న్నపుడె కనఁగ. చిత్ర... 62

కశ్యపుఁ డదితి ని న్గన్నవారలు గారె
పెంచిరే మరుగుజ్జుబిడ్డ వనుచుఁ
గుండిక దండంబు గోఁచితో వచ్చిన
కపటవటుండు నిక్కముగ భూమి
సురుఁడు గాఁ డని యాత్మగురుఁ డీయవల దనఁ
గరుణించి బలిదాత కామితార్థ
మొసగంగ నభివృద్ధి నొంది మే లోర్వక
ధర్మంబు నాల్గుపాదముల జరుపు
నట్టిదాతను దిగఁద్రొక్కి యతనిసిరులు
దెచ్చి కులగోత్రభేది కీ నిచ్చకంబొ. చిత్ర... 63

జపతపోనిష్ఠుఁ డౌ జమదగ్ని కుదయించి
కరము దారుణవృత్తిఁ గత్తి కట్టి
కినుక రాజద్రోహమునకు శంకింపక
సకలభూపతుల గొంతుకలు గోసి
కార్తవీర్యార్జును కరసహస్రం బొండు
తటి గంద్రగొడ్డంట నటికివ్వై చి
వసుధపై రక్తప్రవాహంబు లొనరించి
తజ్జలంబులఁ బితృతర్పణములు
సేసి యిల విప్రులకు ధారఁ బోసినట్టి
కీర్తియే కాని బ్రాహ్మణకృత్య మగునె. చిత్ర... 64

తా వచ్చెద నటంచు ధైర్యలక్ష్మి మహీజ
వెంట రా నడవికి వెడలినావు
సుగ్రీవుఁ డున్నచో సొమ్ము దా నిడ సీత
యాజాడ నతనిపొం దతికినావు

ముందు జానకి లంక మూర్ఛించి చొచ్చి నిన్
దెచ్చినరిపుల సాధించినావు
వై దేహి భవదంకవసతి గూర్చున్నచో
భువనసామ్రాజ్యముల్ పొందినావు
గట్టిగా మైథిలిని జెట్ట బట్టినట్టి
పౌరుషము లబ్బె నేనాటి పూరుషుడవొ. చిత్ర... 65

ధర్మవిభూత మిద్ధర నీ వొనర్చిన
మూడులోకంబులు మ్రోసె నపుడె
జనకునికూతు నిచ్చను బెండ్లి యాడంగ
నరనాథకోటులు నవ్వి రపుడె
పుణ్యాజనంబుల బోరి బాధింపంగ
సుర లద్భుతము నొంది చూచి రపుడె
సంతతాశ్రిత విభీషణు రాజు జేయంగ
నల రవీందులు సాక్షి నిలిచి రపుడె
మంచినడవడి నడిచినా వెంచి చూడ
గీర్తి గల మూర్తివే యిట్టి వార్త లరయ. చిత్ర.... 66

సన్మని నధ్వరసాఫల్యు గావింప
జానకీపరిణయోత్సవము గలిగె
రవినందనుని గీశరాజ్యాధిపతి జేయ
సేతుబంధనకీర్తి జెంద గలిగె
బహు దేవతాస్త్రీల బందిగంబుల బాప
జెఱ నున్నవై దేహి జెంద గలిగె
నలవిభీషణుని లంకాధినాథుని జేయ
నెలమి నయోధ్య నీ వేల గలిగె
నబ్బె నీకు బరోపకారైక ఫలము
లంతియే కాక నీచేత నైన దేమి చిత్ర.. . 67

ఒకపినతల్లి మే లోర్వలే కనిచిన
విపినంబులకుఁ బోవు వెట్టి గలఁడె ?
తండ్రి మృతుం డైనఁ దనరాజ్య మత్తటి
నేల రాకుండిన బేల గలఁడె ?
యనుజుండు వల దన నాలిమాటలు విని
చెడుగిట్టిఁ బట్టఁ బో వెడఁగు గలఁడె ?
పరదేశమున నుండి బలవద్విరోధంబు
బలిపించుకొన్న వెంగలియుఁ గలఁడె ?
నీవు సేసినపను లిట్టి నేరుపరివె
జగదుపద్రవ మెట్లు పోఁ జబుచినావొ. చిత్ర.... 68

నినుఁ గోరి కన్నతండ్రిని నీనిమిత్త మై
చింతించి మృతిఁ బొంద జేసినావు
నిను వని న్నేవింప ననుజు నాఁకటి కేమి
యెసఁగ కీవే పండ్లు మెసఁగినావు
నినుఁ గపు ల్గొల్చి తల్చినకార్య మీడేర్పఁ
బిదపవారలఁ జెట్లఁ బెట్టినావు
నినుఁ బాయ కడవికిఁ జనుదేర నిల్లాలి
నొరుపంచఁ గొన్నాళు లుంచినావు
రాజకళఁ జూచి ని న్నొక రాజు వనిన
మానుషం బేది ? యిది యంత మాయ గాని. చిత్ర.... 69

కులగురు ద్వేషి నొజ్జలుగ వెనొ్కని కాచి
నిష్ఠురమంత్రము ల్నేర్చినావు
పూర్వదేవతలు కాపుర మున్నపురియందు
వంచించి యగ్గిఁ బెట్టంచినావు
తాతలతరమునఁ ద్రవ్వించినపయోధి
పేరుగాఁ గొంత పూడ్పించినావు

మోస మౌ టెఱుఁగక మోహించి వచ్చిన
యెలనాగమున్కఁ గోయించినావు
బళిర ! నీవంటిధార్మికుఁ బ్రస్తుతింపఁ
గొదువ లిం కేమి కైవల్య మెదుట వచ్చు. చిత్ర.... 70

శౌర్య మెక్కించి విశ్వామిత్రుఁ డూరకఁ
దొడరింపఁ దాటకఁ దునిమినావు
వై దేహి వాక్యనిర్బంధంబుఁ ద్రోయలే
కటిముటి మారీచు నటికినావు
వెనుకంజ వైచిన విడువక పైకి రా
నరుదుగా ఖరుతలఁ దరిగినావు
మొట్టో యనుచు దేవమునులు వా రెన్నాళ్ళో
యనుసరింప దశాస్యుఁ దునిమినావు
కాని రోసంబు గలదె నిక్కముగ నీకు ?
మనసు మెత్తనివాఁడ వే మనఁగ వచ్చు. చిత్ర... 71

కొంచెపుఁ బని దాసి నించుక దండింపఁ
బగబట్టి యది యెన్నిపాట్లు వెట్టె
బలిమినిఁ బట్టి శూర్పణఖ నాసికఁ గోయ
నది నీకుఁ బిదప నెం తలఁతఁ దెచ్చెఁ
జిన్నతనంబునఁ జెనకి పోఁ దోలిన
మారీచుఁ డొనరించె మాయ లెన్ని
నిరపరాధుని వాలి నురుశరాహతిఁ గూల్ప
వానియిల్లా లెంత వగచి తిట్టె
స్వామి వై యేమి యెఱుఁగవు స్వల్పకార్య
కారణంబున నెన్నెన్ని కతలు పుట్టె. చిత్ర... 72

నీపేరు వినుటకే యోపక చెవిఁ గంట
గట్టుకున్నాతనిఁ గావ నేమి ?

కలన నీతోఁ గత్తిఁ గట్టుక పోరాడు
వాని సోదరునిఁ బ్రోవఁగఁ బ నేమి ?
బాధింపఁ దగుమహాపాతకుం డటు చేరి
నీవాఁడ నంచె మన్నింప నేమి ?
మాయవేసముల నీ మర్మ మారయుచున్న
విమతదూతలఁ బట్టి విడువ నేమి ?
పతితశరణాగతావన ప్రకటదీక్ష
లోకముల కబ్బారంబుగ నీకె కలదొ ? చిత్ర... 73

పఱపిన శస్త్రంబె బహుముఖంబుల దైత్య
వాహినీమర్మము ల్వచ్చి వెడల
ముందు దూసిన బాణమునకన్న సరి మించి
వెనుకమ్ము దైత్యుల విఱుగఁ బొడువ
నేసినమార్గణం బెదు రెక్కి యితరాస్త్ర
మడఁచి క్రవ్యాదుల మగుడఁ జేయ
నిగిడించిన శరంబె నిర్జరారులఁ ద్రుంచి
తొడిఁదొడిఁ దనకుఁ దా దొనకుఁ జేరఁ
దొలఁగి రసురులు కొంత నీబలిమి దెలిసె
ముష్టి నీ దెంత నీయస్త్రములదె యింత. చిత్ర... 74

అడవిలోఁ దెరువర్ల నుడుగక తినుచున్న
యాఁడుదాని వధించు టర్హ్యా మగునె ?
చిక్కినవారికిఁ జేతు లెంతయుఁ జాఁచు
మొండివాని వధించ ముఖ్య మగునె ?
యెక్కఁ డెక్కఁడ నైన నేఱుక తినుకాకి
కన్ను బోఁ బొడుచుట ఘనగుణంబె ?
కడు వ్రేటుఁ బడి గడ్డి కఱచిన మారీచుఁ
దటిమి బాధించుట నెఱతనంబె ?

యెవ్వ రేరాజు లొనరించి రిట్టిపనులు ?
చేసితివి యింక నె ద్దేని సేయఁగలవు ; చిత్ర... 75

రాజకార్యపరుండు తేజోబలాధికుఁ
డాంజనేయుఁడు భృత్యుఁ డగుటఁ జేసి
యమితశౌర్యుఁడు ప్లవంగమకులేశుఁ డినజుఁ
డటు లేని స్నేహితుఁ డగుటఁ జేసి
విమతమర్మజ్ఞుండు విశ్వాసభరితాత్మఁ
డల విభీషణుఁ డాప్తుఁ డగుటఁ జేసి
సుమనస్కు లమనస్కు లమృతవాక్యంబులన్
బొసఁగ నాశీర్వదించుటనుజేసి
లంక సాధించితివి గాని లావుచేత
నిర్జరారుల గెలువంగ నీతరంబె ? చిత్ర... 76

నడువఁజాల దని జానకి నెత్తుకొని ముందు
నడచు విరాధుని నఱుకు టేమి ?
చనవున వై దేహి చనుబిడ్డవలెఁ నోటఁ
బట్టిన యైంద్రి కన్గొట్టు టేమి ?
సీత సంతోషింపఁ జిత్రవేషముఁ దాల్చి
తిరుగు మారీచుని నరుకు టేమి ?
తల్లినివలెఁ దెచ్చి ధరణీజను నశోక
వని నిల్ప రావణుఁ దునుము టేమి ?
కోప మిటు లేమి ? వారు మహాపరాధు
లైన ముక్తిప్రసాదార్హు లగుట యేమి ? చిత్ర... 77

పరరాజ్యకాంక్షలోఁ బట్టకుండెద వైన
సుగ్రీవునగరంబుఁ జూడరాదె ?
పరధనంబున కాస పడక యుండెద వైన
నాలంక నొక్కరాయి యంటరాదె ?

పరయోష పై నిచ్చ బాయ కుండెద వైన
నల శూర్పణఖముక్కు నిలుపరాదె ?
పరదానవుల బ్రుంప బంతగించెద వైన
మూల దైత్యుల దోలి పుచ్చరాదె ?
చేసిన ప్రతిజ్ఞలో నొండు వీస మైన
దప్పు వోకుండ నడచిన ధార్మికుడవౌ ! చిత్ర... 78

నిర్దయాత్ములె కాని నిత్యాగ్ని హోత్రాది
కర్మనైష్ఠికు లైన ఘనులు గారె ?
శుచిశూన్యులే కాని శ్రుత్యాదిపాఠక
ప్రకటవేదార్థబోధకులు గారె ?
సత్యహీనులె కాని చంద్రశేఖరపాద
పద్మపూజానందపరులు గారె ?
మాయికులే కాని మంత్ర ప్రయోగోప
సంహరణ క్రియాచణులు గారె ?
కులము బ్రాహ్మణ్య మగు దైత్యకులము నెట్లు
గూల్చితివి బ్రహ్మహత్యకు గొంక కహహ ! చిత్ర... 79

ఒక్కవ్రేటున బూలునో వాలి బలకాలి
చెట్లుమా టొగ్గి వేసితివి గాని
మొనసి నీల్గునె పజ్జ్రెముఖుడు తన్నాభికా
మృతకుంభ మగల గొట్టితివి గాని
కుంభకర్ణుడు రణక్షోణిలో దీరునే
తీఱని నిద్ర నెదిర్చె గాని
చిక్కునే యింద్రజి త్తుక్కున సోదరుం
డశనిద్రలు మాని యడచె గాని
యింద ఘాయంబు లెరుగుదు వందువలన
మడిసి రసురులు నీచేత మడియువారె ? చిత్ర... 80

మొసలి బెట్టినక స్తి మొట్టి బెట్టినహ స్తి
రక్కరించితి నన్నరంబె మేమి ?
తులువ పల్వారిలోన వలువ విప్పగ జాన
సిగ్గు గాచితి నన్నపగ్గె యేమి ?
బలువు కోపముచేత బండపాటిననాతి
అంకు బాపితి నన్న బింక మేమి ?
పెద్ద మోదినభీతి బెగడి వచ్చినకోతి
కండ జేసితి నన్న యంద మేమి
భవభయంబున ని న్నెంత ప్రస్తుతింప
గరుణ జేపట్ట లేని నీ ఘనత యేమి ? చిత్ర... 81

నీచువాసనచేత నీటిలో నుండుట
యెక్కవప్పులను రా యెత్తుకొనుట
కడుపాకటికి దుంగకాయలు మెక్కుట
యని నోరు దెఱచి పె ల్లఱచుచుంట
సిరి గల్గి బిచ్చపుజిప్ప జేపట్టుట
చేక త్తి పరరాజుచేతి కిడుట
పట్టణప్రజకు జెప్పక పాఱిపోవుట
కలు ద్రావి నిను నీవె దెలియకుంట
మ్రాను వై యుంట గుట్టుపుమనిసి వంట
పుడమి నాడిక సేయక విడువ నిన్ను. చిత్ర... 82

ఖరు నాజిలో జొచ్చి శర ముచ్చి పో నేయ
వెనుకకు లంఘించి వెఱచె ననిరి
యని బాఱునో కోతి యని మ్రానిమాటున
నేయ వాలిని బొంచి యేసె ననిరి
గరుడధ్వజుం డన్న గురుతు దెల్పుట కున్న
బలభీతి శస్త్రాహి బద్ధు డనిరి

బలిఁ జంపఁగ రానివరమున యాచింప
వృత్తి నాతని భిక్ష మెత్తె ననిరి
యశ మ దెంతొ ప్రయాసలభ్యంబె కాని
యేంతలో వచ్చు నపకీర్తి యెఱుఁగ వేమి. చిత్ర... 83

ఘోరకబంధుదీర్ఘోరుదోర్దండముల్
తరిగి వచ్చిన మాట తథ్య మేని
పంజ్ఝ్కకంతాత్మజ ఫణీరాజబంధమో
చనుఁడ వై వచ్చుట సత్య మేని
మైరావణాభేద్య కారాగృహముఁ గూల్చి
బ్రదికి వచ్చినపల్క్ భద్ర మేని
మారీచు దుస్తరమాయాభ్రమతఁబాసి
విజయ మొందినసుద్ది నిజమ యేని
కలితరాజోపచారభోగములఁ గీర్తి
కాలి వై యిందు మెఱయుట సాక్షి జగతి. చిత్ర... 84

నీకాంతి యంభోధినిర్భరాంబువులు బా
ణముఖంబునకుఁ దెచ్చునాఁడె తెలిసె
నీకోప మరి రావణైకానుజన్మ నా
నగరి రాజుగఁ జేయునాఁడె తెలిసె
నీకీర్తి కపటదుర్మీతుఁ డౌ ధ్వాంక్షదా
నవుతప్పుఁ గాచిననాఁడె తెలిసె
నీయభిజ్ఞత యవినిందిత సీతన్వి
నగ్నినిఁ జొరు మన్నయపుడె తెలిసె
నెంచరాని గుణాఢ్యుఁడ వీవె య నుచుఁ
దెలిసి మ్రొక్కెద నితర మౌ దిక్కు లేక. చిత్ర... 85

జనకువాక్యమున రాజ్యవిసర్జనమె కాని
యడరుశౌర్య మొకింత విడిచినావె ?

దీక్ష నాభరణము ల్దివియు మాత్రమే కాని
వర ధనుర్బాణము ల్వదలినావె ?
వ్రత మని కాంచనాంబరము గట్టవు గాని
బిగువు వజ్రాంగి మై విడచినావె ?
ప్రతిన బదార్థమే మితర మొల్లవు గాని
యభిమానధనముపై నలిగినావె ?
నిఖిలరక్షోవిదారణ నిర్భయాంక
వేషధారివి నీ మునివృత్తి యేమి ? చిత్ర... 86

వెఱపించ గలవొ చేవిలు నీ కొసంగి తా
విగతరోషం డైన విప్రవరుని
గట్టించ గలవొ సాగరముపై సేతువు
మలల గోతులమూక లలర బట్టి
ఘనత నీ గలవొ యన్నను గొట్టి తమ్ముని
కారాజ్య మాచంద్రతారకముగ
వేంచేయ గలవొ విస్వీథి దేరగ నున్న
పుష్పకం బెక్కి నీపురికి మరల
జగతి నిటు సంతతోత్సాహచరణమునకు
యుక్తి సేయుదు వోహో నీశక్తి దెలిసె, చిత్ర... 87

ని న్నెదుర్కొన రాని నెపమున గోపించి
గోపితహితు సూతు గొటవలెనె ?
సంబంధినోట గొంచెపుమాట రా వాని
కరిపురం బలుక బెకల్పవలెనె ?
నిను జూచి వేడ్క నొందిన గర్వముగ నెంచి
నిండి పాఱెడు నేరు నిలుపవలెనె ?
చెలికానివలె నొద్ద చేరి యెత్తుకొనంగ
గినుక ప్రలంబుని దునుమవలెనె ?

ఎంతరోసంబు గలవాఁడ వేమి నీవు
తెలివికాఁడవె బలరామ ! తెలిసె నిందు. చిత్ర... 88

పరపురుషాకృతి గురుతుగాఁ జూడక
త్రిపుర పతివ్రతాతిలకములను
విటపయుక్తి భ్రమించి విఫలభ్రమతఁజేసి
తత్సతీపతుల దుర్దాంతబలుల
హతము సేయించితి వల మహానటునిచే
రథరథాంగాశ్వసారథిశరాన
గుణనిషంగాస్త్రము లొక్కరిన ట్లుండు నే
సమకూర్చి యసురుల సంహరించి
సాహసుఁడ వైతి ని న్నుంచి శంకరుండు
త్రిపురసంహరుఁ డనునాఖ్యఁ దెచ్చుకొనియె. చిత్ర... 89

సకలవర్ణంబులు సంకరంబులు జేసి
యఖిల ధర్మములు శూన్యములు సేసి
భూతలంబును బాపభూయిష్ఠముగఁ జేసి
పరగఁ బ్రపంచంబు భ్రష్టు సేసి
కలి విజృంభించిన కడపటనా నీవు
తురగవాహనుఁడ వై దోర్విరాజి
ఖడ్గచంచద్ధారఁ గలుషాత్ముల వధించి
శిష్టసంరక్షణ సేయు బెల్లు
నిశము చరాచరాది జీవావనైక
జాగరూకుఁడవా నీవు జాగు దెలిసె. చిత్ర... 90

భువనమోహన ! కృష్ణమూర్తివి నీ వేని
ఆలీల లిచ్చట నాడవలదె ?
బలసముజ్జ్వల కామపాలుఁడ వీ వేని
దీపించి యాబల్మిఁ జూపవలదె ?

వీరనృసింహావతారుఁడ వీ వేనిఁ
దత్తేజ మిం తైనఁ దాల్పవలదె ?
సత్యవిక్రమ ! రామచంద్రుఁడ వీ వేని
ఆపౌరుష మొకింత చూపవలదె ?
యెంచ దేవర దైవమో యీవె కాని
చూపఱకు నీదుమహిమను జూపవలదె ? చిత్ర... 91

ఆలగాపరివాఁడ వనక ని న్నఖిలవే
దాంతమార్గవిహారి వందు నేమి ?
హలముఁ బట్టినవాఁడ వనక ని న్నహువిధా
జాండనిర్వాహుఁడ వందు నేమి ?
యలసారివాఁడ వం చనక నిన్ను సమస్త
శాస్త్రప్రపూర్ణుఁడ వందు నేమి ?
యడవి ద్రిమ్మరివాఁడ వనక ని న్నకలలో
కాపన్నివారుఁడ వందు నేమి ?
పుడమి నీ దగు కొంచెపునడత లెంచ
కభినుతింతునె లోకైకవిభుఁడ వనుచు. చిత్ర... 92

మామయింటికిఁ బోవ మంచితీర్థము వుట్ట
దతఁ డంత కారువాఁ డతఁడె సుమ్ము
పునుక కంచము తోలుపుట్టంబు గలమిత్రుఁ
డెందు నన్నముఁ బెట్టు నేమి గప్పు
మాటమాత్రం బైన మగువ నో రాపదు
కొడుకు పెట్టునె తలగొట్లమారి
యన్నది మేషాండ మున్న దిచ్చే దొకఁ-
తొట్టిగొ డ్డది నీకుఁ దోలు నేమి
ఎవ్వరింటికిఁ బోయిన నేమి ఫలము
ఉన్నచో నుండి సిరులఁ బెంపొందు మయ్య. చిత్ర... 93

దుర్జనభంజనోద్యుక్త సుదర్శన
ధారివే నీవు యధార్థముగను
శాత్రవభయద నిస్వన పాంచజన్య భూ
షితకరాంబుజుఁడవే సిద్ధముగను
మతారిభేదనాయత కౌమోదకి
నిజకరభరిత మే నిశ్చయముగ
ఘోరవిద్వేడ్రక్త ధారార్ద్రనందక
సంధానపాణివే సత్యముగను
సన్నుతామోఘ బాణైకశార్ఙ్గచక్ర
శయుఁడవే నమ్మవచ్చునే స్వామి ! నిన్ను ? చిత్ర... 94

ఇల్లు రత్నాకరం బెన్నాళ్ళకును జాలు
జీవనం బొరుల యాచింపవలెనె ?
యింట మహాలక్ష్మి యెప్పుడుఁ దాండవం
బొనరించు నొకఁడు నీ కొసఁగవలెనె ?
స్థిరత లోలోన నిక్షేపించు ధనము నెం
చఁగ రాని దొకరిఁ జేఁ జాపవలెనె !
పంటపైరులకాఁపు కంటఁ గాయుచునుండు
కోరికఁ బెరసొమ్ము గొనఁగవలెనె ?
ధాత్రి నెవ్వరి రక్షించఁ దలఁచినావొ
కోరువారలచేఁ బూజ గొందు వింతె, చిత్ర... 95

అబ్ధికన్యా వివాహ మహోత్సవము నాఁడుఁ
జూడలే దిచ్చోట జూడఁ గలిగె
జానకీకళ్యాణసంభ్రమం బానాఁడుఁ
జూడలే దిచ్చోటఁ జూడఁ గలిగె
భోజసుతోద్వాహ భూరివైభవమందుఁ
జూడలే దిచ్చోటఁ జూడఁగలిగె

రేవతీపరిణయ శ్రీవిలాసంబపుడు
చూడలే దిచ్చోట(జూడ(గలిగె
ననుచు నిట రాజ్యరమ(బెండ్లియాడ
నిన్ను(బ్రజలు సేవించి సంతోషభరితు లై రి చిత్ర... 96

అఖిలలోక స్థాపనాచార్యమణీ వయ్యు
నిజభక్తగురునిచే నిలుపుకొన్న
గర్భస్థితానేక కమలజాండు(డ వయ్యు
నొండుకోవెలను జెల్వొందుచున్న
బహుచరాచర భూతపరిపాలకు(డ వయ్యు
భక్తార్పితార్థము ల్పట్టుచున్న
హరచతుర్ముఖ దేవతాగోచరు(డ వయ్యు
నెప్పుడు దర్శనం బిచ్చుచున్న
నిన్ను సేవింప రెవ్వరో పెన్నిధాన
మెదుట నుండంగ(గనుమూసి యే(గువారె చిత్ర... 97

కై లాస మేరు సంకాశ నాగాశన
స్కంధంబుపై రథోత్సవము గల్గ(
జందనమందార సంతానకల్పక
వనముల మృగయోత్సవమ్ము గల్గ
రంగత్పయఃపయోరాశి వీచికలపై
వర్ణింప డోలోత్సవంబు గల్గ
బహుఫణారత్న కుంభద్భుజంగమ భోగ
వసతి(బర్యంకోత్సవంబు గల్గ(
బరకృతోత్సవ మిచ్చట బ్రా(తె నీకు
భక్తజనులకు నేత్రోత్సవంబె కాని. చిత్ర... 98

కోరిక లీను వైకుంఠంబులోని
లోనగరిలో నామూల నవ్యదివ్య

సౌధంబుదాపలి సరసమందారవ
నాంతరామృత సరఃప్రాంతచంద్ర
కాంతోపలోత్పల కల్పితపర్యంక
సకల సౌభాగ్య లక్షణనివాస
లక్ష్మీమనోజ్ఞ విలాసివశీకృత
సంభోగసామ్రాజ్యసంతతాభి
రామమూర్తికి వాంఛేతర ప్రపంచ
మేమి గావలె లీలార్థ మిం తె కాని. చిత్ర... 99

గుఱుతుగ సద్భక్తకోటి కీనాఁటికి
విడరాని బహుబుణస్థుఁడవు నీవు
సేవకు లెన్నెన్ని త్రోవలఁ జనుచున్న
వదలక యనుసరించెదవు నీవు
నిజదాసు లాత్మేచ్ఛ నిలిపి రెచ్చో నిన్నుఁ
దొలఁగ కచ్చోటనే నిలచె దీవు
శ్రీతు లంబలియు నైనఁ జేఁ జూప నది యెంత
యమృతభోగంబుగా నలరె దీవు
జగము లన్నియు నీకు వశ్యము ల టంటి
వీవు నిజదాసవశ్యుఁడ వెంత ఘనత ?. చిత్ర... 100

వెనుక వేసుకొని యుర్వీనాథకోటులు
సైంథవుఁ గావంగఁ జాలినారె ?
ధర నేయు తనసుతు శిర మెవ్వఁడతఁ డీల్గ
శాపించి సింధురా జోపినాఁడె ?
సాటించు నాసర్వసైన్యంబు లని కర్ణు
చేశక్తి నరు నేయఁ జెప్పినారె ?
పరులచే నొవ్వని పంతంబు గలభీష్మ
డర్జునాస్త్రంబుల కొఁగినాఁడె ?

మనుజయత్నంబు బల మెంతమాత్ర మీవు
నిజము కరుణించు నాతఁడే విజయుఁ డరయ. చిత్ర... 101

ఆగామి సంచిత ప్రారబ్ధము ల టుండ
నిజజన్మమందు నే నెల్లవేళ
నఘములే చేసితి నన్ని యుష్మత్పృథా
సదృశ నిర్హేతుక జాయమాన
కరుణాకటాక్ష వీక్షణ మెంచ కెప్పుడో
ప్రసరింపవలె నే నపారదురిత
వారధిఁ దరియింపవలెఁ గాని గతి యితఃపర మెఱుంగను భక్తపాలనాంక ;
శేషపర్యంక ; రాజ్యలక్ష్మీసహాంక
ప్రధననిశ్శంక ; యదుకులాంబుధిశశాంక ; చిత్ర... 102

పూర్వకవీంద్రులు పుణ్యఫలం బేమి
సాక్షాత్కరించి యస్మత్పరంబు
గా గద్యపద్యముల్ గల్పించు మనిన వే
వర మొసంగితి వంద్రు వాంఛఁ జేసి
నేర్చి నట్లుగఁ గూర్చి నేఁటి కవిత్వంబు
నీకంకితముఁ జేసి నెనరు దోఁపఁ
జేదోయి యొగ్గిన శ్రీపాదరజ మింత
నామీఁదఁ బాఱ నీ వేమి సామి ;
కృపకుఁ బాత్రముఁ జేయు మక్షీణభాగ్య
లక్షణాంచిత పాదపల్లవకరాబ్జ ; చిత్ర... 103

కావ్యదోషము లెఱుంగని మత్కవిత్వంబు
విద్వన్నుతంబుఁ గావించినావు
బహిరంత రింద్రియ పరిశుద్ధి లేని నా
తలఁపులోపల వచ్చి నిలచినావు

పుణ్యకర్మ మొకింత పూని సేయని నన్ను,
బెద్దలచేత మెప్పించినావు
పురుషప్రయత్నంబు గురు తెఱుంగని నన్ను
భక్తి గల్గఁగ జేసి ప్రోచినావు
పతితుఁ జేపట్టినావు చేపట్టినావె
యన్యగతిఁ బోవనీయకు మా ర్తరక్ష ! చిత్ర... 106

శబరి యెంగిలిపండ్లు చవిఁజూచు ననుకంప
కుబ్జ గందము పూఁత గొన్నకరుణ
పాంచాలి కోర సాపడిన దయారతి
గోపమ్మ యుగ్గుఁబాల్ గ్రోలుకృపను
మాలికుఁ దొసఁగు తోమాలెఁ దాల్చినప్రేమ
ద్విజుని కొం గటుకులు దిన్నకూర్మి
గుహుఁడు పాదములు బట్టుట కుబ్బ నెనరును
నుడుతదాస్యమునకుఁ బొడముప్రేమ
శతక మంగీకరింపుము జగతి జనకుఁ
డర్భ కావ్యక్త భాషల నలరి నట్లు. చిత్ర... 107

శతక మొకటి 'మనసా ! హరిపాదము
లాశ్రయించవె' యని యల్లినాఁడఁ
గరిమ 'రామా ! భక్తకల్పద్రుమా !' యని
యొప్పుగా శతకంబుఁ జెప్పినాఁడ
నలరులదండ మీ కనఁగ 'హంసలదీవి
గోపాలశతకంబుఁ' గూర్చినాఁడ
యుష్మ దంకితముగా నూహించ శతక మే
నంచితంబుగ రచియించినాఁడ

భవదనుగ్రహ కవితచే బ్రబలువాఁడ
నవని గాసుల పురుషోత్త మాఖ్యవాఁడ
చిత్రజిత్ర ప్రభావ, దాక్షిణ్యభావ
హతవిమతజీవ, శ్రీ కాకుళాంధ్ర దేవ! 118

ఆంధ్రనాయక శతకము
సంపూర్ణము.

కుక్కుటేశ్వర శతకము

ఇది సంపూర్ణముగా సీసపద్య శతకము; అయినను 92 పద్యములు మాత్రము లభించినవి.

కూచిమంచి తిమ్మకవి దీనిని రచించినాడు. రుక్మిణీ పరిణయము, సారంగధర చరిత్రము, సర్వలక్షణ సారసంగ్రహము, రసికజన మనోభిరామము, సర్పపుర మాహాత్మ్యము, శివలీలా విలాసము, నీలాసుందరీ పరిణయము, భళ్ళాణ రాజచరిత్రము, ఎన్నో చాటుపద్యములు కూడ రచించినయితనికి కవిసార్వభౌమ బిరుదము కలదు.

నేటి తూర్పుగోదావరి మండలములోని పిఠాపుర ప్రాంతములలో నున్న కందరాడ గ్రామమునకు తిమ్మకవి కరణము. కొందరు కరణములు వెనుకటి రోజులలో తాము గ్రామ విభుల మనియు, నగర శాసకుల మనియు చెప్పి కొన్నారు. అది ఆనాటి సంప్రదాయము. నేటికిని కొన్ని తావులలో గ్రామ కరణములకు విశేష ప్రాభవ మున్నది. ఈ కవి నియోగి బ్రాహ్మణుడు, ఆపస్తంబ సూత్రుడు, కౌండిన్య సగోత్రుడు, బయ్యనకు ప్రపౌత్రుడు, తిమ్మయ పౌత్రుడు, లచ్చమ్మ గంగనలకు పుత్రుడు. జగ్గన, సింగన, నరసన్నలు ఈతని పితృవ్యులు. వీరమ్మ, పాపమ్మలు మేనత్తలు. సింగన, జగ్గన, సూరనలు ఈతని సోదరులు. గొట్టెముక్కుల రామయ పుత్రిక ఈతని భార్య.

ఉత్తర వయస్సున తిమ్మకవి పిఠాపుర సమీపములోని చంద్రమపాలె గ్రామమున నివసించుచు, పిఠాపురము చివర నున్న కుక్కుటేశ్వర స్వామిని గూర్చి యీ శతకము రచించెను. కుక్కుటేశ్వర క్షేత్రము వలన పిఠాపురమునకు దక్షిణ కాశి అని ప్రసిద్ధి వచ్చినది. ఆలయమున కెదురుగా నున్న పుష్కరిణికి పాదగయ అని పేరు. ఇది కొన్ని వందల సంవత్సరములనుండి శివక్షేత్ర మని పేరు పడియున్నను, పూర్వము జైనారామ మనియు, కుక్కుట సర్పపరివృతు డయిన తీర్థంకరుని విగ్రహము తొలుత నుండె ననియు, సనాతన ధర్మపరులు జైనారామమును శివక్షేత్రముగా మార్చి, విగ్రహమునకు కుక్కుటేశ్వర స్వామి అని నామకరణము చేసి రనియు పురాతత్త్వవేత్తల మతము.

జైనధర్మము క్షీణించిపోయి నపుడు ఈ మార్పు జరిగె నేమో, ఏదయినను మహాజనము శివభక్తితో ఈ క్షేత్ర సందర్శనము చేసి మనశ్శాంతి నొందు చుండుట సర్వజన విదితము.

తిమ్మకవి శైవధర్మము అవలంబించినవాడు
అలఘుతేజోనిధి యగు దెందులూరి
కులు లింగనారాధ్య గురుని నుతించి

అని చెప్పుకొన్నాడు. లింగనారాధ్యుడు విద్యాగురువు కాక, దీక్షాగురువు.

శైవకథా రహస్య జ్ఞాననిధిని

* * *

తిమ్మ సత్కవి నామధేయుని నన్ను...

అనుటవలనను, తన గ్రంథములలో శివస్తుతి, విఘ్నేశ్వర స్తుతి చేసి, శివభక్తి విశేషముగా ప్రదర్శించుట వలనను ఈయనకు శైవధర్మమునెడ మిక్కిలి యభిమానము కలదనవచ్చును. బహుకాలము గ్రామాధికారిగా నుండి వివిధ వ్యవహారములను నిర్వహించి రాజసభలలో వాసి కెక్కి లోకవృత్త స్వరూపము గ్రహించి, రోసి, వార్ధకమున ఈ గర్హణశతకము చెప్పియుండును.

లోకమునకు నీతిబోధ చేయుట యీ శతక హృదయ మనవచ్చును. ఇయ్యది దూషణశతకములలోనిది. వేణుగోపాలాది శతకములు గూడ నిట్టివే. నీతిశతకములలో శృంగారమున కవకాశము మృగ్యము. లోకవృత్తము, మూర్ఖత, దుర్మార్గము, అవిద్య, అవినీతి మొదలగువాని ఖండనము వీనిలో విశేషముగా నుండును. భక్తి జ్ఞాన వైరాగ్యములు హాస్యముతో సమ్మిశితము లగుచుండును. ఇట్టి శతకములు సంఘసంస్కరణమున కుపయుక్తములు. హేళన ప్రబలమైన యాయుధము. ప్రభువులు కూడ ఎగతాళికి భయపడు చుందురు. హేళన వలన దుష్టులకు సిగ్గు జనియించును. క్రమముగా మృదువుగా ఉత్తమ మార్గమున పోవుట కవకాశము లేర్పడును.

సర్వేశ్వర శతకములోని యొకానొక పద్యమున కిందులో ననుకరణమున్న దన్నారు. వేణుగోపాలాది శతకములలో నున్నట్లే ఇందును గ్రామ్యపదములతో గూడిన పద్యము లున్నవి.

శ్రీమ దుమారమణ కరుణాకటాక్ష నిరీక్షణ సంలబ్ధ సరసకవితా సామ్రాజ్య ధురంధరు డయిన యీ విద్వత్కవి క్రీ. శ. 1718 శతాబ్దులలో వర్ధిల్లినవాడు.

చిరవిభవా ! భవా ! విజితచిత్తభవా ! యభవా! మహాభవా ! అను మకుటముతో చిరవిభవ శతకము కూడ తిమ్మకవి రచించినాడు.

కుక్కుటేశ్వర శతక మకుటమును గ్రహించి శేషప్ప కవి తన నారాయణ శతక మకుటమును తీర్చిదిద్దికొని యుండవచ్చును.

శ్రీ

కుక్కుటేశ్వర శతకము

శ్రీకర ధవళాంగ, శ్రితజనావన సంగ,
కర నివిష్ట కురంగ, పురవిభంగ,
తరణీ చంద్రరధాంగ, ధరణీతల శతాంగ,
విదళితానంగ, గోవృషతురంగ,
వలయీకృత భుజంగ, విలసిత ఖట్వాంగ,
ధృత నభోగంగ, వార్నిధి నిషంగ,
ముని మనోంబుజ భృంగ, ఘనసమరాభంగ,
అతి దయాపాంగ, పుణ్యాంతరంగ,
శైలజానుంగ, నీ కొక శతక మిపుడు
కూర్చి యర్పింతు గైకొమ్ము, కోరి కిమ్ము-
భూనుత విలాస, పీఠికాపుర నివాస,
కుముద హితకోటి సంకాశ, కుక్కుటేశ ! 1

కొక్కు జొక్కువయాళి జక్కు నెక్కుడి వేల్పు
మినుసిక యెకిమీని యనుగు బట్టి
మేల్కొడాని పసిండి మేని జేజేమిన్న
యిదఱు తలుల ముదు గొడుకు
గుజ్జు దేవర వ్రేలు బొజ్జ మేటి మగండు
మొలక పూవులపూజ నలరు వలతి
చిలువ జన్నిదముల చెలువుండు సికను లే
దొగ విందుతనె పూను సొగసు కాడు
నను గజాననుడె పుడు నిన్ బొగడు కృతులు
జిర కృపా స్ఫూర్తి సంపూర్తి సేయుచుండు, భూనుత... 2

గురుతర కౌండిన్యగోత్ర పవిత్రుండ
గంగన మంత్రి శేఖరుని సుతుఁడ
కూచిమం చన్వయా కూపార చంద్రుండ
విత త తావక కృపావీక్షణా ప్త
సత్కలితా మహా సామ్రాజ్య భార ధౌ
రేయుండ బుధజన ప్రియసచివుఁడ
ఘన దెందులూరి లింగన గురూత్తమ ద త్త
సార శైవాచార సంగ్రహుఁడను
తిమ్మకవి చంద్రుఁడను నేను దివిరి నీకు
శతక మర్పింతుఁ గైకొమ్ము సంతసమున, భూనుత... 3

కౌశిక కౌండిన్య కపిల కశ్యప కణ్వ
కౌత్స కాత్యాయన కలశజులును
జహ్ను జరత్కార జాబాలి జమదగ్ని
జలజభవాత్మజ జైమినులును
మందపాల మతంగ మౌసల మౌద్గల్య
మాండవ్య మైత్రేయ మంకణులును
వల్మీక భవ వత్స వాలఖిల్య వశిష్ఠ
వరతంతు వామదేవ ప్రముఖులును
నిక్కముగ నిన్ను వర్ణింపనేర రనఁగ
నెంతవా రింక నరులు ని న్నెటిఁగి పొగడ, భూనుత... 4

దండ ముద్దండ దోర్దండ కోదండ వి
ఖండిత చండ వేదండ, నీకు!
జోహారు హారామరాహార నీహార
గోహర గోహీర దేహ, నీకు!
నతి శతక్రతు ముఖాదితి సుతాతత కృత
స్తుతి కృతామిత హిత కుతుక, నీకు!

జే జే పరాజితో గ్రాజి విరాజిత
వ్యాజ నిరీజ సమాజ, నీకు !
వందన ముదార దారుకావన ముసీంద్ర
సుందరీ బృంద మానసానంద, నీకు ; భూనుత... 5

తపన నందన భటోద్దండ చండ భుజంగ
మేఘ భీషణ విహంగో త్తమంబు
బహుజన్మ సంచిత బ్రహ్మహత్యా ముఖో
గ్రౌఘ కాలాభ్ర ఝుంఝూనిలంబు
భూత వేతాళ ప్రభూత వాతజ్వరా
ద్యామయారణ్య దావానలంబు
ఘోర దారిద్ర్య వికార భారో దగ్ర
వారణా నీక కంఠీరవంబు
నై న పంచాక్షరిని భక్తి యతిశయిల్ల(
దవిలి జపియించు వారె పో ధన్యతములు ! భూనుత... 6

అమర మస్తక కిరీటాంచిత మనో విభా
నీరాజితాంఘ్రి పంకేరుహునకు
శైలకన్యా ఘన స్తన విలిప్త మృగీమ
దాంకిత విపుల బాహాంతరునకు
గగన తరంగిణీ కల్లోల మాలికా
శోభిత పటు జటాజూటునకును
మరుదీశ నీలోపమాన మానిత మహా
కాకోలరుగ్జాల కంధరునకు
నీకు నతులు సమర్పించి నిష్ఠతోడ(
గొల్చు వారలె శమనుని గెల్చువారు, భూనుత... 7

అభవు నక్షయు నాద్యు నవ్యక్తు నవ్యయు
ననఘు ననంతు నాద్యంతరహితు

నప్రమేయు నజేయు నకలంకు నసమాను
నానందమయు నాద్యు నాత్మరూపు
నచలు ననామయు నఖిలేశు నద్వయు
నార్త రక్షణు ననఘ హృదయు
నమలాత్మ నజు గురు ననవద్యు నభయదు
నసహాయు నతిపుణ్యు నగ్రగణ్యు
నహరహంబును నిను భక్తి నాత్మ దలచు
పుణ్యమతులకు గడు సులభుడవు నీవు, భూనుత... 8

సర్వసర్వంసహాస్థలి శతాంగము గాగ
రవి సుధాకరులు చక్రములు గాగ
వాణీ విలాసినీ వరుడు సారథి గాగ
బ్రాహ్మిక్కగములు బాబాలు గాగ
రత్నసాను ధరాధరము కార్ముకము గాగ
నాగాధి నాథుండు నారి గాగ
పంకజాతాక్షుండు కంక పత్రము గాగ
బర్హ్మాస్యులు వీరభటులు గాగ
గూర్చి బారులు దీర్చి చిట్టార్చి పేర్చి
యోర్చి పురదానవుల దెగటార్చి తీవు, భూనుత... 9

రక్షించితివి కదా రవిసూను బడ దన్ని
చిరకృపామయబుద్ధి శ్వేతకేతు
భక్షించితివి కదా బ్రహ్మాండ నివహ కో
లాహల భయద హాలాహలంబు
శిక్షించితివి కదా శితఖడ్గ ధారాంచ
లమున దక్షాంధక ప్రముఖ ఖలుల
వీక్షించితివి కదా విత ఫాలానల
జ్వాలచే మరుని భస్మంబు గాగ

నిగ్రహానుగ్రహ ప్రౌఢి నీకె కాక
కలదె తక్కిన చిఱుత వేల్పులకు నెల్ల ; భూనుత ... 10

పలుకు, గ్రొన్నన, బోడి కులుకు వీణియ మీట
వేయు, గన్నులవేల్పు వేణు వూద,
గలుముల తొగకంటి చెల, గి గానము సేయ
నలువ కైతాళ మిం పలర వ్రేయ
మధు దైత్య మథనుండు మద్దెల వాయింప
సకల పారిషదు లెచ్చరిక సేయ
నంది భృంగీశు లందంద సందడి దీర్ప
మొనసి దేవత లెల్ల మ్రొక్కి కొలువ
సంతసము మీఱ, గేరి సాయంతనమున,
దాండవం బాడు నీహొయల్ దల, ప వశమె భూనుత ... 11

అబ్జ గర్భునకు లోకానీక నిర్మాణ
చాతుర్య మేరీతి సంభవించె
జలజాక్షునకు నిశాచర శిక్షణోపాయ
పాటవం బేలీల నాటుకొనియె
పురుహూతునకు దివ్యభోగ భాగ్యాస్పద
స్వర్లోక పదవ్యయేసరణి నచ్చె
దిన నాథునకు జగజ్జన లోచన దురాప
ఘన విభాస్ఫూర్తి యేకరణి నొదవె
నహహ తావక పద సరోజార్చనా వి
ధానమున, గాదె కలిగె ననూన మహిమ, భూనుత ... 12

ధననాయకు, డు నితాంతము ప్రియమిత్రుండు
సిరుల పైదలి గేస్తు, డరిది తూపు
కలధౌత శైలంబు కా, పురంబు బిడారు
కాంచనాహార్యంబు కార్ముకంబు

రత్నాధివాసంబు రహి మించు తరక సం
బల సర్వమంగళ యనుఁగురాణి
పంటల పువుఁబోఁడి బాళి మీఱిన తేరు
కళ లీనురాజు కీల్గంటిపువ్వు
గాఁగ నణిమాది భూతులు గల్గు నీకుఁ
బునుక లెత్తంగ నేరీతిఁ బొసఁగె నయ్య ! భూనుత... 13

చెలిమి నోగిర యిడ్డ చిరితొండ బత్తుని
కొడుకుఁ జంపించుట దుడుకు గాఁదె
పరకాంత యని మది నరయక భల్లాణు
నిల్లాలిఁ గోరుట యెగ్గు గాదె
మాలని యెంగిలి మాంసంబు రోయక
తవిలి మెసంగుట తప్పు గాదె
మొనసి యాడుది పంపు పనులకె కినియక
కుంచెనల్ తిరుగుట కొఱఁత గాదె
శివ శివా ! నీవె యిటువలెఁ జేయునప్పు
డవని నరులకు నిం కేమి యడ్డు కలుగు ! భూనుత... 14

దశశతాబ్దముల నిం దవిలి పూజించిన
మెచ్చి చక్రికిఁ జక్ర మిచ్చినావు
తరలక నినుఁగూర్చి తప మొనర్చిన క్రీడి
కెసఁగఁ బాశుపతాస్త్ర మొసఁగినావు
మిత్తిచేఁ బడి నిన్ను హత్తి బత్తిఁ దలంచు
మునిపుత్రుఁ జేపట్టి మనిచినావు
కాలకూటాగ్నిచేఁ గ్రాఁగి కు య్యిడుచున్న
దివిజుల యాపదవ్ తీర్చినావు
బళిర జగముల నీవంటి భక్తిసులభుఁ
డైన దైవంబు గలఁడె లో నరసి చూడ, భూనుత... 15

పుటీయలు పునుకలు నెఱియఁ బేర్లుగ వైచి
కుత్తుక గరళంబు కుదురు కొలిపి
కడఁగి పెన్నాముల తొడవులుగాఁ బెట్టి
పచ్చి యేనుఁగుతోలు పైని గప్పి
నెమ్మేన శవభస్మ మిమ్ము మీఱ నలంది
బికిరంబు చలికూడు ప్రేమఁ దినుచు
భూతపిశాచముల్ ప్రీతిఁ గొల్వఁగ బ్రేత
భూములయందు నబ్బురము మీఱ
మెలఁగు చుండియు భువన మంగళ విలాస
లీలఁ జెలఁగుదు వఁట మేల్ బళీ యయారె ! భూనుత... 16

జంభాహితుని భుజా స్తంభనం బొనరించి
విష్ణుని చక్రంబు విఱిచి పుచ్చి
బ్రహ్మ దేవునిఁ బటాపంచలుగాఁ గొట్టి
భగుని కన్నులు నేలఁ బడఁగఁ దిగిచి
పూషార్కు దంతముల్ పొడి పొడిగాఁ దన్ని
సోముని నరకాల భూమిఁ జమరి
దక్షుని తలఁ గొట్టి తవిలి వేల్పుల నెల్లఁ
దఱిమి వేఁటాడిన తావకీన
వీరభద్రావతార విహార లీలఁ
దలఁచి నప్పుడె యాపదల్ తలఁగు నార ! భూనుత... 17

పాపని కొక స్వయం పాకాన కీయ లేక
చుట్టాలకును గూడు పెట్టలేక
పిడికెఁడు బిచ్చ మెన్నఁడు నొసంగగ లేక
కడుపార నన్నంబు గుడువ లేక
పైమీఁద నొకగట్టి బట్ట గప్పఁగ లేక
నదనునఁ గా పైన వదల లేక

కడు గైన, దవు డైన విడిచి వెట్టఁగ లేక
మా డైన మ కైన మాన లేక
ఖలు డు విత్తంబు గూర్చిన, గట్టి కొట్టి
పట్టి పుధించి నృపు లరి బలిమి, గొండ్రు, భూనుత... 18

జార చోరులకు గంజాయి కల్లులకును
దొత్తుల కగ్గికి దొమ్మరులకు
కుంటెన కత్తెలకును వెలయాండ్రకు
నల్లమందునకు భూవల్లభునకు
తప్పు దండుగలకు దబ్బర గాండ్లకు
నంజుటికిని గోడి పుంజులకును
మందుల వాండ్రకు మూల దాసర్లకు
నాటపాటల వాండ్ర కౌను గాని
సుకవిజన దేవతాగృహ సూరివరుల !
జేర దింతయు, దులువ కూర్చిన ధనంబు, భూనుత... 19

విధవాకుచంబుల విధమున ససి చెడ్డ
పాడింట నిడిన దీపంబు కరణి,
గాననాంతరమున, గాయు వెన్నెలరీతి
షండున కబ్బిన చానపోల్కి,
గ్రోతి చే నొదవిన కొబ్బరి కాయయ
ట్లంబుధిం బడిన తోయంబు మాడ్కి
ముసిడి, బండిన ఫలమ్ముల చందమున దుష్ట
ఫణిశిరంబున వెల్గు మణివిధమున
ధరణి, బరమనికృష్టుని దండ నున్న
ధనము వృధ యగు నేరికిఁ బనికి రాక, భూనుత... 20

వేద శాస్త్ర పురాణ విద్య లక్కఱ గావు
పరిహాస విద్యలు పనికి వచ్చు

గద్య పద్య విచిత్ర కవితలు కొఱ గావు
గొల్ల సుద్దుల కతల్ పెల్లు మీఱు
దేవతా భాషల తీరు లేమియుఁ గావు
పారసీకోక్తులు ప్రణుతి కెక్కు
శైవ వైష్ణవ మతాచారంబు లొప్పవు
పాషండ మతములు బాళి నలరు
నౌర యిక్కలికాల మహత్త్వ మెంతొ
వింత యైతోఁచుఁ గద ధరాభ్యంతరమున; భూనుత... 21

కాపు కవీశ్వరుల్ కంచఱ యోగులు
సాతాని వైష్ణవుల్ సాలె భటులు
కోమటి దాతలు కొంచె భాగోతులు
మాల వెజ్జులు బోయమావటీలు
గొల్ల పౌరాణికుల్ పల్లె దైవజ్ఞులు
బానిస వేశ్యలు జైన బాఁప
లాడు దీర్ఘరు లుగ్ర యవన ధరాధీశ్వ
రులు వైదిక ప్రధానుఱను మిగుల
భూతలంబునఁ గలిదోష హేతుకమునఁ
బ్రబలు రై రింక నేమి చెప్పంగ వలయు; భూనుత... 22

బొగ్గులఁ డై లంబు బుట్టింపగా వచ్చు
ధట్టించి జలరాశి దాటవచ్చు
జెలరేఁగి ఘన దవానలము మ్రింగఁగ వచ్చు
భుజగుల బేర్లుగాఁ బూనవచ్చు
బెబ్బులి నఱచేతఁ బెనఁగి పట్టఁగ వచ్చుఁ
దివిరి ఖాతిని నార దీయవచ్చుఁ
గొదమ సింగమును నక్కునఁ జేర్పఁగా వచ్చు
గాలి పో గిడి మూట గట్ట వచ్చుఁ

గాని తులువల డెందంబు గరఁగఁ జేయ
వశము గా దయ్య భువిని నెవ్వరికి నైన, భూనుత... 23

సల్లగా మూల దాసర సటూరయ గారి
తిర్నామములు సానతేప వింటి
గొల్ల మారస బోయ దెల్లఁగా సతికితే
బొల్లేవు బోట్లాట లెల్ల యింటి
జయన యెంకట బొట్లు సబ్బండు సారాలు
పూరాంధములు సెప్పఁ గోరి యింటి
సరపయ్య బయలీదు జమిలికతోఁ బాడు
నంకమ్మపాట లె న్నైన యింటి
గాని సీ యెద్దుమాంసుల కయితకంబు
లంద మనిపించు కాయలయంద మంద్రు, భూనుత... 24

అబ్బబ్బ కిందటేఁ డప్పయ్య తీర్థాన
జోలె జంగము కిస్తి సోలెఁ డుప్పు
సాతాని జియరయ్య సతికితే పోయిస్తి
కొల్లఁగా గుల్లెఁడు సల్లబొట్టు
లంక సత్తెల వాఁడు పొఁకాన పొగిడితే
మాలదాసరి కిస్తి మానెఁ డూద
వేదాలు వాగితే యెల్లు బొట్టయ్యకు
కొలకుండ దోసెఁడు కొట్టి లిస్తి
నౌర తమకన్న కూసుగాఁ డవల నింకఁ
గలఁడె యను మూర్ఖుఁ డిద్ధర గామవై రి ! భూనుత... 25

ఆసన బేదంబు లనుకొంటి సేనియా
డులు సాల రచ్చింప వలె న టంట
కై స వరుఁడ నంట నాసార పుసుకుఁడ
నంట యేఢాంతుండ నంట పెద్ద

యెద్దు మారిసుఁడ నంట సిద్ధాంతుఁడ నటంట
వాసి పేగుల నంట దోసి నంట
సోమాదిగుల నంట సామి పాకా లంట
సంతుకు తంబులు సతుకు కుంట
యెంటఁ బట్టిరి యబ్బబ్బ యేమి సేతు
బాపన పిసాసు లను చోట్లఁ బలుకఁ దరమె, భూనుత... 26

మోట బొల్లెద్దుకు ముకుదాడు గట్టిన
బెద్దెరా మొగ మెల్ల సుద్దపట్టె
లద్దించుకొని వచ్చి అయగారు యేంచేసె
తడియాకుఁ గావలె తయ్యడాఁడు
బళ్ళంట ఆమీఁద పరపామ దంట మం
గలదాని బొం దంట గనడ మంట
ముత్తి గలుగు నంట ముద్రదానము గమ్మ
టంట దాసరికొయ్య యెంటఁ బట్టి
పట్టి బుజములు గాలస బట్టె ననెడు
చెనఁటులతెఱంగు లే మని చెప్పనేర్తు ! భూనుత... 27

బోలెఁడు గందంబు బొమలదాఁకా మెత్తి
మెంచెఁ డీబూడిద ఒంట బామి
రుదురాక పేర్లు జన్నిదములు మోఁకాలి
లాపున దిగయేసి యావుపాస
నానికి నేతిదా రైనను దె మ్మంట
దాఁ బల్కునెడ నమేద్యా లటంట
పచ్చాలు మాలయ్యపచ్చాలు ననుకొంట
సంకలో కబ్బాలు సప్పుకొంట
సెడుగు బాపఁడు నాబంటుకొడు కబ్బబ్బ !
యెంటఁ బడె ననుమూర్ఖుల నెన్న దరమె ! భూనుత... 28

బట్టయ్యగా కంట బబ్బాయు వంటను
బొజ్జయుం బనుకొంట బోజనాలు
గావలె నంట తేగాలు దె మ్మనుకొంట
సేరి బూసుండాలు సేసుకొంట
యెల్ల నికొడు కంట మల్ల నికొడు కంట
పోయిన పెతరుల పొగుడుకొంట
తలయిర్పు లెట్టి తొందరగాఁగ దండకాల్
సతకాలు సోకాలు సతుకుకొంట
ఎంటఁబట్టిరి గద రబ్బ యనెడు మూఢ
కష్టచిత్తుల కిఁక మ టెక్కడి యశంబు? భూనుత... 29

పాఁత పొత్తపుకట్ట సేత పట్టుక వచ్చి
దోసిబాపఁడ నంట దోసిలొట్టి
జలము సంద్రుఁ డటంట సని సాల దనుకొంట
సెడుగు వాసారులు సెప్పుకుంట
తిండికిఁ దె మ్మంట దేయిరింపుచు తూపె
తూపెకు సేతులు సాపు గాని
మఱఁద లెన్నఁడు పెద్దమని సైన థంటేను
తప్పక మూత్రంబె సెప్పలేఁడు
సీ యితనికంటె సాకలి సెల్లిగాఁడు
మే లనెడు మోటకొయ్యల నేల దెలుప, భూనుత... 30

కరణా లటంటను కైలకట్టల యిప్పి
పాతిక లంటను పరిగ లంట
కాస్లంట గీస్లంట కలయి లేనియి కొన్ని
సెల్లులు బాకీలు సెప్పుకొంట
బిరబిర గంటాలు గిరగిర దిప్పుతా
నాకు లన్నియు నెడ గోఁకుకుంట

యెగరాసి దిగరాసి సగమేసి యెగదొబ్బి
కొంపలు పడదోసి సంపుతారు
దయ్యమా కాయకస లైన దక్కినియ్య
రేమి సేయుదు మను మోటు లిలను గలరు. భూనుత... 31

యెద్దుసుందను గూర్చి యెగసాయ మిడితేను
తుది నది యధికారి దోసుకొనియె
దాపుదప్పుల కంట దర్మకర్చుల కంట
కాసువీసము లాగె కరణపయ్య
స ల్లమ్మి పవ కమ్మి సిల్లర దాసితే
కోమటి నాబంటుకొడుకు దొబ్బె
కళ్ళము కంకులు గాలి బట్టగ బోతె
బట్టు బాపనవోళ్ళు బతగనీయ
రహహ దందర మిటు లయ్యె ననెడి మోటు
బెద్ద దొక్కుడుగాళ్ళు జెప్పెడి ది కేమి. భూనుత... 32

కాకంబునకు రత్నఖచితపంజర మేల
పందికి ముత్యాలపంది రేల
యాపిటీగకు మేటి తీపుదేనియ యేల
శ్వానంబునకు బట్టుజాల రేల
మహిషంబునకు మృగమద విలేపన మేల
కోతికి బంగారుగొలుసు లేల
గర్ధభంబునకు బంగారుపల్లం బేల
షండున కంద మౌజాణ యేల
పరమలోభికి నృపసభా ప్రథితమహిమ
సుకవికృత భవ్యకావ్య విస్ఫురణ యేల? భూనుత... 33

పొడ వైన కారెనుబోతు గన్గొని తేంట్లు
మధగజేంద్రం బని పొదవునట్లు

దళ మైన యెండమావులు సూచి నీ ళ్ళని
చెలఁగి జింకలు దాడి సేయునట్లు
వలయు దవాగ్నిధూమముఁ గాంచి మొగు లని
చాతకంబులు డాయఁ జనినయట్లు
బూరుగచెట్టుపైఁ బూవు లుండుట చూచి
చిలుకలు ఫలముకై చేరినట్లు
ధరణి నధముల దాంభికత్వములు చూచి
చేరి యాచింపఁ దలఁతురు సూరిజనులు. భూనుత... 34

ఇల జొన్నఁ బడు గ్రుడ్డియెద్దు చాడ్పున మృదు
పదగతు లరయక పరుపుకొనుచుఁ
బెనకున నోడిన పిఱికి బంటును బోలె
వడి లేక ప్రాసంబు విడిచివైచి
సారెఁ గొక్కెరరీతి జడధుల నెరసుల
నెమకుచు మిగుల భంగములఁ దోఁగి
పెంటలపైఁ బొరల్వెట్టు రాసభ మట్లు
పలుమఱు నపశబ్దమునె పలుకుచు
తస్కరునిచందమునఁ బదార్థములు ద్రుచ్చి
లించుచుఁ జరించుకుకవుల నెంచ నేల? భూనుత... 35

దేశాటనంబును దేవతోపాస్తియుఁ
బండిత స్నేహంబు బహుపురాణ
శోధకత్వము పరిశుద్ధతయును మహా
ప్రతిభయుఁ గల్పనాపాటవంబు
ఛందోముఖాశేష శాస్త్రవేదిత్వంబు
సంగీత సాహిత్య సౌష్ఠవంబు
నిఖిలకలానై పుణియు నహంకార రా
హిత్యంబు జనహిత కృత్యములును

గలిగి కవిరాజ రాజశేఖరులు మెచ్చు
కబ్బములు గూర్చువాఁడె పో కవి యనంగ, భూనుత... 36

అలికులవేణి సింహకిశోర నిభమధ్య
పరిపక్వబింబోష్ఠి పద్మగంధి
రాకేందువదన శరచ్చంద్రికాహాస
కోకిలకలవాణి కుందరదన
పల్లవపాణి శంపాలతా విగ్రహ
లికుచవక్షోజ నాళీకనేత్ర
ముకురకపోల చంపకపుష్ప సమనాస
భుజగరోమావళి పులినజఘన
యనఁగ నెన్నిక గన్న లే యన్నుమిన్న
దొరకి ఘను నిన్ను నుతి గొన్న పురుషఁ డహహా, భూనుత... 37

పతిని దైవమ యంచు మతి నెంచి యరయుచుఁ
గల నైనఁ గ్రోధంబు నిలుపఁబోక
యతిథులఁ జుట్టాల నతిభక్తిఁ జూచుచు
సత్యవాక్యనిరూఢి జరుపుచుండి
యుభయవంశములకు నుపకీర్తి నించుచు
నిమ్మగా నగు సుచిత్తమ్ము పూని
యత్తమామలమాట కడుగు దాఁటగఁబోక
మాన మాభరణంబుగా నమర్చి
మెలఁగుచుండెడి యిలాలు కలుగవలయు
మహితభాగ్యాన్వితుం డైన మానవునకు, భూనుత... 38

తనయింటి యర్థంబుఁ దానె మ్రుచ్చిలు దాని
ననయంబుఁ గొరకొర లాడుదానిఁ
గయ్యంబునకు నెప్పు కాలు దువ్వెడిదాని
నెడపక యేవేళ నేడ్చుదాని

పొరుగిండ్ల వెంబడి దిరుగుచుండెడిదాని
ధట్టించి శిశువుల గొట్టుదాని
పరహితశీల యై పరగుచుండెడిదాని
గయ్యాళి యై పతి గలచుదాని
తవిలి పదుగురు బిడ్డలతల్లి యైన
విడువవలె నంద్రు పెద్ద లి ప్పుడమియందు, భూనుత... 39

జగడాల చీలి వేసాల వెల్లి బిసాళి
తిండిపోతు గయాళి మొండికట్టె
హేయభాజనము పల్మాయల పుట్టిల్లు
కంతులరాకాసి పంతగత్తె
యవలక్షణముల తా వవివేకములప్రోవు
చెరపనచేట మాసికలమూట
నిక్కులబండి బందెలమారి కల్లల
పాతర సోమరిపో తనంగ
నెన్నబడు బేరజపురండ నేలుచుండు
పురుషుని యభాగ్య మే మని పొగడవచ్చు, భూనుత... 40

కిలకిల నగుచు ముద్దులు గుల్కు నొకవేళ
నొకవేళ గొరకొర లూని మెలగు
మలితవిచార భాములగుందు నొకవేళ
నొకవేళ దృఢపరుషోక్తు లాడు
రతికళాకౌశలోన్నతి సూపు నొకవేళ
నొకవేళ మొగ మీక యూరకుండు
లలి బెక్కురీతుల లాలించు నొకవేళ
నొకవేళ బెనువంత నొందజేయు
నౌర వింతలు భూమిపై నాడుదాని
మనసు దెలియంగ రాదు పద్మజునికైన, భూనుత... 41

ఒరుల భాగ్యము సూచి యోర్వ(జాలనివా(డు
బుధజనద్వేషంబు పూనువా(డు
చెలిమిమై(దల్లిదండ్రులను బ్రోవనివా(డు
పరకామినుల కాస పడెడివా(డు
శివ విష్ణు దూషణల్ సేయుచుండెడివా(డు
పలుమఱు కొండెముల్ పలుకువా(డు
భూ సుపర్వక్షేత్రములు బ్రింగ(జూచువా(
డాడినమాట లే దనెడువా(డు
బ్రోది చేసినవానితో(బోరువా(డు
చేరు దుర్గతి నిహపరదూరు(డగుచు, భూనుత... 42

బహుపుత్రసంపత్తి(బ్రబలుచుండెడివారు
నిక్షేపములు ధాత్రి నిలుపువారు
క్షితి శివోద్వాహముల్ సేయుచుండెడివారు
కొంచక గుళ్ళు కట్టించువారు
ఘనతటాకమ్ము లి మ్మొనర(ద్రవ్వెడివారు
విరివిగా(దో(టలు వేయువారు
కవిబుధోత్తములకు(గామితార్థము లిచ్చి
యందంబుగా(గృతు లందువారు
సప్తసంతానకర్త లీసదమలాత్మ
లెపుడు నిహపరసుఖముల నెనయుచుంద్రు, భూనుత... 43

వలవని చెలువతో మెలగువా(డొకకూళ
వాసిడించి చరించువా(డు కూళ
సిరి గల్గి కుడువక చిక్కువా(డొకకూళ
వనిత కుంకువ చెప్పువా(డు కూళ
చెడి బంధునింటికి(జేరువా(డొకకూళ
వసుధేశు(జెడనాడువా(డు కూళ

ధనికుతోఁ బగ వెట్టు కొనెడువాఁ డొకకూళ
వడి లేని దొరఁ గొల్చు వాఁడు కూళ
కూడ దన్నను గవితలఁ గూర్చి బలిమిఁ
గుమతులకు నిచ్చువాఁ డొక్కకూళ సుమ్ము ! భూనుత... 44

ఆరకూటములోన నపరంజి యిడినట్లు
చెరువులోఁ బన్నీరు చిలికినట్లు
చౌటి నేలను మంచి సస్యం బిడిన యట్లు
వెలిమిడిలో నెయ్యి వేల్చినట్లు
షండున కంద మొ సకిని గూర్చిన యట్లు
పేడలోఁ గస్తూరి పెట్టినట్లు
పాడింటిలోన దీపంబు నిల్పిన యట్లు
వార్ధిలోఁ గురిసిన వాన యట్లు
తొడరి సుజనులు ధరణిలో దురనులకుఁ
జేయు నుపకృతి వ్యర్థ మై చెడు గదయ్య ! భూనుత... 45

పరమలోభిని దివాకరతనూభవుఁ డంచు
ఛద్మ చిత్తుని హరిశ్చంద్రుఁ డనుచు
నిర్దయాత్ముని రామనృపశిఖామణి యంచుఁ
గడుకురూపిని రతికాంతుఁ డనుచు
పాపకర్ము నభంగ పాండవాగ్రజుఁ డంచు
సమరభీరుని సవ్యసాచి యనుచు
కుండ బీదను మరున్మండలేశ్వరుఁ డంచు
మతివిహీనుని భోగిపతి యడంచు
కవులు కక్కూర్తి నిసుమంత కడుపు కొఱకు
పొగడు చుండుదు రవివేక బుద్ధు లగుచు, భూనుత... 46

పూఁదోఁటఁ గారెనుబోతు దూటీనయట్లు
పైరులోఁ బెనుగాబు బలిసినట్లు

గుడిమీఁద మట్టి మ్రాన్ గుదురు మీటినయట్లు
చెదపుర్వునకు బెక్క లొదవినట్లు
వెర వొప్పఁ జెఱకున వెన్ను పుట్టిన యట్లు
తులసిలో గంజాయి మొలచినట్లు
నట్టింట గడితంపుఁ బుట్ట పుట్టిన యట్లు
గందమ్ములోఁ బేడ కలిసినట్లు
వంగడంబున నొక క్రూరవర్తనుండు
పొడమి తత్ప్రాభవం బెల్ల నుడుగఁ జేయు, భూనుత... 47

కాకిమూఁకలలోనఁ గోకిలం బున్నట్లు
కొంగలలో నంచ కూడినట్లు
సైరిభంబులలోన సామజం బున్నట్లు
నక్కలలో జింక చిక్కినట్లు
ధుత్తూరములలోనఁ దులసిచెట్టున్నట్లు
తేఁచులలోఁ బులి రేఁచినట్లు
గ్రద్దలలో విహంగప్రభు డున్నట్లు
ఖరములలో వాజి దొరలినట్లు
ధరణిఁ బెక్కండ్రు నీచవర్తనులలోన
ఘనుఁ డొకఁడు చిక్కి యేమియుఁ గాక యుండు, భూనుత... 48

చక్కరలోఁ బిప్పి సంగతం బైనట్లు
మొగిలిపువ్వున ముండ్లు మొలచినట్లు
మాలి పంటికి జీడి మట్టు మీటిన యట్లు
కనకంబునకు గామ కలిగినట్లు
గొనబు ముత్తెమునకు గొగ్గి పుట్టిన యట్లు
చందమామకుఁ గందు వొందినట్లు
పాలలోఁ దోడుఁబాల్ మేళనం బైనట్లు
గంగలోపల నాఁచు గలిగినట్లు

ఘనుల కొకనేర మించుక కలిగెనేని
గొఱతగా జూచి యె గ్గెన్నుకొనరు బుధులు, భూనుత... 49

కొఱగాని పంచమకులు నై న నడిగించు
బర దేశముల వెంట దిరుగ జేయు
గులములో వన్నె తక్కువ యై మెలంగించు
మదిని హింసాంభోధి గుదురు పఱచు
సభ నాడుమాట హాస్యరసాస్పదము సేయు
తెలివి యొక్కపు డై న గలుగ నీదు
తివిరి సాధుల బట్టి తెరవాట్లు గొట్టించు
గడ లేని యిడుమల గుడువ జేయు
ధరణిలోపల నకట పేదఱిక మెంత
కాని దది వద్దు సుమ పగవాని కై న, భూనుత... 50

కులమున కెల్ల మిక్కిలితనం బొనగూడు
నాడినమాటయే పాడి యెసగు
నిఖిల విద్యాభ్యాస నిపుణత లభియించు
జేసిన పను లెల్ల వాసి కెక్కు
మనుజేశ్వరాస్థాన మాన్యత సమకూఱు
గడ లేని తేజంబు గలిగి యుండు
కవి బుధ వంది మాగధుల చెల్మి ఘటించు
బగర యైనను వెంట బడి చరించు
గవియుగంబున నబ్బబ్బ కలిమివంటి
మంచి వస్తువు కలదె యోజించి చూడ, భూనుత... 51

బంధు జాతములోన బహుమాన మెడలించు
సభలలో మాటాడ జనవు లేదు
పర మైన విజ్ఞానపరత సిద్ధింపదు
కుమతులు గెగ్గెర్ల గొట్టు చుండ్రు

పరభూమి కేఁగిన బాటింప రెవ్వరు
బ్రతిభావిశేషంబు పట్టువడదు
ధారుణీపతు లొక్కదానమే నొసఁగరు
కులసతి యతనిఁ దక్కువగఁ జూచు
నకట విద్యావిహీనత యంత కీడు
లేదు గద మర్త్యులకు ధాత్రిమీఁద నరయ, భూనుత... 52

కడుపార ఘృత మాంసఖండముల్ కడు మెక్కి
పుక్కిటఁ దమలంబుతుక్కి ద్రొక్కి
లా వగు గడితంపుతీవి గన్గొని నిక్కి
విడువక గేస్తుల మెడలు నొక్కి
కూర్చు రొక్కము చందుగులఁ గ్రిక్కిఱియఁ గ్రుక్కి
కసరుచు జనులపై విసము గ్రక్కి
కవి బుధవరుల ధాకలకు మూలలఁ జిక్కి
కక్కుచుఁ బల్లకీ కుక్కి లెక్కి
నిక్కి మిక్కుటమైన యాదొక్కి బొక్కి
టక్కరి నృపాలకులకీర్తి దక్కి నొక్కొ!; భూనుత... 53

అనయమ్ము రాజ్యాంతమున నరకము ధ్రువ
మ్మని స్మృతుల్ వచియింప వినఁగ లేదొ
మును హరిశ్చంద్రాది మనుజేంద్రు లనఘులై
చని రన్న సత్కథల్ వినఁగ లేదొ
దండధరుండు మీఁదట దురాత్ములఁ బట్టి
వెతఁ బెట్టు ననుమాట వినఁగ లేదొ
మహిలోన జాతస్య మరణం ధ్రువ మ్మని
విబుధులు పలుకంగ వినఁగ లేదొ
కాని దుర్మతు లయి ప్రజఁ గలంచి ధనముఁ
గూర్పఁ జూతురు బేల లై కూళదొరలు, భూనుత... 54

మరు మరీచికలు తామరస పత్రాంతర
సలిల బిందువులు చంచలలు హస్తి
కర్ణాంతములు దీప కశికాశిఖలు బుద్బు
దములు మంగలి చేతి దర్పణములు
మిణుగురు బురువుల మెఱుపు లభ్రచ్ఛాయ
లైంద్రజాలికు నాట లంబురాశి
వీచులు చలదళ వృక్ష పలాశముల్
తృణహుతాశనముల తెఱగు లిట్టి
సిరులు నిలుకడ లని నమ్మి చెనటు లురక
చెడుదు రెన్నడు ధర్మంబు సేయలేక, భూనుత... 55

భోగి యై ప్రతిదిన త్యాగి యై పుణ్యసం
యోగి యై సుజనానురాగి యగుచు
దాత యై బుధజన త్రాత యై నిఖిల వి
జ్ఞాత యై కుశలసంధాత యగుచు
ధీరుడై రణరంగ వీరుడై నిర్మలా
చారుడై నిరుపమోదారుడగుచు
శాంతుడై సదమల స్వాంతుడై కీర్తి ది
గంతుడై పటుబలవంతుడగుచు
రాజ్య మేలంగ గలవాడె రాజు గాక
హీనమతి యై చరించువాడేటి రాజు? భూనుత... 56

ఘూకంబు తెఱగున గొందుల నిరుకుచు
భుజగంబు చాడ్పున బుస్సు మనుచు
బెబ్బులి కరణి గంపిల డాక సేయుచు
భేకంబు గతి మేని బెంపు గనుచు
భల్లూక మట్లు చొప్పడ విట్టు వీగుచు
నాబోతుకైవడి నాము కొనుచు

గోమాయువట్ల యెన్నో మాయ లూనుచుఁ
గ్రోడంబువలెఁ గొరకొర నెగపుచుఁ
దనరు క్రూరన్యపాల కాధముల నమ్మి
సిరుల కాసించువాఁ డొక్కచెనఁటి కాఁడె భూనుత... 57

కోప మెక్కువ తాల్మి కొఱఁత శౌర్యము సున్న
నిలుకడ నా స్తి దుర్నీతి ఘనము
కనికరం బిల్ల దుర్గర్వ మగ్గము సత్య
శౌచముల్ కల్ల మచ్చరము హెచ్చు
కాపట్య మురు వహంకారంబు గాటమ్ము
పొగరు దట్టము ద్రోహబుద్ధి దళము
పరధనాపేక్ష నిబ్బరము లోభము పెల్లు
పరహిత చింత నిప్పచ్చరమ్ము
ధర్మమతి తొట్టు నీ యిట్టి దుర్మదాంధ
నృపకులాధము లేరి కే మియ్యఁ గలరు? భూనుత... 58

అందలం బెక్కుట యవనిఁ బ్రశస్తమా
మ్రా నెక్కి నిక్కుదే మర్కటంబు
తొడవులు దొడుగుట దొడ్డ సౌభాగ్యమా
కడు సొమ్ము లూనదే గంగిరెద్దు
విత్తంబు గూర్చుట విమల బ్రచారమా
బహు నిధుల్ గావఁడే భైరవుండు
ప్రజల దండించుట పరమ సంతోషమా
ప్రాణుల నెల్ల నేపఁడే జముండు
దొరతనంబున కివి గావు వరుస లరయ
సాహ సౌదార్య ఘన పౌరుషములు గాని, భూనుత... 59

దాన వైఖరిని రాధాతనూభవుఁ బోలి
చిరభోగమున శచీవరుని బోలి

కారుణ్యమున రఘు క్ష్మావరేణ్యుని బోలి
సత్యంబునను హరిశ్చంద్రు బోలి
న్యాయమ్మునందు గౌంతేయాగ్రజుని బోలి
సాహసంబున సవ్యసాచి బోలి
భూరి విద్యా ప్రౌఢి భోజరాజును బోలి
హరిభక్తి నియతి బ్రహ్లాదు బోలి
సర్వసర్వంసహా భుజా ధూర్వహుడు న
భంగు డగువాడె పో నృపపుంగవుండు, భూనుత... 60

న్యాయంబు దప్పక నరుల గాపాడుచు
వసుమతి బాలించువాడె రాజు
దుష్ట శిక్షణ మహా శిష్టరక్షణ కళా
వైఖరి జె న్నొందువాడె రాజు
కవి వంది మాగధ గాయ కారుల కెల
వాంఛితార్థము లిచ్చువాడె రాజు
శర ణని వేడిన శాత్రవజను నైన
వదలక చేపట్టువాడె రాజు
కాక తనపొట్టకై ప్రజ గలచు దురిత
రతుడు వా డొక రాజా తరాజు గాక ; భూనుత... 61

మరుదనంగుడు శిబి మాంధాత భరతుండు
రంతిదేవుడు భగీరథుడు పృథుడు
శశిబిందుడు గయుండు జామదగ్ని దిలీపు
డంబరీషుండు యయాతి దాశ
రధి సుహో త్రుడు పురూరవుడు నాభాగుండు
కార్తవీర్యార్జున క్ష్మాపతియును
దుష్యంతు డతని పుత్రుడు నలుండును పురు
కుత్సుండు మొద లైన కుతలపతులు

ధర్మపద్ధతి నిల నేలి తార మైనఁ
గొనక చను బెల్ల విన రేమొ క్రూరన్యపులు, భూనుత... 62

మొదవుల బదివేలు కదుపులు గూర్చిన
దూడ యొక్కటి యైనఁ దోడ రాదు
మూడ లసంఖ్యముల్ మాటుగా నించినఁ
బసిఁడి వీసమును వెంబడిని రాదు
కోకలు మేట్లుగాఁ గొల్ల నిండించిన
గుడ్డ యొక్కటి యైనఁ గూడ రాదు
గొలుసులు రాసులు బలుపాతరల నిడ్డ
గింజ యొక్కటి యైనఁ గెలన రాదు
కావున నొడళ్ళు నిల్కడల్ కా వటంచుఁ
జెలఁగి సుజనులు ధర్మంబు సేయుచుంద్రు, భూనుత... 63

కొండంత విత్తంబు గూడఁ బెట్టిన నైనఁ
బొదలు ధనాపేక్ష వదలిపోదు
స్వర్గాధి పత్యంబు సంభవించిన యేని
బహురాజ్యకాంక్ష యెప్పటికిఁ జనదు
పదివేలు పుత్రులఁ బడసి నప్పటికిని
పుత్రోదయభ్రాంతి పోవ దెపుడు
చతురంగ బలము లసంఖ్యముల్ గూర్చిన
సేనాభిలాష మింతైనఁ దీఱ
దహహా డెందంబులోపల నంతకంత
నధిక మగు నాస యింత కేమి మనఁగ వచ్చు, భూనుత... 64

నిరతాన్నదానవై ఖరిఁ జెలంగెడి వారు
నెన రొప్ప దీనుల మనుచు వారు
గో విప్ర బాంధవ గురుభక్తి గల వారు
శివు విష్ణుఁ బూజలు సేయువారు

పరధన పరవధూ పరత౯ జెందని వారు
పరహితా చరణు లై పర౯గు వారు
సుజ్ఞాన సహితు లై సొబగు మీఱెడి వారు
సత్యవచోరూఢి సలుపు వారు
తల౯పులోపల ననయంబు ధర్మకార్య
నిష్ఠ గలవార లందఱు నీకు౯ బ్రియులు, భూనుత... 65

న్యాయపద్ధతి భూషణము ధరాధిపునకు౯
బొల౯తికి మానంబు భూషణంబు
శమదమంబులు భూషణములు నిశ్చలునకు౯
బొస౯గ నింటికి సతి భూషణంబు
నరుని కల్మికి భూషణము దానవై ఖరి
భూసురునకు విద్య భూషణంబు
నలిన బంధు౯డు భూషణము నభో వీధికి౯
బుడమికి సస్యంబు భూషణంబు
బుధుల కెప్పుడు నీ పదాంభోజ యుగళ
పూజనా సక్తి వెల లేని భూషణంబు, భూనుత... 68

అంభోధి కభిషేక మాచరించిన యట్లు
గంగకు౯ బాద్య మొసంగి నట్లు
మేరువునకు నలంకారంబు లిడినట్టు
లినునకు నారతు లె తినట్టు
మలయాచలమునకు౯ గలప మిచ్చినయట్టు
లిల వ సంతునకు౯ బూ లిడినయట్లు
భూపముఖ్యునకు౯ దాంబూల మిచ్చినయట్లు
సోమున కద్దంబు సూపినట్లు
నిఖిలలోకైక భర్తకు నీకు నొక్క-
బిల్వదళ మార్య వర్యు లర్పించుచుండ్రు, భూనుత... 67

నడచి పోవఁగ జవం బడర కుండుటఁ జేసి
పుణ్యతీర్థము లాడఁ బోవ రాదు
కాసు వీసము చేతఁ గల్గకుండుటఁ జేసి
దాన ధర్మ క్రియల్ తలఁప రాదు
తనువున రుగ్బాధ తరల కుండుటఁ జేసి
స్నానజపాదులు సలుపరాదు
గడితంపు టాఁకలి విడువకుండుటఁ జేసి
యుపవాసములు నిష్ఠ నుండరాదు
కాని ని న్నొక్కమా ఱైనఁ గడఁగి తలఁప
రాదె యెన్నరు గాక దుర్మతులు మదిని, భూనుత... 68

శత వత్సరంబులు జనులకుఁ గా నాయు
వంబుజాసనుఁడు మర్యాద చేసె
నందులో సగమేఁడు లరుగు నిద్రల చేత
శైశవక్రీడల జరుగుఁ గొన్ని
తారుణ్యమున మహామార భూతము సోఁక
నంగనాసక్తి చే నరుగుఁ గొన్ని
వార్ధకంబున బహు వ్యాధి పీడల చేతఁ
గడమ యేఁడులు రిత్త గడచుచుండు
కటకటా యేన్నఁడును దెల్వి గలిగి నిన్నుఁ
జేరి భజియింపకే ప్రాణి చెడు గదయ్య! భూనుత... 69

ప్రకృతి గుణంబులఁ బాసి షడ్వర్గంబు
నడఁచి జితేంద్రియు లైన యంచి
తాష్టాంగ యోగక్రియారూఢు లై చరా
చరరూప మగు ప్రపంచంబు మిథ్య
యని తలంచుచు సమస్తాంతర స్థాయి వై
నువ్వుల లోపల నూనె వోలెఁ

బూసలలో దారమును బోలి యెడపక
నిండారి యుండెడు నిన్ను నెపుడు
లోని చూపున, దగ, దమలోన, గాంచి
సోఽహ మనువారె సంతతోత్సాహమతులు, భూనుత... 70

వాయుభక్షణ చేసి వనట, గుందదె పాము
గుహలలో దూఱదే గూబపులు, గు
వృక్షశాఖలమీ, ద వ్రేలుచుండదె పక్షి
కానల, దిరుగదే వానరంబు
చెలరే, గి కూయదే ఝిల్లికా కూటంబు
గహ్వారి దిరుగదే గంగిరెద్దు
నీట మునుంగదే మాటిమాటికి, గప్ప
యాకులు మెసవదే మే, కపిల్ల
యెన్ని తెఱ, గుల, బొరలుచు నున్న నిన్ను
లీల, గొలువని ఖలునకు లేదు ముక్తి, భూనుత... 71

పరుసంబు వలన నబ్భ్రరముగా లోహంబు
మేల్మిబంగార మై మెఱుసినట్లు
భ్రమరంబు వలన విభ్రమరూఢి యలరారి
శలభంబు భ్రమర మై చెల, గినట్లు
మలయ భూజాతంబు వలన నింబము పటీ
రావనీ జాత మై యలరినట్లు
కతకంబు వలన నుదాత్త పంకోదకం
బతి నిర్మలోదకం బై నయట్లు
సద్గురు కృపాకటాక్ష వీక్షణము వలన
బ్రాకృతుడు జ్ఞాని యై ముక్తి పదము గాంచు, భూనుత... 72

మణి భూషణములు చామరములు ముత్యాల
గొడుగులు పడిగలు గుజ్జుపరపు

ముద్దెటిళ్ళ మెఱుంగు టద్దముల్ గద్దియల్
చందుగల్ చందువాల్ మందసములు
పూల పాన్పులు శీరతాళవృంతము మేల్
కలపముల్ తూఁగుటుయ్యెలలు పసిఁడి
పల్లకీలు గుఱాలు బంట్లు బానిసలును
ధన ధాన్య వసన గో దంతితతులు
కులుకు ప్రాయంపు ముద్దు గుమ్మలును గలిగి
పొలుచు వారలె మును నిన్నుఁ గొలుచువారు, భూనుత... 73

దాన హీనుం డైన మానవాధము కల్మి
తెరలెడు జుంటీఁగ తేనె చుట్టు
చుట్టాల నతిథులఁ జొరనీని ఖలునిల్లు
పెనుబాము వసియించు పెద్దపుట్ట
సభలఁ బ్రసంగింపఁ జాలని జనుని ప్ర
హృష్ట సాహితి సానక్రింది వన్నె
పతివాంఛ దీర్పని పడఁతి చక్కఁదనంబు
కాసనాంతర చంద్రికా ప్రసక్తి
చిత్త మిగు రొత్త నినుఁ బూజ సేయలేని
నరుని జన్మము మహిషజన్మము గదయ్య ! భూనుత... 74

కుంభి కుంభస్థ లాక్షుద్రామిషము మెక్కి
సింగంబు కప్పల మ్రింగఁ జనునె
సారభూరుహ ఫలాహార లీలఁ జెలంగు
కీర ముమ్మెత్తలఁ జేరుకొనునె
యభ్రాపగా హాట కాబ్జ మృణాళముల్
కొను సంచ బురదవాగులకుఁ జనునె
ప్రబల వర్షాంబు ధారలు గ్రోలు వానకో
యిల యిల మంచు సోనలకుఁ జనునె

ప్రభు భుజానీత భూరి వై భవ నిమగ్న
విద్వదవతంస మల్పుల వేడఁ జనునె ? భూనుత... 75

అడిగి నప్పుడ తనయొడలి చర్మం బూడ్చి
కర్ణఁ డీయండె యాఖండలునకు
నుడివి నప్పుడ యొప్పి పుడమి మూఁడడుగులు
వైరోచనుం డీఁడె వామనునకు
శర ణన్న యప్పుడు పరఁగ గువ్వను బ్రోచి
శిబి మేని పొల సీఁడె శ్యేనమునకు
ప్రార్థించినప్పుడే బ్రాహ్మణుఁ గాచి ఖే
చరుఁడు ప్రాణము లీఁడె సురవిరోధి
కరయ వితరణ శూరు లై నట్టి ఘనులు
కొంచ కే మైన ఘనుల కర్పించు చుంద్రు, భూనుత... 76

పురుషో త్తమము భద్రగిరి యహోబలము శ్రీ
శైలంబు వేంకటాచలము కాంచి
సింహాచలంబును శ్రీరంగమును ప్రయా
గంబు కేదారంబు కాళహ స్తి
కుంభకోణంబు శ్రీ కూర్మంబు కాశి సు
బ్రహ్మణ్యమును చిదంబర మయోధ్య
భీమేశ్వరంబును రామేశ్వరంబును
గోకర్ణమును హిమక్షోణిధరము
మొదలుగాఁ గల పుణ్యభూములకుఁ జనఁగ
వలవ దర లేక నినుఁ గొల్చు నలఘుమతికి, భూనుత... 77

లవణాబ్ధి లంఘించు పవనాత్మజున కొక్క
తోటకాలువ పూని దాటు పెంత
జగ మెల్ల ముంచు వర్షము నించు కాలాంబు
ధరమున కొకపాదు దడుపు పెంత

బహులోక వాంఛిత ఫలద మౌ సురశాఖి
కొక యణూపమ ఫలం బొసఁగు చెంత
చెడుగు రక్కసిమూఁక జెండు చక్రమునకుఁ
బుడమి నొక్కరుని జంపుట యదెంత
సకల బ్రహ్మాండ భాండ రక్షణ కలాభి
రామునకు నీకు ననుఁ బ్రోచు టేమి వింత ? భూనుత... 78

నదులలో జాహ్నవి నరులలో విప్రుండు
గ్రహములలోనఁ బంకజహితుండు
తృణములలో దర్భ మృగముల సింగంబు
వ్రతముల ద్వాదశి లతల జాజి
దానమ్ములం దన్నదానమ్ము లోహ జా
తమ్ములలోనఁ గార్తస్వరంబు
గిరులలో మేరువు పురములలో కాశి
తరువుల రావి సంతతులఁ గృతియు
నెట్లు పూజ్యము లయ్యె నట్లెల్ల వేల్పు
గములయందును నీవె కా ఘనుఁడ వరయ ! భూనుత... 79

నటుని పోల్కి ననేక నామరూప విభేద
ములు పూని శుభలీలఁ జెలఁగువాని
తవిలి పూసలలోని దారంబు క్రైవడి
జగదంత రాత్మ యై నెగడు వాని
నైంద్ర జాలికురీతి నఖిలంబు నుద్భవ
స్థితిలయంబుల నొందఁ జేయువాని
విపులాంబువులఁ బ్రతిబింబితుం డౌహేళి
వలె సర్వ సాక్షి యై వెలుఁగువాని
నిన్ను సేవింతు భావింతు సన్నుతింతుఁ
బ్రేమ యేపార సాక్షాత్కరింపు మయ్య ! భూనుత... 80

సాలెపుర్వునకు(కుంజరమున కహికిని
ముక్తి యొసంగిన భక్త సులభ
జమున దక్షుని పరాశర తనూజుని గర్వ
దూరుల(జెసిన భూరి శౌర్య !
హరి విరించన పురందరుల కఖండ వై
భవము లొసంగిన భువన జనక !
నంది భృంగీశ బాణ దశాననుల మహా
ప్రమథుల(జేసిన విమల చరిత !
నీ మహత్త్వంబు పూని వర్ణింప(దరమె
వాణికిని వేయిమోములవాని కైన ! భూనుత... 81

ఆరకూటమ్మ బంగార మై యొప్పునే
తగర ముజ్జ్వల కల ధౌత మగునె
గాజుపూస యనర్ఘ గారుత్మత మ్మౌనె
జిల్లేడు దేవతా క్షితిజ మగునె
కాసరం బతి దర్ప కంఠీరవ మ్మౌనె
కాకంబు వరమానసౌక మగునె
మతకరి జోరీ(గ మదపు జేను(గ యౌనె
ఘన బిడాలము చిత్రకాయ మగునె
రా జగునె జాగ్రదుడు దురాగ్రహముచేత(
బ్రజల బాధించు ఘోర దర్పధ్వజుండు, భూనుత... 82

జింక బొడ్డున(దావి జిల్లు కస్తురివోలె
జంబాలమున నీరజంబు వోలె
మొరవ మంచి హారంగు మెఱు(గు వజ్రమువలె(
గప్పచిప్పను మౌక్తికంబు వోలె
సరసోత్కరమునందు విరిదేనియలు వోలె
నెండు గడ్డిని గృహానుండు వోలె

వనబిడాలమునందు, గన జవాదిని బోలె,
బ్రకటింప, గృమియందు, బట్టువోలె
జగతిలోపల, గారణజన్మ లొక్క
కాని యెడ, బుట్టియు, బ్రసిద్ధి, గాంచుచుండ్రు, భూనుత... 83

సిరికిఁ దోఁబుట్టు వౌ జ్యేష్ఠామహాదేవి
దీనత నింటింట, దిరుగ, జాగె
హరికిఁ గూరిమిపట్టి యగు మకరాంకుండు
మెయి లేక సోఁకు డై మెల, గుచుండె
మృడునకు గాదిలి కొడు కైన వెనకయ్య
యిప్పటికిని బెండ్లి యెఱుఁగ, డయ్యె
నలినాసనునకు మానస పుత్రుఁ డైన ద
క్షుం డుక్కు సెడి తలకొట్ల, బడియె
నిలను దుష్కర్మ సహితుల కెట్టి గట్టి
బంధుజను లున్న, గీడు వాపంగ లేరు, భూనుత... 84

గజముపై మహిషంబు కాలు ద్రవ్వెడు నట్లు
కొండతో, దగరు డీకొనినయట్లు
కార్చిచ్చుపై, బతంగము తారసిలునట్లు
మృగరాజుపై నక్క మొగియు నట్లు
బెబ్బులితో జింక పెన, గ, బోయిన యట్లు
పెనుబాముపై, గప్ప చనినయట్లు
పిల్లితో నెలుక డర్పించి దార్కొనునట్లు
తోడేలితో మేక దొడరునట్లు
క్రూరు లొకకొంద రసమాన వైర మూని
పోరుచుందురు ఘనులతో బుద్ధిమాలి, భూనుత... 85

పొద్దు పొద్దుకు వచ్చి పోలి బొట్లయ్య దా
పంచాగ మిప్పి ఒప్పన్న సేపి

సాతి బూదారంబు సాతి నచ్చత్తరా
మసిపేటి కారితే యల్లకలికి
గాందారి పొద్దున గాని వర్చ్చార్జాలు
రావు మీదాతులా రాశి నీకు
సూరీడు సందుడు సుకురుండు సని బుర
స్సపతి పదనకొంట సాగినారు
మంచి దని సెప్పి నూకలు మానే డన్ని
కొల్లగొనిపోయె నని మూర్ఖకోటి పలుకు, భూనుత... 86

నింబ భూజమునకు నిర్మలోదక మిడి
మనిచిన దనచేదు మాన గలదె
పాపకూనకు మంచి పా లోసి పెంచిన
నెడ రూను తనవిషం బుడుగ గలదె
ఉల్లిగడ్డకు దుషారోదకం బిడి ప్రోది
యిడినను దనకంపు విడువ గలదె
కందదుంపకు బానకము పోసి పెంచిన
గొద లేని తనదూల వదల గలదె
దుర్గుణున కెన్ని మంచి వస్తువులు పెట్టి
మనుప జూచిన తనయోజ మాన గలడె ? భూనుత... 87

ఎనుబోతునకు విద్దె లెన్నింటి నేర్పిన
మడుగున కేగుటల్ మాన గలదె
ఉనకంబునకు నెన్ని సూడిదల్ వెట్టిన
బుల్లెలు నాకక మళ్ళ గలదె
గాడిద కెన్ని సింగారముల్ దిద్దిన
బూడ్డెలో బొరలక పోవ గలదె
యూర బంది కి నెన్ని తీరుల మేపిన
బరగళ్ళ కేగక బ్రదుక గలటె

హీను(డగువాని సత్ప్రభు లెన్నిగతుల
నునిచి మనిచిన(జెడుజాడ లుడుగ(గల(డె? భూనుత... 88

నోరు చే(దై కూడుగూరలు చవి దప్పు
గడగడ నొడ లెల్ల వడ(కు చుండు
జెవుడున నేమియు(జెవులకు వినరాదు
తెగులును జింతయు(దగులు కొనుచు
కన్నుల(బొర గప్పి కానరా దెద్దియు
సి గ్గొకించుక యైన(జేర(బోదు
బాలు రంచము(గూడి గేలి గావింతురు
మగువలు పకపక నగుచు నుండ్రు
మది(దలంపగ(గటకటా ముదిమియంత
రో(త లేదు గదా ధారుణీ తలమున, భూనుత... 89

బావిలోపల(బడ్డ పామును వెడలింప(
జనువాని(గరువక చన(గ(గలదె
చిచ్చులో(బడెడు వృశ్చికమును వెడలింప(
జనువాని మీటక సడల(గలదె
పెను వెల్లి(బడిపోవు బెబ్బులి(బరికింప(
జనువాని మ్రింగక మనుప(గలదె
బురద గో(తను బడ్డ పోట్లావు లెగనెత్త(
జనువాని బొడువక జరగ(గలదె
అవనిలోపల ఖలుని నెయ్యంబు మీఱ
మనుప(జనువాని(జెఱుపక మాన(గల(డె? భూనుత... 90

ఘన గహనాంతరోద్గత తృణాసీకంబు
ధేనువునందు(బా లై నయట్లు
విత త దుర్వర్ణ రూపిత లోహపిండంబు
రసమున(బసి(డి యై యొస(గి నట్లు

సాంద్రాభ్రవారి వృషత్కదంబము శుక్తి
యందు ముక్తామణి యైనయట్లు
భూరికుల్యాతక వారి రసాల మూ
లమున బానక మై చెలంగి నట్లు
కరి హయాందోళికా రత్న కాంచనాదు
లగుచు నిజవక్త్రమున నిడ్డ హార్య మొప్పు, భూనుత... 91

అన్నంబు నాలుక కరుచి యై కన్పట్టు
నిలిచినచో నిల్వ నలవి కాదు
మను జేంద్రుతో నైన మాటాడ నైపదు
పనులయం దేమియు మనసు గ్రేదు
నడుచుచో నడుగులు తడబాటు గైకొను
దగ బందువుల నైన నగవు రాదు
తెవులు పుట్టినరీతి దేహంబు కృశియించు
గల నైన నిద్దుర గలుగ బోదు
శివశివా ధాత్రి దా వలచిన వధూటి
బాయు వెత వద్దు సు మ్మెట్టి పలువ కైన : భూనుత... 92

కుక్కుటేశ్వర శతకము

సంపూర్ణము.

